ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 44 సంచిక : 8 అభివృద్ధి మాసపత్రిక జూన్ 2016 ₹ 22

## ప్రగతి పథంలో భారతదేశం

**సాధికారతతో పునరుత్తేజం దిశగా**
చరణ్ సింగ్

**సమగ్ర పాలనకు మార్గం ఈ - గవర్నెన్స్**
రంజిత్ మెహతా

విశిష్ట వ్యాసం
**వ్యవసాయం - రైతు సంక్షేమం - ప్రస్తుత ముఖ చిత్రం**
డాక్టర్ జె.పి మిశ్రా



'యోగ' ప్రత్యేక విభాగం

**ఆనందమయ జీవనం కోసం యువతకు యోగ**
డాక్టర్ ఈశ్వర ఎన్.ఆచార్య

**'యోగ'కు అంతర్జాతీయ ప్రాముఖ్యం**
డాక్టర్ ఈశ్వర్ వి.బసవారెడ్డి

ప్రత్యేక వ్యాసం
**యోగవిద్యకు శిక్షణ - సర్టిఫికెట్లు**
రవి.పి.సింగ్, మనీష్ పాండే

## ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని బలియాలో మే 01, 2016న ఉజ్వల్ యోజన పథకాన్ని ప్రారంభించారు. పేదరిక రేఖకు దిగువనున్న ఐదు కోట్ల మందికి రానున్న మూడేళ్ళలో రూ. 8,000/-ల అంచనా వ్యయంతో వంటగ్యాసు సౌకర్యాన్ని కల్పించాలనేది ఈ పథకం లక్ష్యం. ఈ పథకంలో భాగంగా కనెక్షన్ తీసుకునే ప్రతి పేద ఇంటికీ, ప్రతి కనెక్షనుకూ రూ. 1600/-ల చొ.న ఆర్థిక సహాయం ఉంటుంది. అయితే ఎవరికి ఈ కనెక్షన్లు ఇవ్వాలనేది, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తిస్తాయి. మనదేశంలో పేదలకు వంటగ్యాసు సౌకర్యం అందుబాటు చాలా తక్కువనే చెప్పాలి. సంప్రదాయ ఇంధనాలైన బొగ్గు, వంట చెరకు వంటి వాటితో వంట చేసే మహిళలకు, ఊపిరితిత్తుల కాన్సర్, గుండెజబ్బు, సి.ఓ.పి.డి. వంటి అనారోగ్యాలతో సగటున సంవత్సరానికి ఐదు లక్షల మంది మహిళలు అకాల మరణం పాలవుతున్నారు.

ఌ ఌ ఌ ఌ

## పదికోట్లు దాటిన ఉజాలా పంపిణీ




విద్యుత్ పొదుపుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఎల్. ఈ.డి. బల్బుల పంపిణీ పదికోట్లు దాటింది. ఈ బల్బు వినియోగం వల్ల 30-35 శాతం విద్యుత్తు ఆదా అవడమే కాక, కర్బన ఉద్గారాల స్థాయి కూడ గణనీయంగా తగ్గుతుంది. ఈ బల్బులను 2014-15లో కేవలం 30 లక్షలే పంపిణీ చేస్తే, 2015-16లో 15 కోట్ల బల్బులను, అందునా, తొమ్మిది కోట్ల బల్బులను ఉజాలా పథకం క్రింద పంపిణీ చేశారు. మార్చి 2019 నాటికి మొత్తం ఈ బల్బులనే వినియోగంలోకి తేవాలనేది లక్ష్యం. దీనివల్ల దేశానికి 1,298 కోట్ల కిలోవాట్ల విద్యుత్తు ఆదా అవుతుందని అంచనా. దీనివల్ల సరాసరి సంవత్సరానికి 12 కోట్ల టన్నుల కార్బన్ డైయాక్సైడ్ విడుదల తగ్గుతుందని కూడ అంచనావేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలలో అమలవుతున్నఈ పథకం వల్ల 2,600 మెగావాట్ల పీక్ లోడ్ భారం తగ్గుతుంది. వినియోగదారులకు మొత్తంమీద రూ. 5,195 కోట్ల రూపాయల బిల్లు ఆదా అవుతుంది. రాయితీ ధరల్లో ఈ బల్బులను పొందగోరేవారు www.delp.in వెబ్సైట్‌లో నమోదుచేసుకోవచ్చు.

ఌ ఌ ఌ ఌ

■

**జూన్ 2016** ISSN : 0971-8729 **సంపుటి : 44** **సంచిక : 8**

# యోజన

ముఖ్య సంపాదకులు: **దీపికా కచ్చల్**
వరిష్ఠ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**
సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్): **వి.కె. మీనా**

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...


1. సాధికారతతో పునరుత్తేజం దిశగా 5
 – *చరణ్ సింగ్*
2. సమగ్ర పాలనకు మార్గం ఈ – గవర్నెన్స్ 9
 – *రంజిత్ మెహతా*
3. వ్యవసాయం – రైతు సంక్షేమం – ప్రస్తుత ముఖ చిత్రం 13
 – *డాక్టర్ జె.పి మిశ్రా*
4. ఆనందమయ జీవనం కోసం యువతకు యోగ 17
 – *డాక్టర్ ఈశ్వర ఎన్.ఆచార్య, డాక్టర్ రాజీవ్ రస్తోగి*
5. యోగవిద్యకు శిక్షణ – సర్టిఫికెట్లు 20
 – *రవి.పి.సింగ్, మనీష్ పాండే*
6. 'యోగ'కు అంతర్జాతీయ ప్రాముఖ్యం 23
 – *డాక్టర్ ఈశ్వర్ వి.బసవారెడ్డి*
7. విజ్ఞాన విపంచి 26
 – *ప్రాతూరి పోతయ్య శర్మ*
8. దర్పణం 29
9. దేశీయంగా సమ్మిళిత అభివృద్ధి – అంతర్జాతీయ వేదికపై కీలక భూమిక 31
 – *అచల్ మల్హోత్రా*
10. ఉత్తరాభిప్రాయం 35
11. సానుకూల జీవనానికి యోగ సూత్రాలు 36
 – *డా॥ హెచ్.ఆర్. నాగేంద్ర*
12. న్యూస్ ఛానళ్లలో వాణిజ్య ప్రకటనల ప్రభావం 40
 – *డాక్టర్ బొల్లం తిరుపతి*
13. భారతీయ విద్యా విధానం – నాణ్యతా ప్రమాణాలు 44
 – *దిశానవాని*
14. నైపుణ్యాభివృద్ధి, ప్రైవేటు రంగం 47
 – *ప్రమోద్ భాసిన్*
15. అన్ని శాస్త్రాలతో బంధం – గణాంకశాస్త్రం 49
 – *సుసర్ల మాధవి*


**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

### యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.

యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.

యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.

ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### ప్రగతి పథంలో భారతదేశం.




ఒక జాతి పురోగతి, దాని ఆర్థిక వ్యవస్థ,సామాజిక, మానవీయ, పర్యావరణ వనరులు వంటి ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాలన్నీ దేనికదే ప్రత్యేకత గలవి. ఇలాంటి అంశాల కారణంగా ఎంతో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు సైతం అనేక సవాళ్ళను ఎదుర్కొంటూ ఉంటాయి. ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి రెండూ కలసి సమంగా వృద్ధిచెందాలి. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, రవాణా, నీటిపారుదల, విద్యుత్ వంటి అంశాలలో ప్రగతి అంటే, మనం ఆర్థికంగా పురోగమిస్తున్నామనీ, విద్య, వైద్యం, తాగునీరు, గృహావసరాలు వంటి వాటిలో ప్రగతి అంటే మనం సామాజికంగా పురోగమిస్తున్నామని అర్థం. మొత్తంమీద రెండు రంగాలూ, మన ఆర్థిక స్థితిమీదనే ఆధారపడి ఉంటాయి. మన ఆర్థిక స్థాయిని మరింత పెంచుకుని, ఫలితాలను పంచుకొనే అవసరం ఎప్పుడూ ఉంటుంది. సమ్మిళిత వృద్ధి అంటే, సౌకర్యవంతమైన జీవనాన్ని ఇచ్చే విధంగా మన ప్రాథమీక సౌకర్యాలను అభివృద్ధి చేసుకోవడమే కాక, అదే సమయంలో అవకాశాలను కూడ పెంపొందించుకోవడం. దీనికి, అందరకీ సమానావకాశాలు, సమానంగా విద్యా, నైపుణ్యాభివృద్ధి ఉండాలి.

అయితే, నూటపాతిక కోట్లమంది వివిధ రకాల జనాభాతో అభివృద్ధి ఫలాలు సమాజంలో అందరకూ అందేటట్లు చూడడం నిజంగా ఒక సవాలే! ఇలాంటప్పుడే ప్రభుత్వం బహుముఖ ప్రతిభతో పని చేయాలి. ఈ విధంగా ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఈ సవాలును సమర్థంగా ఎదుర్కొనే విధంగా సమాయత్తమవాలి. ప్రజల స్థూలదేశీయోత్పత్తి, తలసరి ఆదాయాలు దేశాభివృద్ధికి తగినట్లుగా లేవని విధాన నిర్ణేతలు, ప్రణాళికా కర్తలు గ్రహించాలి. ఏ సమాజానికైనా ప్రగతికి కావలసిన ప్రాథమిక ఆవశ్యకత నైపుణ్యంగల మానవ వనరులు. నాణ్యమైన విద్య ద్వారా మానవ వనరుల అభివృద్ధి, అదికూడ సమాజంలోని అత్యంత పేద పిల్లలకు సైతం ఎంత అవసరమో, వారికి జీవనోపాధి కూడ అంతే అవసరం. అభివృద్ధి సూచికలకు నేడు పర్యావరణాన్ని కూడ ఒక ప్రధానావశ్యకంగా గుర్తిస్తున్నారు. ఎందుకంటే, ఆర్థిక, సామాజిక ప్రగతిలో వాతావరణ మార్పులు ఒక ప్రధానాంశంగా మారాయి కనుక! కరువు కాటకాలు, ప్రకృతి వైపరీత్యాలు మొత్తం ఆర్థిక ప్రగతినే కాదు, రైతు జీవనాన్ని కూడ ఛిన్నాభిన్నం చేయగలవు.

ఇటీవలి కాలంలో ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాలు, విధానాలు అట్టడుగు స్థాయిలోనున్న అతి సామాన్య పౌరుని కూడ చేరుతున్నాయి. వ్యవసాయానికీ, రైతుల సంక్షేమానికీ అత్యధిక వనరులను కేటాయిస్తూనే, ప్రధానమంత్రి జనధనయోజన, ముద్రా బ్యాంక్, స్వయం ఉపాధి–ప్రతిభా వినియోగం (Self Employment and Talent Utilisation-SETU) బేటి బచావొ బేటి పఢావొ వంటి పథకాల ద్వారా ఇంతవరకూ అభివృద్ధికి నోచుకోని సామాజిక వర్గాలను ప్రధాన జనజీవన స్రవంతిలోకి తేవడానికి కృషి చేస్తున్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి జీవన సురక్షా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సామాజిక భద్రతను కల్పించే లక్ష్యంతో ప్రారంభించారు. మౌలిక అవసరాలైన ఇళ్లు, రోడ్లు, రైల్వేలు, గ్రామీణ మౌలిక సౌకర్యాలు ఎవరికైనా అవసరమే. వాటికి తగిన ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి ఫలాలు సామాన్యులకు చేరడానికై, డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్ వంటి ఈ–గవర్నెన్స్ మరో ప్రాధాన్యతా అంశం. సరైన ఉపాధి అవకాశాలకు, నూతన ఉపాధి అవకాశాల ప్రారంభానికి, ఉన్నవాటిని సక్రమంగా నిర్వహించుకోడానికీ నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరం. దీనివలననే, అందరి ప్రగతి సాధ్యమయ్యేది!

ఏది ఏమైనా, ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉన్నపుడే అభివృద్ధి ఫలాలను సరిగా అందిపుచ్చుకోగలరు. ప్రపంచం మొత్తానికీ మంచి ఆరోగ్యానికి యోగసాధన ఎంతో ఉపయోగపడటం చూసి, ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరమూ, జూన్ 21 వ తేదీని అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించింది. దుర్భర దారిద్ర్యము, ఇతరులపై ఆధారపడే స్థాయి నుండి, తిండి గింజలను సైతం దిగుమతి చేసుకునే దౌర్భాగ్య స్థితి నుండి, రోగాలూ, పౌష్టికాహార లోపం నుండి ఒక జాతిగా మనం ఎంతో దూరం ప్రయాణించాము. స్వతంత్ర్యం వచ్చిన ఆరు దశాబ్దాల తరువాత నేటికి మన దేశం ఒక ప్రచండ శక్తిగా ఎదుగుతున్నది. ■

# సాధికారతతో పునరుత్తేజం దిశగా



**వచ్చే దశాబ్దానికల్లా వ్యవసాయేతర రంగంలో భారతదేశం 11 కోట్ల ఉద్యోగాలు కల్పించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, ఆసమయానికి భారతదేశ జనాభాలోని మూడొంతులలో రెండు వంతుల జనాభా ఉద్యోగం చేసే వయసులో ఉంటారు. ఏడాదికి సుమారు 11 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పించవలసి ఉంది. అందువల్ల ఉద్యోగాలు కోరేవారికి బదులుగా – ఉద్యోగాలు కల్పించేవారు, పారిశ్రామిక వేత్తలు ఎక్కువగా కావాలి.**

భారతదేశ పునరుత్తేజం కోసం 9 శాతానికి పైగా స్థిరమైన వృద్ధిరేటు సాధించడం కోసం 2014 మే నెల నుంచి భారత ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోంది. అప్పటినుంచీ అత్యధిక వృద్ధి రేటు సాధించడం కోసం భారత ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రకటించింది. సుమారు 8 శతాబ్దాల పాటు విదేశీయుల పాలనలో మన దేశ వనరులు క్షీణిస్తూ వచ్చాయి. తద్వారా సరాసరి ఆర్థిక వృద్ధిరేటు తగ్గింది. 1951 లో దాదాపు 53 శాతం (200 మిలియన్) మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉండటం తో భారత దేశం అతి తక్కువ ఆదాయం కలిగిన దేశంగా పరిగణించబడింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాలంలో మిశ్రమ సామ్యవాద సమాజ స్థాపనే ప్రధాన ధ్యేయంగా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. వినూత్నమైన విధాన చర్యల ఫలితంగానూ, కొన్ని చోట్ల తీవ్రమైన సంక్షోభం ఫలితంగానూ, భారతదేశం 20వ శతాబ్దంలో ముఖ్యమైన ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. 2015 నుంచీ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు పొందిన భారతదేశం – ఎన్నో అవాంతరాలను అధిగమిస్తూ పేదరిక స్థాయిని మొత్తం దేశ జనాభాలో 30 శాతం కంటే తక్కువ స్థాయికి విజయవంతంగా తగ్గించగలిగింది. వచ్చే ఐదేళ్ళలో వృద్ధి రేటును 7.3 శాతం కంటే ఎక్కువ స్థాయికి నమోదు చెయ్యాలని నిర్ణయించుకుంది. భారతదేశ ఆకర్షణీయమైన ఈ వృద్ధిరేటు విజయగాథలో అపూర్వమైన పరివర్తన ఉజ్వలమైన ఆర్థిక చరిత్రను సృష్టించింది. ఈ సమయంలో వ్యవసాయ అభివృద్ధి రేటు కాస్త క్షీణించినప్పటికీ పారిశ్రామిక రంగం విషయంలో అభివృద్ధి దాదాపు 25 శాతం దగ్గర నిలిచిపోయింది. ఒక పటిష్టమైన పునాదిపై స్థిరమైన అభివృద్ధి సాధించడం కోసం పారిశ్రామికరంగాన్ని బలోపేతం చేయడం చాలా ముఖ్యం. అందువల్లే 2014 మే నెలలో అధికారం లోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే (మేక్–ఇన్–ఇండియా) భారత్‌లో తయారీ ప్రచారాన్ని ప్రారంభించారు.

అభివృద్ధి సాధించడానికీ, పారిశ్రామిక రంగాన్ని పెంపొందించడానికీ – అనేక ఇతర అంశాలతో పాటు ఆర్థిక వనరుల లభ్యత చాల ముఖ్యం. ఈ నేపథ్యంలో ప్రాథమిక స్థాయి అభివద్ధిలో బ్యాంకింగ్ రంగం పాత్ర చాలా ప్రధానమైనది. అయితే బ్యాంకింగ్ రంగ సంస్థల నెట్ వర్క్ ఏర్పాటు తో పాటు విస్తృతమైన బ్యాంకు కార్యకలాపాలు

**చరణ్ సింగ్,** ఆర్థిక శాస్త్రంలో RBI ఛైర్ ప్రొఫెసర్, IIM బెంగళూరు.
E-mail: charansingh1960@gmail.com

అవసరమైన పౌరులకు ఆర్థికవనరులు అందుబాటులో ఉండాలి. వీటికి తోడు అవసరమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవసరం కూడా ఉంది. తద్వారా వ్యాపారం చేయడానికి అవసరమైన వనరులన్నీ అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే – ప్రధానమంత్రి జన ధన యోజన (PMJDY) కింద ప్రజలందరికీ – బ్యాంకు ఖాతాలు ప్రారంభించిన తర్వాత ముద్రా బ్యాంకు, స్టార్టప్, స్టాండప్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ వంటి ఇతర ప్రోత్సాహక పథకాలను ఒక క్రమ పద్ధతిలో భారత ప్రభుత్వం ప్రకటించింది.

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఇప్పటికే గుర్తింపు పొందిన భారతదేశంలో యువ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ వారికి తగిన ప్రతిఫలం (లాభాలు) అందే విధంగా కృషి చేయవలసి ఉంది. వచ్చే దశాబ్దానికల్లా వ్యవసాయేతర రంగంలో భారతదేశం 11 కోట్ల ఉద్యోగాలు కల్పించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఆసమయానికి భారతదేశ జనాభాలోని మూడొంతులలో రెండు వంతుల జనాభా ఉద్యోగం చేసే వయసులో ఉంటారు. భారతదేశంలో ఉద్యోగుల సంఖ్య 2022 నాటికి ఒక బిలియన్ కి చేరుకుంటుందని భావిస్తున్నారు. నిరుద్యోగం వల్ల సామాజిక అశాంతి చెలరేగకుండా అరికట్టడానికి వీలుగా వారికి ప్రయోజనకరమైన ఉపాధి కల్పించవలసిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం అనంతరం, ప్రణాళికల ప్రారంభదశలో పెరుగుతున్న శ్రామిక వర్గానికి ఉపాధి కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా ఉండేది. అయితే తర్వాతి సంవత్సరాల్లో ప్రయివేటు రంగం గణనీయమైన పాత్ర పోషించడం ప్రారంభించింది. 2012 నాటికి కూడా 90 శాతం పైగా ఉద్యోగులు ప్రయివేటు రంగంలోనే పనిచేస్తున్నారు. అయితే భవిష్యత్తులో ఏడాదికి సుమారు 11 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పించవలసి ఉంది. అందువల్ల ఉద్యోగాలు కోరేవారికి బదులుగా – ఉద్యోగాలు కల్పించేవారు, పారిశ్రామిక వేత్తలు ఎక్కువగా కావాలి.

### బ్యాంకుల పాత్ర

స్థిరమైన వృద్ధి సాధించడానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో పొదుపు చేసేవారి వనరులను – పెట్టుబడుల వైపు మళ్ళించి ఉత్పాదక పెట్టుబడులకు అవకాశాలను కల్పించాలి. బ్యాంకులు ఆస్తుల పరివర్తన కార్యక్రమాలను చేపట్టాలి. తద్వారా బ్యాంకులో ఖాతాదారుడు తన వనరులను జమ చేస్తే ఆ ధనాన్ని బ్యాంకులు వ్యాపారస్తులకు రుణాలుగా ఇస్తాయి. తమ ఆర్థికపరమైన సేవలను విస్తృతంగా అందుబాటులోకి తేవడం ద్వారా – సమాజంలో పేదరిక నిర్మూలనకు బ్యాంకులు కూడా తమ వంతు సహాయం చేయవచ్చు. అసమర్థమైన ఆర్థికవ్యవస్థ – పేద ప్రజల్లో అసమానత్వాన్ని పెంచుతుంది. తద్వారా లోపభూయిష్టమైన పారిశ్రామికవేత్తల చేతుల్లో పెట్టుబడిగా మారుతుంది.

బ్యాంకుల్లో ఉండే ధనం విస్తృతంగా – ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చే విధంగా – 1955 జూలై లో భారతీయ స్టేట్ బ్యాంకు (SBI) ని జాతీయం చేయడం జరిగింది. దేశంలోని బ్యాంకుల్లో ఉన్న ఆస్తులపై వ్యాపార కుటుంబాలు ఆధిపత్యం కలిగి ఉంటాయన్న అపోహను, దిగులును తొలగించడానికీ, సామాజిక న్యాయంతో ఆర్థికవృద్ధి సాధించడానికీ – ప్రభుత్వం 1969లో 14 బ్యాంకులను జాతీయం చేసింది. 1980లో మరో ఆరు బ్యాంకులను జాతీయం చేసింది. అప్పటినుంచీ భారతీయ బ్యాంకింగు విధానం నిర్మాణాత్మకమైన పరివర్తన చెందింది. వ్యవసాయ రంగానికీ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకూ, పరిశ్రమలకూ సమృద్ధిగా రుణాలను మళ్ళించడంలో అధికారులు కృతకృత్యులయ్యారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాలవారికి బ్యాంకు సేవలను అందుబాటులోకి తేవడం కోసం – భారతీయ రిజర్వు బ్యాంకు (RBI), జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (NABARD) విస్తృతంగా కృషి చేసాయి. ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ – 2011 జనాభా లెక్కల ప్రకారం – భారతదేశంలో 24.7 కోట్ల కుటుంబాల్లో – కేవలం 14.5 కోట్ల కుటుంబాలు (58.7 శాతం) మాత్రమే బ్యాంకు సేవల పరిధిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 16.8 కోట్ల కుటుంబాల్లో కేవలం 9.1 కోట్ల కుటుంబాలు (54.5 శాతం) మాత్రమే బ్యాంకు సేవలను ఉపయోగించు కుంటున్నాయి.

బ్యాంకింగు, డిపాజిట్ ఖాతాలు, నగదు జమ చేయడం, రుణాలు, బీమా, పించను వంటి ఆర్థిక సేవలను ప్రజలందరూ సులువుగా ఉపయోగించుకునే విధంగా అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో – ప్రభుత్వం 2014 ఆగస్టు లో ప్రధానమంత్రి జన ధన యోజన (PMJDY)ను ప్రారంభించింది. 2016 ఏప్రిల్ 27 నాటికి 21.7 కోట్ల ఖాతాలు ప్రారంభించడంలో PMJDY విజయవంతమైంది. 2014 మార్చి 31 వ తేదీ నాటికి అన్ని వాణిజ్య బ్యాంకుల్లో ఉన్న మొత్తం 122 కోట్ల ఖాతాలతో పోలిస్తే – ఇది ఒక అసాధారణమైన పెరుగుదలగా గుర్తించవచ్చు. అంతేకాదు వీటిలో 17.9 కోట్ల ఖాతాలకు రూపే కార్డులు జారీ చేయడం, 9.7 కోట్ల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయడం, వీటిలో 83.6 శాతం ఖాతాలు పనిచేయడం (Operational) విశేషంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 20.9 కోట్ల ఖాతాలు ఉండగా –

వాటిలో 12.8 కోట్ల ఖాతాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో 3.3 కోట్ల ఖాతాలతో ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉండగా – బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఒక్కొక్కటీ 2 కోట్ల ఖాతాలతో ఆ తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఈ ప్రోత్సాహంతో దాదాపు 95 శాతానికి పైగా కుటుంబాలు ఇప్పుడు బ్యాంకు సేవలను ఉపయోగించుకోవడం అతి ముఖ్యమైన వాస్తవం.

ఒక లక్ష్య సాధన దిశగా – పేద కుటుంబాలకు సహాయం అందించడానికి ఉద్దేశించిన JAM నెంబరు – ట్రినిటీ (జన్ ధన్ యోజన, ఆధార్, మొబైల్ నెంబరు) సౌకర్యంలో PMJDY ని కూడా అనుసంధానించారు. JAM కింద సాంకేతికపరమైన అభివృద్ధి, ప్రామాణీకరణ ద్వారా – బ్యాంకు శాఖలకు వెళ్ళకుండా మొబైల్ ఫోను ఉపయోగించి రుణాలు వంటి బ్యాంకు సేవలను వినియోగించుకునేందుకు వీలు కలుగుతుంది.

### ముద్రాబ్యాంకు, సామాజిక భద్రతా పథకాలు

చిన్న పారిశ్రామిక వేత్తలకు రుణాలు అందజేయాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం 2015 ఏప్రిల్ 8వ తేదీన సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి – తిరిగి రుణాలు అందజేసే సంస్థ (MUDRA) బ్యాంకు (MB)ని ప్రారంభించింది. దేశంలో దాదాపు ఆరు కోట్ల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో చిన్న చిన్న తయారీ సంస్థలు, వ్యాపార లావాదేవీలు లేదా వ్యాపార సేవలు అందించే సంస్థలు వంటి వ్యక్తిగతమైనవే ఎక్కువగా ఉన్నాయి. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అవసరం ఉండే సూక్ష్మ స్థాయి సంస్థలే లక్ష్యంగా – చిన్న చిన్న యూనిట్లకు రుణాలు అందజేసి – వాటి అభివృద్ధికి సహాయపడే ఆర్థిక సంస్థలకు రుణాలు అందజేసే – ఒక నియంత్రణ వ్యవస్థగా – ముద్రా బ్యాంకు పనిచేస్తుంది. దేశంలో అమలులో ఉన్న రేటు కంటే ఎక్కువ చెల్లించకుండా చిన్న పారిశ్రామిక వేత్తలకు రక్షణ కల్పించే విధంగా విధాన మార్గదర్శకాలు తయారుచేయడంలో ముద్రా బ్యాంకు సహాయం అందిస్తుంది. ప్రజలకు సామాజిక భద్రత కల్పించడం కోసం – బ్యాంకు ఖాతాల ద్వారా పనిచేసే మూడు పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అవి అటల్ పించన్ యోజన, జీవన్ జ్యోతి బీమా పథకం, సురక్ష బీమా పథకం. ఈ పథకాల ఫలితాలు బ్యాంకింగు రంగానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్నికల్పిస్తాయి. వాణిజ్యపరంగా వెసులుబాటు కల్పిస్తాయి.

### స్టాండప్ మరియు స్టార్టప్ ప్రోత్సాహకాలు

పారిశ్రామిక వేత్తలను – ముఖ్యంగా సమాజంలో అణగారిన వర్గాలు, మహిళలను ప్రోత్సహించడం కోసం 10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు – వారికి రుణ సౌకర్యం కల్పించడం కోసం – ప్రధానమంత్రి ఇటీవల 2016 ఏప్రిల్ నెలలో "స్టాండప్ ఇండియా " కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతదేశంలో అంకుర్ (స్టార్టప్) సంస్థలను ప్రోత్సహించి పటిష్టపరిచేందుకు వనరుల కేటాయింపు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పన్ను రాయితీల కల్పన, వ్యాపారం సులువుగా చేసుకోడానికి వీలుగా – ప్రభుత్వం – ఇంతకుముందే కేంద్ర బడ్జెట్‌లో అనేక చర్యలు ప్రకటించింది. 2016 జనవరి వరకు అంకుర సంస్థల బలోపేతానికి బడ్జెట్ ప్రకటనలు, అనంతర పరిణామాలూ కృషి చేశాయి. భారతదేశానికి ఎంతో అవసరమైన ఉపాధి కల్పన విధానాన్ని ముందుకు నడిపించడానికి ఇవి ఉపయోగపడ్డాయి.

### సవాళ్లు :

ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలనిస్తున్నాయి. అయితే ఆర్థిక రంగానికి అంతర్జాతీయంగా వెసులుబాటు కల్పించడం ద్వారా సమర్థవంతమైన ఉన్నత వృద్ధి సాధించడానికి ఎన్నో సవాళ్ళను అధిగమించవలసి ఉంది.

1. వడ్డీ రేట్లు ఒక సమస్య – ఎక్కువ మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్నప్పటికీ అప్పు తీసుకునేవారు తమకు అతి చేరువలో ఉన్న వాణిజ్య బ్యాంకు శాఖను విస్మరించి – వడ్డీ వ్యాపారస్తుల దగ్గరికే వెళ్తున్న విషయాన్ని మనం గుర్తించవలసి ఉంది. అందువల్ల వడ్డీ వ్యాపారస్తులు ఎక్కువ మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్నప్పటికీ – వారు ఎందుకు అంత విజయవంతమౌతున్నారో కారణాలు అధ్యయనం చేయవలసిఉంది. అంటే రుణాలు తీసుకోడానికి ప్రభావితం చేసే అంశం వడ్డీ రేటు ఒక్కటే కాదు అన్నది స్పష్టం అవుతోంది. చారిత్రాత్మకంగా, సాహిత్యవరంగా చాణిక్యుడు రూపొందించిన వడ్డీ రేటు నిర్మాణం చాలా చిక్కులతో కూడుకున్నది. వడ్డీ రేటు అంశం అప్పు తీసుకున్నవారి వ్యాపారం లో ఉండే చిక్కులను మరింత పెంచుతుంది. ఉదాహరణకు – ప్రాచీన భారతదేశంలో సాధారణ రుణంపై వడ్డీ రేటు 15 శాతం ఉండగా – వ్యాపారస్తులు 60 శాతం చెల్లించేవారు. వస్తువులు అడవి మార్గం ద్వారా తీసుకు వెళ్ళవలసి వస్తే వ్యాపారులు 120 శాతం చెల్లించవలసి వచ్చేది. అదే ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేసే వారైతే ఏడాదికి 240 శాతం చెల్లించాలి.
2. ఆర్థిక ప్రోత్సాహం – PMJDY కింద ప్రారంభించిన కొత్త ఖాతాలలో లావాదేవీలు పెంపొందించడం కోసం ఎన్నో రకాలైన పత్రాలు ఉన్నాయి. ఇవి ఖాతాదారుల్లో విశ్వాసం కల్పించడానికి, పర్యావరణ పరమైన విధానం అమలుచేయడానికీ, బ్యాంకింగ్ వ్యవస్థను ప్రోత్సహించాదానికీ ఉపయోగపడతాయి. ఆదాయం, ఆస్తులు అతి తక్కువగా ఉండటం, ఆర్థిక

ఉత్పత్తుల గురించి సరైన అవగాహన లేకపోవడం, లావాదేవీల చార్జీలు ఎక్కువగా ఉండడం, ఆర్థిక ఉత్పత్తులు ఖాతాదారులకు సౌకర్యవంతంగా, అనువుగా లేకపోవడం, భరించలేనివిగా ఉండటం, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, బ్యాంకు ఖాతాలు లేని వారికి వీలుగా లేని విధానాలు మొదలైనవి ఆర్థిక విధానం ఫలితాలు పొందడానికి ప్రధాన అడ్డంకులు గా ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాలు లేని ప్రజల ఇంటి వద్దకే బ్యాంకు కార్యకలాపాలు చేరే విధంగా చూసేందుకు ఎక్కువ సంఖ్యలో ATMల అవసరం ఉంది. ఉదాహరణకు చెప్పాలంటే - వడ్డీ వ్యాపారులు సాధారణంగా 5 నిముషాల లోపు అందుబాటులో ఉంటారు. అదే బ్యాంకుకు వెళ్ళాలంటే అంతకంటే ఎక్కువ సమయం పడుతుంది. మొత్తం ఆరు లక్షల గ్రామాలలో - కేవలం 50 వేల కంటే తక్కువ గ్రామాలలో బ్యాంకు శాఖలు ఉన్నాయి.

3. ముద్రా బ్యాంకు : ముద్రా బ్యాంకు పరిధిలో ఉన్న కార్యకలాపాలు నిర్వహించే సూక్ష్మ పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇవ్వడానికి వీలుగా వాణిజ్య బ్యాంకులు తమ అభిప్రాయాలను మార్చుకోవలసిన అవసరం ఉంది. సూక్ష్మ పారిశ్రామిక యూనిట్ల అవసరాల పట్ల బ్యాంకులకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉంది. సూక్ష్మ పారిశ్రామిక రంగానికి రుణాలు అందజేయడానికి వీలుగా పథకాలను రూపొందించాలి.

4. స్టాండప్, స్టార్టప్ పథకాలు : స్టాండప్ మరియు స్టార్టప్ పథకాలు పటిష్టపరచడానికి అనువుగా పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి పర్యావరణ విధానం ఆవశ్యకత ఎంతైనా ఉంది. పారిశ్రామికవేత్తల శిక్షణ కోసం ప్రపంచ స్థాయి సంస్థ ఏర్పాటుపై భారతదేశం పరిశీలించవలసిన అవసరం ఉంది. IITలు, IIMలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల తరహాలో - భారత పారిశ్రామికవేత్తల సంస్థ (ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎంటర్ పెన్యూర్ షిప్) ను నెలకొల్పవలసిన అవసరం ఉంది. వాణిజ్యం, న్యాయశాస్త్రం, వ్యాపార రంగాల్లో అధ్యయనం చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ స్థాయి కళాశాలలు నెలకొల్పే దిశగా - ఇప్పుడు విద్యావిధానంపై మరింత శ్రద్ధ పెట్టాలి.

దేశంలో ఉపాధికి అనువైన ఉద్యోగుల కొరతను తీర్చడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ స్వంత అంచనాల ప్రకారం - విశ్వవిద్యాలయాలు, సాంకేతిక కళాశాలల నుండి ప్రతీ ఏటా 12 మిలియన్ల మంది పట్టభద్రులుగా బయటకు వస్తున్నప్పటికీ అందులో కేవలం 10 శాతం మంది మాత్రమే ఉద్యోగాల్లో చేరడానికి అనువైన నైపుణ్యం కలిగి ఉంటున్నారు.

ధైర్యం చేసి - పారిశ్రామిక వేత్తగా మారడానికి కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటు అధ్యాపకుల నుండి కూడా సాధారణంగా - విముఖత వ్యక్తం అవుతోంది. దీనికి తోడు భారతీయ ఆర్థిక విధానంలో వైఫల్యాలను తట్టుకునే సహనం చాలా తక్కువ. దీనికి విరుద్ధంగా - సిలికాన్ వ్యాలీలో - మొదటి లేదా రెండు ప్రయత్నాలలో విఫలమైన పారిశ్రామిక వేత్తలకు ఆర్థికంగా సహాయం చేయడానికి - అక్కడి పెట్టుబడిదారులు ఉత్సాహంగా ముందుకు వస్తారు. విపత్తు జరిగినప్పుడు సహాయం చేయడానికి వీలుగా ఒక యంత్రాంగం అవసరం ఉంది. అందువల్ల సాహసం చేసి తమ ప్రయత్నంలో విఫలమైన పారిశ్రామికవేత్తలకు సామాజిక భద్రత లేదా బీమా కల్పించడానికి వీలుగా - ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందడానికి వీలుగా పర్యావరణ విధానాన్ని రూపొందించడానికి - ప్రభుత్వ అనుమతులు వేగంగా ఇచ్చి, పెద్ద సంఖ్యలో ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేస్తే సహాయకారిగా ఉంటుంది. ఉదాహరణకు - 110 ఇంక్యుబేటర్ల నుండి 1982 వరకు సంవత్సరానికి కేవలం 5 వందల అంకుర (స్టార్టప్) సంస్థలను మాత్రమే ప్రోత్సహించారు. అప్పటినుంచి కేవలం 40 వేల సాంకేతికపరమైన ఉద్యోగాలు కల్పించారు. చివరగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి వారికి తగిన శిక్షణ ఇవ్వడానికీ, అనుభవాలను పంచుకోడానికీ - వ్యవసాయానికి ఏర్పాటు చేసిన విధంగా ఒక ప్రత్యేకమైన టెలివిజన్, రేడియో ఛానెల్ ను ఏర్పాటు చేసే అంశాన్ని కేంద్రప్రభుత్వం పరిశీలించవచ్చు.

**ముగింపు**

నవ యువ జనాభాతో కూడిన భారతదేశం అతి వేగంగా ఆర్థికాభివృద్ధి చెందుతోంది. వీరు ఆర్థికంగా ఎదగడానికి తగిన అవకాశాలు ఉంటేనే లాభాలను ఆర్జించడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అందరికీ బ్యాంకు సౌకర్యాలు కల్పించటంతో పాటు - స్వయం ఉపాధి, అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని సమకూర్చడానికి ప్రయత్నాలు చేస్తోంది. తత్ఫలితంగా భారతదేశం 9 శాతం కంటే ఎక్కువగా వృద్ధి సామర్థ్యం సాధించడానికి యువత సాధికారత ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. సమీప భవిష్యత్తులో భారతదేశం అంతర్జాతీయ శక్తిగా ఎదగడానికి ఇది చాలా అవసరం.

■

# సమగ్ర పాలనకు మార్గం ఈ - గవర్నెన్స్




**ఈ- పాలన అంటే ఎలక్ట్రానిక్ పాలన కాదనీ ఈజీ ఎకనామికల్ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వివరణ ఇచ్చారు. జాతీయ ఈ-పరిపాలన ప్రణాళిక పేరిట ప్రభుత్వం ఒక విజన్‌ను ప్రజల ముందు ఉంచింది. సామాన్య పౌరుడు ప్రభుత్వసేవలను పొందాలంటే సమయాన్ని, డబ్బును కూడా తనస్థాయికి మించి వెచ్చించాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి జాతీయ ఈ-గవర్నెన్స్ ప్రణాళిక (ఎన్ఇజిపి) లక్ష్యంలో భాగంగా ఒక పరిష్కారాన్ని రూపొందించారు. దీని ప్రకారం ప్రతి ఆరు గ్రామాలకూ ఒక ఉమ్మడిసేవా కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు.**

సమాజంలోని అట్టడుగువర్గాలవారికి కూడా సమాచార సాంకేతిక పరిజ్ఞాన ఫలాలు అందడానికి, వారు పౌరసేవలు పారదర్శకంగా, ఇబ్బందులేమీ లేకుండా, సమయానికి పొందడానికి భారత ప్రభుత్వం దేశంలో ఈ -పరిపాలనను ప్రవేశపెట్టింది. కేంద్రం, రాష్ట్ర, స్థానిక, మున్సిపల్, పంచాయితీల స్థాయిలో ఉన్న పరిపాలను డిజిటలీకరించడంతో ప్రజలకు ప్రభుత్వాల మధ్య వారధిలా ఏర్పడుతుంది. అంతేకాదు పాదర్శకత స్థాపించబడుతుంది. ఇదే ఈ-గవర్నెన్స్ లక్ష్యం. ప్రపంచమంతా కుగ్రామంగా మారిపోతున్న ఈ సమాచార సాంకేతిక యుగంలో ఈ-గవర్నెన్స్ ప్రభుత్వం, ప్రజలకు అత్యంత సులువుగా అనుసంధానం చేసుకునే వీలు చిక్కింది.

జాతీయ ఈ -పరిపాలన ప్రణాళిక పేరిట ప్రభుత్వం ఒక విజన్‌ను ప్రజల ముందు ఉంచింది. పౌరులకు, వివిధ వ్యాపారాలకు ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన జాతీయ ఈ-పరిపాలన ప్రణాళిక సామాన్య మానవుడికి అతను నివసించేచోటే ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా అన్ని ప్రభుత్వసేవలూ అందించేటట్లుగా చూడటం. ఆ సేవలు సామాన్య మానవుడి ప్రాధమిక అవసరాలు తీర్చేలా సమర్ధవంతంగా, పారదర్శకంగా, విశ్వాసయోగ్యమైనవిగా, నమ్మకంగా అందించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. సుపరిపాలనను అందించడానికి ఈ గవర్నెన్స్ దోహదపడుతుంది. ఈ- పాలన అంటే ఎలక్ట్రానిక్ పాలన కాదనీ ఈజీ ఎకనామికల్ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వివరణ ఇచ్చారు. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా కోటి 70 లక్షల మంది శిక్షణ పొందుతారు. వీరికి ఉపాధి కల్పించడంతో పాటు దాదాపు 8.5 కోట్ల మంది పరోక్ష ఉపాధి పొందుతారని అధికారుల అంచనా.

90 దశకంలో భారత్‌లో ఐటీ కంపెనీలు అడుగుపెట్టడం మొదలు పెట్టాయి. వరల్డ్ వైడ్ వెబ్‌తో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. సమాచార సాంకేతిక రంగంలో నూతన ఒరవడి మొదలైంది. ఇక ఇంటర్నెట్, మొబైల్ సేవలు సామాన్యుడికి అత్యవసర జాబితాకు ఎక్కాయి. ఇప్పుడు ఇంటర్నెట్ పుణ్యమా అని ప్రపంచంలో ఎవరితోనైనా మాట్లాడవచ్చు, ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చు. ఎలాంటి సమాచారమైనా ఇట్టే పొందే అవకాశం ఉంది.

**రంజిత్ మెహతా,** డైరెక్టర్, పంజాబ్ - హర్యానా - ఢిల్లీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఢిల్లీ.
E-mail: ranjeetmehta@gmail.com

సమాచార, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంద్వారా ప్రభుత్వం పౌరులకు చేరువై మెరుగైన పరిపాలనను అందించ గలుగుతుంది. అంతేకాక వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణలను మెరుగుపరచడానికి... తద్వారా జవాబుదారీ తనం, పారదర్శకత పెంపొందించడానికి కూడా వీలవుతుంది.

ఇ-పరిపాలన ద్వారా తక్కువ ఖర్చుతో పౌరులు తక్కువ సమయంలో, సులభంగా పౌరసేవల కొరకు దరఖాస్తు చేసుకోడానికి, పౌరసేవలు పొందడానికి వీలు కల్పించడం ద్వారా ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచ గలుగుతుంది. కాబట్టి సుపరిపాలన అందించడానికి ప్రభుత్వాలకు ఈ గవర్నెన్స్‌ను ఉపయోగించుకోవాలనేదే లక్ష్యం. కేంద్ర, రాష్ట్రాలలోని ప్రభుత్వాలు సమాజంలోని అట్టడుగువర్గాలను కూడా చేరడానికి వివిధ ఈ గవర్నెన్స్ కార్యక్రమాలు అందించే సేవలు ఉపయోగపడతాయి. నిరాదరణకు గురైన ఆ వర్గాలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచు కోడానికి, తద్వారా సాధికారత సాధించడానికి ఈ- గవర్నెన్స్ ఉపయోగపడుతుంది. ఈవిధంగా ఈ- గవర్నెన్స్ పేదరికాన్ని తగ్గించడానికి, సమాజంలో సాంఘిక, ఆర్థిక అంతరాన్ని పూడ్చడానికి సాయపడుతుంది.

భారత ప్రభుత్వం 1990ల చివరలో దేశంలో ఇ-పరిపాలనను ప్రవేశపెట్టింది. ఆ తర్వాత ఇ-పరిపాలన కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసేందుకు 27 మిషన్ మోడ్ ప్రాజెక్టులు మరియు 8 కాంపొనెంట్స్ సహా జాతీయ ఇ-పరిపాలన ప్రణాళిక (ఎన్ఇజిపి)ను 2006 మే 18న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. సమాచార సాంకేతిక పరిజ్ఞాన విభాగము(డిఐటి), పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా సమస్యల విభాగము కలిసి ఈ గవర్నెన్స్ ప్రణాళిక(ఎన్.ఇ.జి.పి)ని రూపొందించాయి. జాతీయంగా, అంతర్జాతీయంగా ఇ-పరిపాలనను వేర్వేరుచోట్ల గతంలో విజయవంతంగా అమలుచేసిన అనుభవాల ప్రాతిపదికగా జాతీయ ఇ-పరిపాలన ప్రణాళిక(ఎన్.ఇ.జి.పి), కోసం ఒక మెరుగైన విధానానికి రూపకల్పన చేశారు.

ప్రస్తుతం మారుమూలప్రాంతాలలో నివశించే పౌరులు ఒక ప్రభుత్వశాఖ నుండి గానీ, దాని స్థానిక కార్యాలయంనుండి గానీ ఏదైనా సేవను పొందాలంటే సుదూర ప్రయాణం చేయాల్సివస్తోంది. సామాన్య పౌరుడు ప్రభుత్వసేవలను పొందాలంటే సమయాన్ని, డబ్బును కూడా తనస్థాయికి మించి వెచ్చించాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి జాతీయ ఈ- గవర్నెన్స్ ప్రణాళిక (ఎన్ఇజిపి) లక్ష్యంలో భాగంగా ఒక పరిష్కారాన్ని రూపొందించారు. దీని ప్రకారం ప్రతి ఆరు గ్రామాలకూ ఒక ఉమ్మడిసేవా కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు. ఒక కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం ఉండే ఈ కేంద్రంద్వారా గ్రామస్తులు ప్రభుత్వ సేవలను పొందవచ్చు. ఎక్కడైనా, ఎప్పుడైనా అనే ప్రాతిపదికన ఆన్ లైన్ సమీకృత సేవలను అందించే విధంగా ఈ ఉమ్మడి సేవాకేంద్రాలకు రూపకల్పన చేశారు.

**పహల్ - నగదు బదిలీ పథకం :**

ఇక ఈ గవర్నెన్స్‌లో మరో కీలక మలుపు పహల్ యోజన. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పహల్ యోజన ప్రపంచంలోనే అతిపెద్ద నగదు బదిలీ పథకంగా ఘనత సాధించింది. ఎల్‌పీజీ ప్రత్యక్ష లబ్ధి బదిలీ పథకాన్ని పహల్ లేదా 'ప్రత్యక్ష హస్తాంతరిత్ లాభ్'గా పిలుస్తారు. ఎల్‌పీజీ వినియోగదారుల్లో 65 శాతం మంది ఈ పథకం కిందికి వచ్చారు. అయితే ఇటువంటి పథకాలు చైనా, మెక్సికో, బ్రెజిల్‌లో అమలవుతున్నా అక్కడ 2.2 కోట్లకు మించి ఎందులోనూ నమోదు కాలేదు. పహల్ పథకం కింద ఎల్‌పీజీ సిలిండర్లు మార్కెట్ ధరకు విక్రయిస్తారు. వినియోగదారులు సిలెండరును కొనుగోలు చేసి మార్కెట్ ధరను చెల్లిస్తారు. అనంతరం వారి అకౌంట్‌కు సబ్సిడీ సొమ్ము బదిలీ రూ.40,000 కోట్లు ఆదా అవుతాయి. దేశంలో 97 శాతం మంది ఆధార్ కార్డు కలిగి ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ రాయితీలన్నీ ఆధార్ అనుసంధానం ద్వారానే లబ్ధిదారులకు అందించనున్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ విషయంలో ఎల్పీజీ రాయితీని నగదు బదిలీ పథకం (డీబీటీఎల్) ద్వారా అందించే 'పహల్' పథకానికి ఇప్పటికే ఆధార్‌ను అనుసంధానం చేశారు. ఎరువుల రాయితీని ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రైతులకు అందించేందుకు, చౌక దుకాణాలను ఆటోమేషన్ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పుడు ఆధార్‌కు శాసన హోదా కల్పిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించి ప్రభుత్వం దానిని చట్టబద్ధం చేసింది. 2016 ఫిబ్రవరి 29 నాటికి మొత్తం దేశ జనాభా 131.71 కోట్లు, జారీ అయిన ఆధార్ కార్డులు 98కోట్లు, మొత్తం డీబీటీఎల్ ఖాతాలు 16.5కోట్లు, ఆధార్‌తో అనుసంధానమైనవి 11.19 కోట్లుగా ఉన్నాయి.

ప్రభుత్వ పథకాలసబ్సిడీని నేరుగా వినియోగదారులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా అందిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద పథకంగా పహల్ ఇప్పటికే రికార్డు సృష్టించింది. ఈ కేవలం రెండు నెలల్లో లక్ష్యాన్ని సాధించినందుకు వినియోగదారులు, అధికారులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందించారు.

**డిజిటల్ ఇండియా**

దేశ సమాచార సాంకేతిక రంగ ప్రగతి సంపూర్ణ విప్లవం దిశగా వేసిన అడుగు డిజిటల్ ఇండియా. ఈ కార్యక్రమం ద్వారా సమాచార సాంకేతిక విప్లవం అన్నిరంగాలకు

వ్యాపింపచేసి ప్రపంచంతో సంబంధాలు ఏర్పరచుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో భాగంగా దేశంలో బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తృత పరచడం, అలాగే మొబైల్ కనెక్టివిటీని పెంచడం ముఖ్య ఉద్దేశ్యాలుగా ఉన్నాయి. డిజిటల్ ఇండియాలో ప్రధానంగా బీఎస్ఎన్ఎల్, రైల్ టెల్, పవర్ గ్రిడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా పెద్ద ఎత్తున నిధుల సమీకరణ, అలాగే ఖర్చు చేయనున్నారు. దీనివల్ల ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 68 శాతం మంది ప్రజలకు ఐటీ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యంగా డిజిటల్ ఇండియా కార్యక్రమం రూపొందించారు.

మరోవైపు డిజిటల్ ఇండియా కార్యక్రమంలో మరో ముఖ్య ఉద్దేశ్యం ఐటీ సేవలను విస్తృత పరచడంతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి రంగంలో ఉపాధి అవకాశాలను పెంపొందించడమే లక్ష్యం!

ఈ లక్ష్యాలను అందుకునేందుకు ప్రధానంగా డిజిటల్ ఇండియా ద్వారా బ్రాడ్‌బ్యాండ్ హైవేల రూపకల్పన, మొబైల్ కనెక్టివిటీని మరింత విస్తృత పరచడం, ప్రజల్లో ఇంటర్నెట్ పట్ల మరింత అవగాహన పెంచడం, ఈ- గవర్నెన్స్ : ఐటీ సేవల ద్వారా ప్రభుత్వ పాలన చేయడం, ఈ-క్రాంతి: ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ఐటీ సేవలను విస్తృతపరచడం, అందరికీ సమాచారం, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను పెంచడం, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులను సున్న శాతానికి వచ్చేలా ఉత్పత్తిని సాధించడం, అలాగే ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన, వ్యవసాయ రంగంలో ఐటీ సేవల వినియోగం, ఇలా డిజిటల్ ఇండియా కింద పలు కార్యక్రమాల రూపకల్పన చేసి సుపరిపాలన, పారదర్శకత ద్వారా ప్రజలకు అందిచడం, దేశ అభివృద్ధిలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్నారు.

ఇక డిజిటల్ ఇండియా కార్యక్రమంలో ముఖ్యంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు ఇతర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అలాగే డిపార్ట్‌మెంట్లు, రాష్ట్రప్రభుత్వాలు భాగస్వామ్యం అవుతున్నాయి. అలాగే ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా స్వయంగా ప్రధాని వ్యవహరిస్తున్నారు. ఇక ఈ-గవర్నెన్స్ కింద ప్రస్తుతం అమల్లో ఉన్న అన్ని కార్యక్రమాలు ఇకపై డిజిటల్ ఇండియా సమగ్ర పథకం కింద పనిచేయనున్నాయి. ఇక అలాగే డిజిటల్ ఇండియాలో ప్రధానమైనది అనుసంధానం, దేశంలోని అన్ని ప్రాంతాలు బ్రాడ్‌బ్యాండ్ ద్వారా అనుసంధానించబడటం డిజిటల్ ఇండియాలో మరో కీలకమైన దశ. గ్రామపంచాయితీలను ఆప్టికల్ ఫైబర్ ఆప్టిక్స్ ద్వారా కామన్ సర్వీస్ సెంటర్‌కు అనుసంధానించడం జరుగుతుంది.

ఇదిలా ఉంటే ఈ ఫైబర్ ఆప్టిక్స్ కనెక్టివిటీని ప్రభుత్వరంగ సంస్థ ద్వారా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల కోసం కొత్త పారిశ్రామిక వేత్తలకు అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. తద్వారా నూతన సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కల్పించినట్లు అవుతుంది. అలాగే ఫైబర్ ఆప్టిక్ కనెక్టివిటీ కార్యక్రమానికి ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లు అత్యంత అవసరం. ఈ తరహాలోనే కేంద్రం అందరికీ ప్రయోజనకారిగా ఉండే మార్గాన్ని ఎంచుకుంటోంది.

మరోవైపు అటు కార్పోరేట్ రంగం కూడా ప్రభుత్వం డిజిటల్ ఇండియా పట్ల చూపుతున్న చొరవపై తమ వంతు సహాయ సహకారాలతో ముందుకు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఐటీ సేవలు ప్రజా బాహుళ్యంలో పెరగడం వలన భారతీయ ఐటీ కంపెనీలకు మరింత అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. దీని ద్వారా భారతీయ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరే అవకాశం ఉంది. ఇక అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాల వినియోగం పెరిగే అవకాశం ఉంది. అలాగే హార్డ్‌వేర్ ఇండస్ట్రీ సైతం బలోపేతం కానుంది. సుమారు 12 శాతానికి పైగా ఎగుమతులు పెరగనున్నాయి.

టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిజిటల్ ఇండియాలో కార్యక్రమంగా చేపట్టనున్నారు. 2016 సంవత్సరంలో ఐటీ రంగంలో రూ. 2.32 లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరగనుండగా, 2017 నాటికి రూ.2.59 లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరగనున్నాయి. ఇక హార్డ్‌వేర్ రంగంలోనూ దేశాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు డిజిటల్ ఇండియా దోహదం చేస్తుంది. డిజిటల్ ఇండియా మూలంగా నెట్‌వర్క్ సంస్థలు వినియోగదారులను ఆకర్షించేందుకు 4జీ లాంటి వేగవంతమైన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది.

అలాగే 2014 -15 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం లక్ష గ్రామపంచాయితీలను ఫైబర్ ఆప్టిక్‌తో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంది. అయితే ఆ తర్వాత ఈ సంఖ్యను 50వేల గ్రామాలకు తగ్గించారు. ఆ తర్వాత 20వేల గ్రామ పంచాయితీలను ఫైబర్ ఆప్టిక్‌తో అనుసంధా నించారు. దీనికి భారత్ నెట్ అని నామకరణం చేశారు. అలాగే 2015 డిసెంబర్ నాటికి 32వేల 272 గ్రామపంచాయితీలను అనుసంధానించడంతో పాటు 76,624 కిమీ. మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను విస్తరింపచేసినట్లు ప్రభుత్వ డాటా ప్రకారం నిర్ధారించారు.

భారత్‌నెట్ ప్రాజెక్టు ద్వారా గ్రామాల్లో 2 ఎంబీపీఎస్ నుంచి 20 ఎంబీపీఎస్ వేగంతో గృహఅవసరాలు, విద్యాసంస్థల నెట్ అవసరాలను తీర్చనున్నారు.

**డిజిటల్ ఇండియా కింద చేపట్టే కీలక ప్రాజెక్టులు..**

దేశ అభివృద్ధికి కీలకంగా భావిస్తోన్న ఈ-గవర్నెన్స్, ఈ - క్రాంతి, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ, బ్రాండ్ బ్యాండ్ హైవేలు, మొబైల్ కనెక్టువిటీ, పబ్లిక్ ఇంటర్నెట్ యాక్సెస్ ఇంకా ఐటీ ఆధారిత రంగాలకు ఊతమివ్వడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. డిజిటల్ ఇండియా వారంలో భాగంగా ప్రారంభమైన పలు డిజిటల్ సేవల వివరాలను ఈ క్రింద చూడొచ్చు..

**1. డిజిటల్ లాకర్ సిస్టం :**

బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్ లలో భద్రపరుచుకుంటున్నట్లుగానే పాన్ కార్డ్, పాస్ పోర్ట్, ఆధార్ కార్డ్ వంటి ముఖ్యమైన పత్రాలను కేంద్ర ప్రభుత్వం అందించే డిజిటల్ లాకర్ లో సౌకర్యవంతంగా భద్రపరుచుకోవచ్చు. క్లౌడ్ కంప్యూటింగ్ ఆధారంగా ఈ వ్యవస్థను డిజైన్ చేసారు.

**2. మైగవ్.ఇన్:**

ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రభుత్వ వ్యవహారలన్నీ సమన్వయరీతిలో పౌరులకు అందుబాటులోకి తీసుకువచ్చి సుపరిపాలనకు దోహదపడుతుంది.

**3. స్వచ్ఛ్ భారత్ మొబైల్ మిషన్ యాప్:**

చేకూరు ప్రయోజనాలు: స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకువెళ్లేందుకు ఈ యాప్ దోహద పడుతుంది.

**4. ఈ - సంతకం**

ఈ - సంతకం ద్వారా పౌరులు తమ ఆధార్ కార్డ్‌లను ఉపయోగించుకుని డాక్యుమెంట్‌ల పై డిజిటల్ సంతకాలను చేయవచ్చు. తద్వారా డబ్బు, సమయం ఆదా అవటంతో పాటు మీ సంతకానికి చట్టబద్ధంగా గుర్తింపు ఇంకా గోప్యత లభిస్తుంది.

**5. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సిస్టం:**

ఈ - ఆస్పత్రి పథకం ద్వారా పారదర్శకమైన ఆరోగ్య సేవలను దేశ పౌరులు పొందవచ్చు. ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్, రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు, రక్తం అందుబాటు వంటి ముఖ్యమైన సేవలను ఈ - ఆస్పత్రి పథకం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలు పొందవచ్చు.

**6. జాతీయ ఉపకారవేతన పోర్టల్ :**

జాతీయ ఉపకారవేతన పోర్టల్ చేకూరే ప్రయోజనాలు: ఈ పోర్టల్ ద్వారా ఉపకారవేతనాలకు అర్హులైన విద్యార్థులు కాలపరిమితిలోపు తమ అప్లికేషన్‌లను పంపించటంతో పాటు తమ ఉపకార వేతనాల బదిలీ తీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

**7. డిజిటైజ్ ఇండియా ప్లాట్‌ఫామ్**

ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి అన్ని రికార్డులను డిజిటలైజ్ చేసే కార్యక్రమమే డిజిటైజ్ ఇండియా ప్లాట్‌ఫామ్

**8. భారత్ నెట్ ప్రోగ్రామ్**

దేశంలోని 2,50,000 గ్రామ పంచాయితీలకు హై స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించే లక్ష్యంతో భారత్ నెట్ ప్రోగ్రామ్ పనిచేస్తుంది.

**9. బీఎస్ఎన్ఎల్ తరువాతి జనరేషన్ నెట్‌వర్క్**

బీఎస్ఎన్ఎల్ తరువాతి జనరేషన్ నెట్‌వర్క్‌ను ప్రజలకు చేరువచేయటం

**10. బీఎస్ఎన్ఎల్ ఉచిత వై-ఫై హాట్‌స్పాట్**

బీఎస్ఎన్ఎల్ ఉచిత వై-ఫై హాట్‌స్పాట్‌లను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయటం.

**11. బ్రాడ్‌బ్యాండ్ హైవేలు:**

దేశ వ్యాప్తంగా పౌరులకు విస్తృతంగా బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించేందుకు డిజిటల్ ఇండియాలో భాగంగా విస్తృతంగా బ్రాడ్‌బ్యాండ్ సేవలను వాడకంలోకి తెచ్చేందుకు కేంద్రం నడుంబిగించింది. ప్రభుత్వం ప్రజల మధ్య ఈ బ్రాండ్ బ్యాండ్ హైవేలు వారధిగా ఏర్పడేందుకు దోహదం చేస్తాయి.

**ప్రభుత్వ విధానాలు :**

ప్రభుత్వ సమాచార సాంకేతిక పరిజ్ఞాన విభాగము (డి.ఐ.టి) విభాగం కింద అటు ఈ గవర్నెన్స్, ఈ క్రాంతి సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రభుత్వం కొన్ని పాలసీలను తీసుకుంది. ఇందులో భాగంగా ఓపెన్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్(ఏపీఐ) భారత ప్రభుత్వ పాలసీ, అలాగే ఈ మెయిల్ పాలసీ ఆఫ్ భారత ప్రభుత్వం, ఇలాగే సోర్స్ కోడ్ పాలసీ, అప్లికేషన్ డెవలప్ మెంట్ పాలసీ, క్లౌడ్ రెడీ పాలసీలను ప్రవేశపెట్టనుంది.

**1. బీపీవో పాలసీ**

దేశంలోని వెనుకబడిన, ఈశాన్య ప్రాంతాల్లో బీపీవో పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని యువతకు ఉపాధి మార్గాలను చూపించనున్నారు.

**2. ఎలక్ట్రానిక్ డెవలప్‌మెంట్ ఫండ్:**

ఈ పాలసీ ప్రకారం పరిశోధన, అభివృద్ధి విభాగాలకు ప్రత్యేక నిధులను కేటాయించనున్నారు. ముఖ్యంగా పలు ఉత్పత్తుల తయారీకి, నూతన ఆవిష్కరణలకు దోహదపడేలా ఈ నిధులను వినియోగిస్తారు.

***తరువాయి 22వ పేజీలో...***

జీవనాధారం

విశిష్ట వ్యాసం

# వ్యవసాయం - రైతు సంక్షేమం - ప్రస్తుత ముఖ చిత్రం



**వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న శ్రామికుల వాటా 1993-94లో 64.8 శాతం నుంచి 2011-12కి 48.9 శాతానికి తగ్గింది. అయినప్పటికీ వ్యవసాయ రంగంలోనే ఎక్కువ సంఖ్యలో శ్రామికులు ఉన్నారు. 2020-21 కల్లా ఆహారధాన్యాల డిమాండ్ 277 మిలియన్ టన్నులు, నూనె గింజల కోసం డిమాండ్ 71 మిలియన్ టన్నులు వుంటుందని అంచనా. కేంద్రం 2016-17 బడ్జెట్‌లో వ్యవసారంగానికి రూ.35,984 కోట్లు కేటాయించింది. రూ 9 లక్షల కోట్లను రైతులను రుణాలుగా అందించాలనే లక్ష్యంగా నిర్ణయించారు.**

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం అతిపెద్ద రంగంగా వుంది. 2014-15 గణాంకాల ప్రకారం మొత్తం స్థూల విలువ 16.1 శాతం ఉంది.(కొత్త సిరీస్ కింద 2011-12 ధరల ఆధారంగా) ఆర్థిక సూచీలు కాకుండా ఆహారం-న్యూట్రిషన్లో అతిపెద్దరంగంగా అవతరించింది. ఉపాధి పరంగా సాంఘిక-భద్రత కల్పిస్తోంది. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న శ్రామికుల వాటా 1993-94లో 64.8 శాతం నుంచి 2011-12కి 48.9 శాతానికి తగ్గింది. అయినప్పటికీ వ్యవసాయ రంగంలోనే ఎక్కువ సంఖ్యలో శ్రామికులు ఉన్నారు. ఐతే పరిశ్రమలు, ఇతర ఆర్థిక సంస్థల్లో పనిచేసే కార్మికుల కంటే వ్యవసాయ కార్మికుల ఆదాయం తక్కువే. వ్యవసాయంలో తరుచు ఉత్పాదక అవవరోధాలు ఏర్పడడంతో ఈ రంగంలో ఒక విధమైన అస్థిరత ఏర్పడింది. వాతావరణంలో ఏర్పడుతున్న అసాధారణ మార్పులు వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నాయి. సంస్థాగత మద్దతు లభించక నష్టపోయే పరిస్థితులు తలెత్తుతున్నాయి. భారత దేశంలో మిలియన్ల సంఖ్యలో వున్న రైతు కుటుంబాలు తమ సంక్షేమం కోసం గొంతెత్తి చాటే పరిస్థితులు నెలకొన్నాయి. రైతుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టినా, ఆహార ధాన్యాలు, ఇతర వస్తువుల కోసం పెరుగుతున్న డిమాండ్ అలాగే వుంది. కాబట్టి రైతులకు అధిక ఆదాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టడంతో పాటు , సంస్థాగత సంస్కరణలు అమలు చేస్తూ సాంకేతికశిక్షణ రైతులకివ్వాలి.

ఆహారధాన్యాల కొరత తీరేలా వ్యవసాయ పంటలను అభివృద్ధి చేయాలి. 2020-21 కల్లా ఆహారధాన్యాల డిమాండ్ 277 మిలియన్ టన్నులు, నూనె గింజల కోసం డిమాండ్ 71 మిలియన్ టన్నులు వుంటుందని అంచనా. దేశంలో ఆహార ధాన్యాల్లో పప్పుల కోసం ఎక్కువ డిమాండ్ వుంది. అలాగే వినియోగ అవసరాల్లో 60శాతం వంట నూనెలు, కూరగాయల అవసరం వుంది. దీంట్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నవే.

ఉత్పాదకత పెంచడానికి కొన్ని చర్యలు చేపట్టవచ్చు. వ్యవసాయ భూముల అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతూ, రైతులలో వృత్తి నైపుణ్యం పెంచుతూ వారు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు అందిస్తే రైతులు

**డాక్టర్ జె.పి మిశ్రా,** సలహాదారు (వ్యవసాయం) నీతిఆయోగ్, భారత ప్రభుత్వం.
E-mail: mishrajaip@gmail.com

ఇతర వృత్తుల వైపు వెళ్లకుండా వ్యవసాయంలోనే ఉంటారు. రైతులు ప్రత్యామ్నాయ ఆహారపంటలు వేసుకునేలా ప్రోత్సహించాలి. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలు రైతులకు తెలియడంలేదు. కాబట్టి ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా రైతులకు వివిధ ప్రత్యామ్నాయ పంటల గురించి తెలియచేయటం, నీటి పారుదల వివరాలు, పంటల బీమా, జాతీయ వ్యవసాయ మార్కెట్లో పంటల గిట్టుబాటు ధరలు, రైతులకిస్తున్న ప్రోత్సాహకాలు, ధరల అస్థిరత వల్ల రైతులు నష్టపోకుండా చూడటం ఇలాంటివన్నీ వేగంగానే అమలు చేస్తోంది. అలాగే అధిక ఆదాయం వచ్చే సేంద్రీయ వ్యవసాయం, సంప్రదాయ సేద్యం,పశువుల పోషణ, చెరువుల్లో చేపల పెంపకం వీటిన్నింటికి ప్రభుత్వం అధికప్రాధాన్యత కల్పించింది. రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు, పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ మెళకువలు తదితర అంశాలపై సమగ్రమైన,విస్తృతమైన అవగాహన కల్పించటం కోసం కిసాన్ ఛానెల్ను ప్రారంభించింది. గత రెండేళ్లుగా ఈ ఛానెల్ ద్వారా ప్రభుత్వం ప్రారంభించిన వివిధ రైతు సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రచారం చేస్తూ, రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి కృషి చేస్తోంది. ప్రభుత్వం రైతుల కోసం ప్రారంభించిన కొత్త పథకాలన్నీ ఈ కిసాన్ ఛానల్ ద్వారా ప్రచారం చేస్తోంది. ఈకింద పేర్కొన్న పథకాలు అందులో ముఖ్యమైనవి.

### 1. ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకెఎస్వై)

ఏదేశంలోనైనా సరే 55 శాతం పంటలు వేసిన వ్యవసాయ భూముల్లో నీరులేకపోతే అది రైతులకు నష్టాన్ని కలగచేస్తుంది. దీనిని అధిగమించడం కోసం ప్రభుత్వం "ప్రతి పొలానికి సమృద్ధిగా నీరు–ప్రతిచుక్కకి ఎక్కువ పంట" కార్యక్రమం మొదలుపెట్టింది. ఇటీవల ప్రారంభించిన ప్రధానమంత్రి క్రిషి సంచయ్ యోజన నీటిసంరక్షణ విధానాలను తెలియచేస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 28.5 శాతం లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిని సాగులోకి తీసుకువచ్చారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 4510 కోట్లను కేటాయించింది. అలాగే సప్లిమెంటరీ గ్రాంట్గా రూ. 2510 కోట్లు ఈ మొత్తంలోనే ఉంచింది. ఈ సప్లిమెంటరీ గ్రాంట్ను ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన, ప్రతిపొలానికి నీరు, ఏఐబిపి పథకాలకు ఉపయోగిస్తారు.అలాగే 2015–16కి కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ద్వారా నదుల అభివృద్ధి–గంగానది పునరుద్ధరణ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు.అలాగే 2016–17 కేంద్రబడ్జెట్లో కూడా పి.ఎం.కె.ఎస్.వై.కి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. తద్వారా 89 సాగు నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి వీలవుతుంది. ఏఐబిపి నిర్వహణలో ఉన్న 89 ప్రాజెక్టులకు నీరు అందించటం వల్ల 80.6 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి సాగులోకి వస్తుంది. ఈ ప్రాజెక్టుల పూర్తి అవసరాల కోసం వచ్చే ఏడాదికి రూ.17000 కోట్లు అవసరం అవుతాయి.అలాగే వచ్చే ఐదేళ్లకు రూ.86,500 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ సాగునీటి ప్రాజెక్టుల్లో 23 ప్రాజెక్టులను మార్చి 31,2017 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అలాగే దీర్ఘకాల సాగునీటి ప్రాజెక్టుల నిధి కోసం నాబార్డ్ సహకారంతో రూ.20,000 కోట్లను కేటాయించారు. మొత్తం మీద చూసుకుంటే 2016–17 సంవత్సరాలలో రూ.12,517 కోట్లను బడ్జెట్ మద్దతుగా, మార్కెట్ రుణాలుగా ప్రతిపాదించారు.

దేశంలో వివిధ రాష్ట్రాలు నీటి సంరక్షణ విధానాలు అమలు చేస్తున్నాయి. ఇందులో మహారాష్ట్ర ప్రభుత్వం "జల్ యుక్త షివార్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్)ను ఇందులో భాగస్వామ్యం కల్పించి నిధులు కేటాయించారు. మహారాష్ట్రలో నీటి వనరుల సృష్టి, పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్నారు. కర్నాటక ప్రభుత్వం సూక్ష్మనీటి పారుదల, బిందు సేద్యం, స్ప్రింకర్ల వ్యవస్థ కోసం కేంద్రప్రభుత్వ సాయం ద్వారా 100శాతం నిధులు సబ్సిడీగా ఇస్తోంది. గుజరాత్ ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ కోసం రైతులే నిర్వహించుకునేలా సంస్థను ఏర్పాటు చేసింది. అలాగే గుజరాత్లో రైతుల కోసం ఏర్పాటు చేసిన హరిత కార్పొరేషన్ కేంద్ర నిధులు అందుకుంటోంది. ఈ నిధులను సూక్ష్మ సేద్యం కోసం మూడు సంవత్సరాలపాటు వినియోగిస్తారు. అలాగే రాజస్థాన్ ప్రభుత్వం మరో ముందడగు వేసి కాలువల మూసివేత నిర్ణయాన్ని రద్దుచేసుకుంది. నిరంతర నీటి సరఫరా కోసం ప్రణాళికలు రూపొందించింది. స్ప్రింకర్ వ్యవస్థని ఆధునీకరించింది. దేశంలోని మిగిలిన రాష్ట్రాలు కూడా నీటి సంరక్షణ, తక్కువ నీటితో పంటల సేద్యంపై రైతులకు శిక్షణ,అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

### 2 ప్రధానమంత్రి క్రిషి బీమా యోజన

జాతీయ వ్యవసాయ బీమా పథకంలో మార్పులు చేసి ప్రధానమంత్రి క్రిషి బీమా యోజన 2016లో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రైతు భాగస్వామ్యాన్ని హేతు బద్ధంచేసి బీమా మొత్తాన్ని 2% గరిష్ట సీలింగ్గా నిర్ణయించారు. ఖరీఫ్ సీజన్లో ఆహారధాన్యాలు, పప్పులు, నూనె గింజల పంటలకు 5శాతం,

రబీ సీజన్‌లో 1.5 శాతం తగ్గించారు. మొత్తంగా చూస్తే రబీ,ఖరీఫ్ సీజన్లకు, వాణిజ్య పంటలకు, ఉద్యాన పంటలకు రూ.5500 కోట్లు, 2016-17 సంవత్సరాలకు కేటాయించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే పంటనష్టాలను ఈ నిధుల ద్వారా ఆదుకుంటారు.

### 3 బీమా ఆరోగ్యపథకం

హరిత విప్లవం వల్ల క్రమంగా ఎరువుల వాడకం పెరుగుతూ వస్తోంది. ఈ దశలో యూరియా, నైట్రోజన్లకు అనుకూలమైన వనరుగా ఉంది..1970లో నైట్రోజన్ నిష్పత్తి 6:1, 9:1గా వుంది. తర్వాత క్రమంలో 10:2, 9:1గా మారింది.1996 వరకు ఇదే దశలో ఉండగా, తర్వాత దీనికివ్యతిరేక దిశలోకి మారింది. 2012-13 వచ్చేసరికి వీటి నిష్పత్తి 8:2 , 3.2:1గా వుంది. భారతీయ రైతులు చాలా ఎక్కువ శాతం యూరియా ఉపయోగించేవారు. సాగుచేసుకునే భూమికి యూరియా ఎంత మేరకు అవసరం అనేదానిపై స్పష్టమైన అవగాహన లేకుండానే పంటల సేద్యం జరిగిందనేది ఒక అభిప్రాయం.వర్షాధార ప్రాంతాల్లో మట్టిని పరీక్షించి దానికి అనుగుణంగా ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలియ చేయడానికి భూమి ఆరోగ్య పథకంకార్డును ప్రారంభించారు. ఈ పథకంలో లక్ష్యంగా 14కోట్ల వ్యవసాయ హోల్డింగ్స్‌కు రూ 368 కోట్లు అందించింది. అలాగే భూమి ఆరోగ్యం కోసం 2వేల ఎరువుల కంపెనీలు దేశవ్యాప్తంగా వచ్చే మూడేళ్లలో భూసార పరీక్షలు నిర్వహిస్తాయి. రైతులకు శిక్షణ,అవగాహన కార్యక్రమాలు చేపడుతాయి.

### 4.పరంపరాగత్ క్రిషి వికాస్ యోజన-సేంద్రీయ సేద్యం ఈశాన్య భారతం:

వర్షాధార ప్రాంతాల్లో పంట దిగుబడి పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు కోసం కేంద్రప్రభుత్వం రెండు ముఖ్యమైన పథకాలను ప్రారంభించింది.

మొదటిది "పరంపరాగత్ క్రిషి వికాస్ యోజన" పథకం ద్వారా 5లక్షల ఎకరాల కోసం సేంద్రీయ సేద్య ఏర్పాట్లు చేశారు. మూడు సంవత్సరాలు లక్ష్యంగా నిర్ణయించారు. రెండవది "సేంద్రీయ వ్యవసాయం - అభివృద్ధి ఈశ్యనరాష్ట్రాలలో" ఈ పథకం కింద ఈ ప్రాంతాల్లో పెరిగిన సేంద్రీయ ఉత్పత్తి, దేశీయ ఎగుమతి మార్కెట్లను కనుగొనేందుకు ఈ పథకం ఉద్దేశించబడింది. ఈ రెండు పథకాల కోసం రూ.412 కోట్లు కేటాయించారు.

### 5. జాతీయ వ్యవసాయ మార్కెట్:

పంట పండించిన రైతులకు వ్యవసాయ మార్కెట్లో ప్రధానంగా సుంకాలు, పన్నులు అవరోధంగా మారాయి. సరైన పారదర్శక విధానంలేక గిట్టుబాటు ధరలు లభించక నష్టపోతున్నారు. ఒక రాష్ట్రంలోని వివిధ పంటలకు వివిధ ప్రాంతాలకు తలో రకంగా గిట్టుబాటు ధరలుంటున్నాయి. ఈ పరిస్థితులను నివారించడం కోసం కర్నాటక రాష్ట్రం ఒక పద్ధతిని ప్రవేశపెట్టింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం మరియు ఎన్.సి.డి.ఇ.ఎక్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఒక కార్పొరేషన్ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వివిధ పంటల ధరలు అప్పటికప్పుడు వేలంపాటలో నిర్ణయించడం, తర్వాత నిర్ణయించడం చేస్తారు. దీనిని ఆధారంగా చేసుకొని ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెట్ ద్వారా మరో పథకానికి రూపకల్పన చేసి ఆమోదించింది. మౌలిక నిధుల కోసం (అగ్రిటెక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఫండ్-ఎ.టి.ఐ.ఎఫ్)ను అమలు చేస్తున్నారు. 2015-16 మరియు 2017-18 సంవత్సరాలకు రూ 200 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఈ పథకం ద్వారా జాతీయ వ్యవసాయ మార్కెట్లో చిన్నతరహా రైతులను, అగ్రి ఉత్పత్తులు చేసే రైతులను ఆదుకుంటారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం (ఎస్.ఎఫ్.ఎ.సి) ద్వారా రైతులకు చేయూతనిందిస్తోంది. జాతీయ మార్కెట్ సృష్టించడానికి వ్యవసాయ ఉత్పత్తులను ఎంపిక చేసి మార్కెట్ కమిటీల ద్వారా ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ పోర్టల్ను ఏర్పాటు చేసింది. ఇ-ప్లాట్‌ఫామ్‌లు ద్వారా 585 హోల్‌సేల్ మార్కెట్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసింది. తద్వారా రాష్ట్రమంతటికి ఒకే విధమైన సింగిల్ లైసెన్స్ అమలవుతుంది. మార్కెట్ ఫీజు కూడా ఒకే విధంగా వుంటుంది. ధర తెలుసుకునేందుకు ఎలక్ట్రానిక్ వేలం సదుపాయం లభిస్తుంది.

### 6.ధరల స్థిరీకరణ నిధి:

పంటలు పండించిన తర్వాత గిట్టుబాటు ధరలు లభించక రైతులు నష్టపోతున్నారు. ధరల విషయంలో ఒక విధమైన అస్థిరత నెలకొంది.దీనిని పరిష్కరించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం "ధర స్థిరీకరణ నిధి"ని ఏర్పాటు చేసింది. ఈ నిధి ద్వారా వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు వీటిని చెడిపోకుండా నిల్వచేసుకునేలా రైతులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. అవసరమైనపక్షంలో గిడ్డంగి అధికారులే ఉత్పత్తులను నిల్వచేయటం, పంపిణీ చేయడం చేస్తారు. రైతుల సంక్షేమం, అదే సమయంలో వినియోగదారుల ప్రయోజనాలు కాపాడడం ఈ నిధి ప్రధాన ఉద్దేశం.

### 7. రాష్ట్రీయ గోకుల్ మిషన్:

పాడి పశువుల పెంపకం, దీని ద్వారా దేశంలో 21 మిలియన్ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయరంగంలో వస్తున్న ఆదాయంలో 25శాతం స్థూల ఆదాయం పాడి పశువుల పెంపకం ద్వారా వస్తోంది.వ్యవసాయ రైతులు ఎక్కువ శ్రమపడకుండానే వీటి ద్వారా ఆదాయం పొందుతున్నారు. పాడిపశువుల

ఉపాధి అనేది శరవేగంగా విస్తరిస్తున్న రంగం. పశువుల పెంపకందార్లకు చేయూత నందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ను 2014-15లో ప్రారంభించింది. ఇందులో భాగంగా పశువుల అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. పశువుల్లో సంతానోత్పత్తి, ఆరోగ్య సంరక్షణ కోసం 2013-14 నుంచి 2016 వరకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ కోసం రూ 500 కోట్లను కేటాయించింది. అదికాక స్వదేశీ జాతి పశువుల సంతతి అభివృద్ధి కోసం 2015-16కి మరో 50కోట్ల రూపాయలను కేటాయించింది.

**8.జాతీయ కామధేను పెంపక కేంద్రం:**

పశువుల సంతతి అభివృద్ధి కోసం ప్రభుత్వం జాతీయ కామధేను పెంపక కేంద్రాలను ఒకటి ఉత్తర భారతదేశంలో, మరొకటి దక్షిణ భారతదేశంలో ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా స్వదేశీ పశువుల జాతి సంతతి అభివృద్ధికి చర్యలు చేపడుతారు. ఎద్దుల వీర్యాన్ని భద్రపరచటం, కృత్రిమ గర్భధారణ పద్ధుతలపై రైతులకు వివరించటం చేస్తారు. దేశవాళీ పశుజాతుల ఆరోగ్య సంరక్షణ విధానాలు తెలియచేస్తారు. దేశీయమైన 39 పశువుల, 13 గేదెలను ఈ కేంద్రంలో వుంచి, వీర్యకణాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భద్రపరుస్తున్నారు. వీర్యనిధిని అందుబాటులో వుంచి పశువుల్లో కృత్రిమ గర్భధారణకు అవకాశం కల్పించి పశు సంతతి పెరిగేలా చర్యలు తీసుకుంటు ఉన్నారు. పశుసంతతి అభివృద్ధి కోసం మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లకు రూ. 25కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఈ ప్రాంతాలలో జాతీయ కామధేను పెంపక కేంద్రాలు ఏర్పాటవుతాయి.

**9.హరిత విప్లవం:**

దేశంలో మత్స్యసంపద అభివృద్ధికి ఎంతో అవకాశం వుంది. మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం హరితవిప్లవం దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందించింది. వచ్చే ఐదేళ్లలో ఇందుకోసం 3000 కోట్ల రూపాయలను మంజూరు చేసింది.

**10. నిధుల మద్దతు:**

వ్యవసాయం, అనుబంధరంగాల అభివృద్ధికి 2016-17లో ప్రభుత్వం అధికప్రాధాన్యతను ఇచ్చింది. కేంద్ర వ్యవసాయమంత్రిత్వ శాఖ 2016-17 సంవత్సరానికి రూ.35,984 కోట్లను కేటాయించింది. ఇదికాక ఇదే ఏడాదికి రూ 9 లక్షల కోట్లను రైతులను రుణాలుగా అందించాలనే లక్ష్యంగా నిర్ణయించారు. ఇదేకాక గ్రామీణ రోడ్లు, గ్రామీణ విద్యుదీకరణ ఇతర సామాజిక కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించింది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గ్రామీణభారతదేశం పాడిపంటలతో సుభిక్షంగా వుంటుంది. ■

# యోజన

**యోజన** జూలై, 2016 సంచిక
**"నీరు-అమూల్యమైన వనరు"**
అనే అంశంతో వెలువడుతుంది.

**యోజన** (తెలుగు)
మాసపత్రిక చందా వివరాలు,
చిరునామా మార్పు, పత్రిక
అందకపోవడం వంటి విషయాలపై
ఫోన్ నెం. 040-27546313కు
నేరుగా సంప్రదించవచ్చు.
**యోజన** పత్రికకు ఆన్‌లైన్‌లో
చందా చెల్లించడానికి
bharatkosh.gov.in సైట్‌లోకి
వెళ్ళి Publications Division
లింక్‌ను క్లిక్‌చేసి చెల్లించవచ్చు.

***- సీనియర్ ఎడిటర్***

## గమనిక

**వ్యాస కర్తలకు సూచన** యోజన మాస పత్రికకు వ్యాసాలు రాసేవారు తమ వ్యాసాల సాఫ్ట్ కాపీని పేజ్ మేకర్ 6.5 లేదా 7 మరియు 'అను 7' ఫాంట్‌లో పంపుతూ వ్రాత ప్రతిని కూడా తప్పనిసరిగా హామీ పత్రంతో జత చేసి పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, పుస్తకంగా ప్రచురించ లేదనీ పేర్కొనాలి. వ్యాసాలను పేజ్ మేకర్, పిడిఎఫ్ ఫార్మాట్‌లలోనూ, యూనికోడ్‌లో టైప్ చేసి వర్డ్ ఫార్మాట్‌లోనూ పంపాలి. రచనలు 15వ తేదీ లోపు యోజన కార్యాలయానికి పంపాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు. వ్యాసకర్తలు గమనించ గలరు.

- సీనియర్ ఎడిటర్, యోజన (తెలుగు)
205-రెండవ అంతస్తు, సిజిఓ టవర్స్,
కవాడిగూడ, హైదరాబాద్-500080.

**సక్రమజీవనం**

**జూన్ 21, అంతర్జాతీయ యోగ దినోత్సవం**

# ఆనందమయ జీవనం కోసం యువతకు యోగ




**నిల్వ ఉంచిన ఆహారం, అప్పటికప్పుడు లభించే ఆహారం, శరీరానికి అవసరంలేని ఆహారం, అధిక కొవ్వుకు కారణమయ్యే ఆహారం తీసుకోవడం పెరిగింది. దీనికి ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలు తోడయ్యాయి. అంతేనా... వీటన్నిటికీ సరైన విశ్రాంతి, వ్యాయామం లేకపోవడం కలగలసి మనల్ని అసహానానికి మారుపేరుగా మార్చేశాయి. ఫలితంగా మధుమేహం, అధిక రక్తపోటు, కీళ్లవాతం (arthritis), వెన్నెముక నొప్పి వంటి అనేక మనోశారీరక రుగ్మతలు చుట్టుముట్టాయి.**

భారతదేశంలో సంప్రదాయ ఆరోగ్య వ్యవస్థ, సంపూర్ణ జీవనాల సమ్మేళనంగా ఆవిర్భవించిన ప్రాచీన శాస్త్రమే యోగ. ఈ దేశపు సంస్కృతి, సంప్రదాయాలలోనే దీని మూలాలున్నాయి. వేల ఏళ్ల కిందట సాధువులు, రుషులద్వారా ఈ విజ్ఞానం రూపుదిద్దుకుంది. నానాటికీ పెరుగుతున్న సవాళ్లతో ఆరోగ్య సంరక్షణ అవసరాలు మార్చుకోవాల్సిన పరిస్థితులను ఎదుర్కోడానికి ఇప్పుడు విశ్వవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ విస్తృతంగా యోగాభ్యాసం చేస్తున్నారు. ప్రపంచంలో అందరికీ నేడు యోగా ఒక ఆకర్షణ కేంద్రంగా మారింది. జీవనశైలి మార్పులు, మానసిక రుగ్మతల నివారణ-నిర్వహణలో యోగా సరళం, సమర్థం, చౌకైనది కావడమే ఇందుకు కారణం. సమతుల రీతిలో అంతర్గత శక్తుల మెరుగుకు, అభివృద్ధికి తోడ్పడే కొన్ని శారీరక భంగిమలు, శ్వాస సంబంధ వ్యాయామాలు, ధ్యాన ప్రక్రియల సమ్మేళనమే యోగ.

యోగ పద్ధతులపై వివిధ రంగాల ప్రజలకు ఇప్పుడు ఎంతో అవగాహన ఉంది. అంతేకాకుండా సంపూర్ణ ఆరోగ్య సాధన-పరిరక్షణతోపాటు అనేక వ్యాధులను, రుగ్మతలను నివారించడంలో ఇది పోషించే కీలకపాత్రకు సంబంధించిన చైతన్యం కూడా వెల్లివిరుస్తోంది. ఒత్తిడి, మానసిక రుగ్మతలవల్ల ఎదురయ్యే సమస్యల నివారణ, సమర్థ నిర్వహణలో యోగాసహిత జీవనశైలికిగల ప్రాముఖ్యాన్ని శాస్త్రవేత్తలు, ఇతర వైద్య నిపుణులు గుర్తించారు. యోగవల్ల సమకూరే ప్రయోజనాలేమిటో కాలమే నిరూపిస్తూ వచ్చింది. యువత సహా అన్ని వయసులవారు మరింత ఆరోగ్యకర, అర్థవంతమైన, ఒత్తిడిరహిత, సమతుల, సంపూర్ణ జీవనం గడిపేందుకు సరళము, సమర్థము, చౌకైన యోగాభ్యాసం ఎంతో ఉపయుక్తం. యోగకు గల ప్రజాదరణ నేడు భారతదేశపు ఎల్లలుదాటి ప్రపంచమంతా విస్తరించింది. అనేక దేశాల్లో యువతరం యోగాభ్యాసం చేస్తోంది. ఈ ప్రక్రియకు ప్రాంత, మత, కుల, వర్గ, జాతీయతా భేదాలేవీ లేవు. ఇది సార్వత్రికం... సార్వజనీనం. కాబట్టే ఐక్యరాజ్యసమితి ఏటా జూన్ 21వ తేదీని 'అంతర్జాతీయ యోగ దినోత్సవం'గా ప్రకటించింది.

ఆరోగ్యమంటే... "సంపూర్ణ శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సు. అంతే తప్ప కేవలం అనారోగ్యం బాధించకపోవడమో, వ్యాధులు లేకపోవడమో కాదు" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నిర్వచించింది. శారీరక, మానసిక, సామాజిక

**డాక్టర్ ఈశ్వర ఎన్.ఆచార్య,** సంచాలకులు; కేంద్రీయ యోగ, ప్రకృతి వైద్య పరిశోధనా మండలి (CCRY&N), న్యూఢిల్లీ
E-mail: ccryn.goi@gmail.com
**డాక్టర్ రాజీవ్ రస్తోగి,** సహాయ సంచాలకులు (నేచురోపతి) E-mail: rrastogi.2009@gmail.com

శ్రేయస్సులకుతోడు నాలుగో ప్రమాణంగా 'ఆధ్యాత్మిక శ్రేయస్సు'ను కూడా సూచించింది. శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుల సమ్మేళనంతోనే ఈ నాలుగు ప్రమాణాలతో కూడిన సంపూర్ణ ఆరోగ్య స్థితికి చేరడం సాధ్యమని స్పష్టం చేసింది. ఇక్కడే యోగ పాత్ర ప్రారంభమవుతుంది. ఇది శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక-ఆధ్యాత్మిక ప్రమాణాలను సమీకృతం చేసి, మన వ్యక్తిత్వాన్ని సంపూర్ణ, సమతుల రీతిలో వికసింపజేస్తుంది. క్రమం తప్పకుండా చేసే యోగాభ్యాసం మన సామర్థ్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేస్తుంది. యువతరం మరింత ఆరోగ్యకరమైన, సమతుల, ఒత్తిడిరహిత, అర్థవంతమైన జీవనం గడపగలిగేలా మార్పుతేగలిగే శక్తి యోగాకు ఉంది. ఏమి చేయాలో, ఏమి చేయకూడదో 'ఐదు యమ, నియమాల' ద్వారా యోగా అవగాహన కల్పిస్తుంది. యోగాభ్యాసాలు అత్యంత సులభంగా ఆచరించదగినవేగాక మన దైనందిన అవసరాలతో సమన్వయం చేసుకోదగినవి.

పారిశ్రామికీకరణ, వేగంగా రూపుదిద్దుకుంటున్న నగర జీవనశైలి ఫలితంగా కాలుష్యం, ఒత్తిడి, ఆందోళన వంటి అనేక సవాళ్లు మనముందు నిలిచాయి. వీటితో వ్యవహరించడంలో నిద్రలేచింది మొదలు అర్థరాత్రి దాటేదాకా మన జీవనశైలి కూడా మరింత వేగంగా, యాంత్రికంగా మారి పోయింది. ఆరోగ్యకర ఆహారపుటలవాట్లు దారితప్పాయి. నిల్వ ఉంచిన ఆహారం, అప్పటికప్పుడు లభించే ఆహారం, శరీరానికి అవసరంలేని ఆహారం, అధిక కొవ్వుకు కారణమయ్యే ఆహారం తీసుకోవడం పెరిగింది. దీనికి ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలు తోడయ్యాయి. అంతేనా... వీటన్నిటికీ సరైన విశ్రాంతి, వ్యాయామం లేకపోవడం కలగలసి మనల్ని అసహనానికి మారుపేరుగా మార్చేశాయి. ఫలితంగా మధుమేహం, అధిక రక్తపోటు, కీళ్లవాతం (arthritis), వెన్నెముక నొప్పి వంటి అనేక మనోశారీరక రుగ్మతలు చుట్టుముట్టాయి. అలాగే ఈ కారణాలవల్ల అనేకానేక మానసిక అనారోగ్యాలు కూడా నానాటికీ ఎక్కువవుతున్నాయి. కుంగుబాటు, మనోవైకల్యం (schizophrenia) వంటి మద్యం, మాదకద్రవ్యాల వినియోగ సంబంధిత రుగ్మతలతో పెద్దసంఖ్యలో ప్రజలు బాధపడుతున్నట్లు తేలింది. ఇటువంటి పరిస్థితుల్లో శస్త్రచికిత్సతో అవసరం లేకుండా మనశ్శరీరాలకు సమర్థరీతిలో యోగా చికిత్సనందిస్తుంది. ఇందుకోసం ఆసనాలు, ప్రాణాయామం, షట్కర్మలు, సూర్యనమస్కారాలు, ధ్యానం వంటి పద్ధతుల అభ్యాసంతో సాంత్వన చేకూర్చి సంపూర్ణ ఆరోగ్య పునరుద్ధరణకు తోడ్పడుతుంది. ఆందోళన, కుంగుబాటు, మనోవ్యాకులత, ప్రవర్తనసంబంధ వైకల్యాలు/రుగ్మతలు, అవసరమైనంత తినకపోవడం (anorexia) వంటి మానసిక అనారోగ్యాలను యోగాభ్యాసంతో చక్కగా నివారించుకోవచ్చు. అలాగే తలనొప్పి, శ్వాసనాళాల వాపు, ఉబ్బసం, మధుమేహం, స్వీయనిరోధకత రుగ్మతలు వంటి పలు మనోశారీరక అనారోగ్యాలనూ సమర్థంగా నియంత్రణలోకి తెచ్చుకోవచ్చు.

యువతరాన్ని పీడిస్తున్న సమస్యలలో ఒత్తిడి, ఆందోళన ప్రధానమైనవి. ఒత్తిడి అంతర్గత లేదా బహిర్గత కారణాలవల్ల మానసికంగానో, శారీరకంగానో కలగవచ్చు. జీవితంలో ప్రధాన మార్పులు, పని లేదా పాఠశాల మార్పు, సంబంధాల్లో ఒడుదొడుకులు, ఆర్థిక సమస్యలు, విరామం లేని పని, పిల్లలు-కుటుంబం వంటివాటిని ఒత్తిడికి దారితీసే బహిర్గత కారణాలుగా పేర్కొనవచ్చు. ఇక దీర్ఘకాలిక ఆందోళన, నిరాశావాదం, స్వీయ ప్రతికూలత, అవాస్తవిక అంచనాలు/ పరిపూర్ణతవాదం, పిడివాద ధోరణి, సరళస్వభావ లోపం, అన్నీ ఉన్న లేదా ఏమీలేదన్న దృక్పథంలాంటివి ఒత్తిడికి అంతర్గత కారణాలుగా చెప్పవచ్చు. అలాగే భావోద్వేగ అసమతౌల్యం, అనిశ్చితి, ఆందోళన వంటివి మానసిక ఒత్తిడికి కొన్ని సార్వత్రిక వ్యక్తీకరణలు. ఇవన్నీ తలనొప్పి, నిద్రలేమి, కడుపులో నొప్పి, దద్దుర్లు, జీర్ణకోశ సమస్యలు, పేగుపూత, పెద్దపేగు పోటు, గుండెదడ, అధిక రక్తపోటు, గుండె రక్తనాళాల్లో అడ్డంకులు, బహిష్టు నొప్పి తదితరాలతో కూడిన మనోశారీరక వ్యాధి లక్షణాలు. వీటన్నిటినీ సమర్థంగా నియంత్రించడంలో క్రమం తప్పని యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయి. ఆసనాలు వేయడంవల్ల శరీరం, మనస్సు సాంత్వన పొందుతాయి. ఆలోచన విధానాన్ని ఏక కేంద్రకం చేస్తాయి. తద్వారా అభ్యాసకుల దృక్పథం మారుతుంది. దీర్ఘశ్వాసాభ్యాసం, యోగనిద్ర, ధ్యానంతో నిరాశావాద దృక్పథాన్ని పారదోలవచ్చు. మనసుకు ప్రశాంతత, అంతర్గత సంతృప్తి, ఆశావహ ఆలోచన దృక్పథం ఏర్పడతాయి.

జీవితాన్ని మరింత ఆరోగ్యకరం, సమతులం, ఒత్తిడిరహితం చేసుకునేందుకు దిగువ పేర్కొన్న కొన్ని ఆరోగ్యకరమైన జీవనశైలి విధానాలను యువతరం అనుసరించవచ్చు. ఆరోగ్య నిర్వహణ, వ్యాధుల నివారణకు ఇవెంతో దోహదపడతాయి. ఇవన్నీ సరళ, సులభాచరణ, దైనందిన క్రియాసమన్వయ, చౌకైన పద్ధతులు కావడం విశేషం. సహజ జీవనశైలితో పరస్పరం ప్రేమాదరణలను ఇనుమడింపజేసుకోవచ్చు. భావోద్వేగాలతో కూడిన సంబంధ బాంధవ్యాలు బలపడతాయి. మనసుకు ప్రశాంతత, స్థిరచిత్తం, ఆశావహ దృక్పథం అలవడతాయి. ఈ పద్ధతులేమిటంటే:-

**సంతులిత ఆహారం:**

మొట్టమొదటిది, అత్యంత ప్రధానమైన అలవాటు సంతులిత ఆహారం తీసుకోవడం.

మన ఆహారం సాధ్యమైనంతవరకూ ప్రకృతి సహజ రూపంలో ఉండాలి. రుతువులవారీ తాజా పండ్లు, తాజా పచ్చని ఆకుకూరలు, కూరగాయలు, మొలకెత్తిన గింజలు వంటివి తగు పరిమాణంలో తీసుకోవాలి. ఇవన్నీ క్షారసంబంధమైనవి కావడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, శరీరాన్ని శుద్ధిచేయడంద్వారా వ్యాధి నిరోధకత సంతరించుకునేలా చేస్తాయి.

**ఉపవాసం:**

ఆరోగ్య పరిరక్షణలో ఉపవాసం కూడా ఒక ముఖ్యమైన ప్రక్రియ. మన జీర్ణకోశ వ్యవస్థకు విశ్రాంతినివ్వటమే దీని ఉద్దేశం. ఈ ప్రక్రియ సందర్భంగా ఆహారాన్ని జీర్ణం చేసే కీలక శక్తి శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో నిమగ్నమవుతుంది. మనోశరీరాల నుంచి రుగ్మతల నిర్మూలనకు ఇదో అద్భుత చికిత్స. వారానికోసారి పరిమితంగా పండ్లరసాలు లేదా పండ్లతో ఈ ఉపవాస ప్రక్రియను అనుసరిస్తే చక్కని ఆరోగ్యం మన సొంతం.

**క్రమం తప్పని వ్యాయామం:**

యోగాభ్యాసం లేదా ఏదో ఒక క్రమం తప్పని వ్యాయామం సంపూర్ణ ఆరోగ్యానికి తప్పనిసరి. దీనివల్ల అన్ని అవయవాలకూ రక్తప్రసరణ మెరుగుపడి శరీరం చురుగ్గా మారుతుంది. వృద్ధాప్య ప్రక్రియను మందగింపజేసి, పరిపూర్ణ ఆరోగ్యాన్నిస్తుంది. ఇందుకోసం మన శక్తిసామర్థ్యాలనుబట్టి ఉదయపు నడక, పరుగు, మధ్యస్థపు పరుగు(జాగింగ్), యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం లేదా తోటపనివంటి శారీరక శ్రమకు వీలున్నవాటిని ఎంచుకోవచ్చు. వ్యాయామం మన శరీరాన్ని ఉత్తేజితం చేసి, శక్తిని ఇనుమడింపజేస్తుంది. మనలో ఆత్మవిశ్వాసంతో కూడిన ఆలోచనలకు ప్రేరణ కల్పించడంతోపాటు ఇతరత్రా భౌతిక ప్రయోజనాలను అందిస్తుంది. ప్రముఖ ప్రకృతి వైద్యుడు డాక్టర్ హెన్రీ లిండ్లర్ ఏమంటారంటే... “మన శరీర కణజాలంలో పేరుకుపోయిన వ్యాధిగ్రస్థ కారకాలను వ్యాయామం తొలగిస్తుంది. ధమనులు, సిరల్లో రక్తప్రసరణను ఉత్తేజపరుస్తుంది. ఊపిరితిత్తులను పూర్తి సామర్థ్యం మేర విస్తరింపజేస్తుంది. తద్వారా ఆక్సిజన్ స్వీకరణను పెంచుతుంది. శరీరంలోని వ్యర్థాలను, వ్యాధిగ్రస్థ పదార్థాలను చర్మం, మూత్రపిండాలు, పేగులు, శ్వాసకోశం తదితర అవయవాలద్వారా బయటకు నెట్టేసేందుకు తోడ్పడుతుంది.”

**విశ్రాంతి:**

పరిపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసంతో పాటు తగిన విశ్రాంతి... అంటే సుఖనిద్ర కూడా అవసరం. సరైన నిద్ర మనలో తాజాదనాన్ని నింపుతుంది. మనసును తేలికపరచి ఆహ్లాదకరం చేస్తుంది. అదే సమయంలో ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళనవల్ల అసంపూర్ణ నిద్రవల్ల ఆరోగ్యం దిగజారుతుందని గుర్తుంచుకోవాలి. కాబట్టి సుఖనిద్ర విషయంలో ఎన్నడూ రాజీపడకూడదు.

**సమృద్ధిగా నీరు తాగడం:**

ఆరోగ్య నిర్వహణ, రుగ్మతల నివారణకు సమృద్ధిగా నీరు తాగడం చాలా అవసరం. శరీరంలోని అనేక విషతుల్య పదార్థాలను కరిగించడమేగాక అంతర్గతంగా శరీరాన్ని శుభ్రపరిచే దివ్యౌషధం నీరే.

**ఆరోగ్యకర జీవనశైలి దిశగా మనమంతా పాటించాల్సిన కొన్ని విలువైన సూచనలు:**

1. రాత్రివేళ త్వరగా పడకమీదకు చేరండి. 7 గంటలపాటు సుఖంగా నిద్రించండి. సూర్యోదయం కాకముందే బ్రహ్మముహూర్తంలో మేల్కొనండి.
2. స్వల్ప, సమతుల సాత్విక ఆహారం తీసుకోండి.
3 పంచదార, ఉప్పు, భారీ భోజనం, ఎండుమిరప, మసాలాలు-ఊరగాయ వంటి పదార్థాల వాడకం తగ్గించండి. టీ, కాఫీలను పరిమితం చేయండి. మత్తుపదార్థాలు ఆపేయండి. నూనె, నెయ్యి వాడకం తగ్గించండి. యోగాభ్యాసకులకు శాకాహారం ఎంతో మంచిది.
4. భోజన సమయాలను నిర్దేశించుకోండి. ఉదయం 30 నిమిషాల యోగాభ్యాసం తర్వాత అల్పాహారంగా పండ్లు లేదా మొలకెత్తిన గింజలు లేదా ఉప్మా వంటిది స్వల్పంగా తీసుకోండి. మధ్యాహ్నం గోధుమ రొట్టె, స్వల్పంగా ఉడికించిన కూరగాయ ముక్కలు, సలాడ్, మజ్జిగ స్వీకరించండి. రొట్టెకన్నా కూరగాయ ముక్కలు, సలాడ్ ఎక్కువగా ఉండేలా చూసుకోండి.
5. భోజనంతో మంచినీళ్లు తీసుకోవడం మంచిది కాదు.. భోజనానికి అరగంట ముందు, భోజనం చేసిన అరగంట తర్వాత నీరు తాగండి.
6. నిత్యం ఉదయం లేదా సాయంత్రం ధ్యానం చేయండి. అన్ని ఉద్రిక్తతలు, ఒత్తిడులనుంచి ఉపశమనం లభిస్తుంది. దీనివల్ల శరీరం, మనసు దృఢతరమై జీవితంపై సానుకూల దృక్పథం పెంపొందుతుంది.
7. షట్కర్మలు, యోగాభ్యాసాల ద్వారా అంతర్గతంగా, బహిర్గతంగా శరీరాన్ని పరిశుద్ధం చేసుకోవాలి.
8 ప్రకృతిపై నమ్మకముంచండి... మిమ్మల్ని ఆశావహంగా, ఆత్మవిశ్వాసంతో ఉంచే బాధ్యత అది తీసుకుంటుంది.
9. అతిగా తినే అలవాటును తప్పించండి. ఆకలి లేకపోతే ఆహారం లేదు అన్న సూత్రాన్ని పాటించండి. ఆకలిగా ఉన్నప్పుడు ప్రారంభించి, ఇంకా తీరాల్సి ఉందనగా తినడం ఆపేయాలి. వారానికి ఒకరోజు రుతువులవారీ పండ్లతో ఉపవాసం చేయండి.
10. ఎక్కడికైనా వెళ్లాలంటే సాధ్యమైనంత వరకూ నడకకే ప్రాధాన్యమివ్వండి. మనశ్శరీరాలకు ఇదెంతో మంచిది. ■

ప్రజాదరణ

ప్రత్యేక వ్యాసం

# యోగవిద్యకు శిక్షణ - సర్టిఫికెట్లు




**యోగకు ప్రజాదరణ ఉండడంతో జీవితాన్ని అర్థవంతంగా గడపదలుచు కున్నవారు ప్రపంచవ్యాప్తంగా దీనికి ఆకర్షితులవుతున్నారు. యోగాభ్యాసంపట్ల ఆసక్తిచూపుతున్న వారికి సరైన శిక్షణ, మార్గదర్శనం అవసరమవుతాయి. ఇది నెరవేరాలంటే సుశిక్షితులైన, పేరుప్రఖ్యాతులున్న యోగా గురువులతో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ప్రమానాలకను గుణంగా యోగ గురువుల సామర్థ్యాన్ని పరీక్షించడం, తగిన శిక్షణా కేంద్రాలను గుర్తించడంపై ఇప్పుడు దృష్టి కేంద్రీకృతమైంది.**

**పరిచయం :**

మన రుషులు శతాబ్దాలతరబడి సాధనచేసి సాధించిన ఒక శిక్షణాశాస్త్రం, ఒక అభ్యాసవిద్య–'యోగ' అనీ, 'చికిత్సా శాస్త్రం' అనీ మన ప్రాచీన గ్రంథాలు ఘనంగా అభివర్ణించాయి. ఆ గ్రంథాల ఆధారంగా 'యోగ' ప్రక్రియలు క్రమేణా అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. మనిషి శరీరంమీద, మనసు మీద ఇది చూపే ప్రభావాన్ని దీనికున్న ప్రజాదరణను యావత్ ప్రపంచం అంగీకరించింది. జీవన గమనాన్ని సమూలంగా మార్చివేయగల ప్రక్రియగా ఇది అభివృద్ధి చెందిందనే విషయాన్ని చాలా మంది గ్రహించలేకపోతున్నారు. మొత్తం మానవ నాగరికతను సమూలంగా, సమున్నత స్థితికి చేర్చగల సత్తా దీనికున్నది.

'యోగ' సంస్కృత శబ్దం. దీని అర్థం–కలుపుట, ఏకం చేయుట అని. యోగ అనగానే అది మన సంస్కృతిలో ఆచారవ్యవహారాల్లో ఆధ్యాత్మికపరమైనదనీ, సన్యాసులు, సాధువులకు సంబంధించి నదనీ అందరూ అనుకుంటూంటారు. మానసిక ఒత్తిడులనుంచి దూరం కావడానికి, ఆరోగ్యవరమైన ఇబ్బందులను తొలగించడానికి శ్వాస నియంత్రణ, ధ్యానం వంటి యోగాసనాలను ప్రపంచమంతా సాధన చేస్తున్నారు. **"యోగః చిత్తవృత్తి నిరోధః"** అని దీని మూల సృష్టికర్త అయిన పతంజలి అభివర్ణించాడు. అంటే మనస్సుయొక్క ఆలోచనల్ని చిత్తవృత్తులంటారు. వాటిని నియంత్రించేది 'యోగ' అని అర్థం.

'యోగ' కచ్చితంగా ఎప్పటినుండి అచరణలో, అభ్యాసంలో ఉన్నదో తెలియదు. ఈ విషయంలో చాలా ఊహాగానాలున్నాయి. అయితే, ఈ ఊహలకంటే ఇది మరింత ప్రాచీనమైనదని చెప్పవచ్చు. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన గ్రంథాలైన మహాభారతం, భగవద్గీతలలో వీటి ప్రస్తావన విస్తృతంగా ఉంది. గీత మూడురకాల యోగను ప్రస్తావించింది. అవి కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం. క్రీ.పూ. 1900–1100 మధ్యకాలంలో వేదాల్లో దీనిని ఒక జీవన విధానంగా ప్రస్తావించారు. పతంజలి యోగ సూత్రాల్లో యోగసాధనకు అష్టాంగ మార్గం సూచించాడు. అవి–యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి.

కపిల మహర్షి ప్రవచించిన సాంఖ్య సిద్ధాంతంపై యోగ ఆధారపడింది. అంతా మనసుపై కేంద్రీకృతమై ఉంటుంది.

**డా॥ రవి.పి.సింగ్,** సెక్రటరీ జనరల్, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా. E-mail: sg@qcin.org
**డా॥ మనీష్ పాండే,** జాయింట్ డైరెక్టర్, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా. E-mail: manish.pande@qcin.org

అష్టాంగాలలో రెండవదైన నియమ, చంచలమైన మనస్సుకు అంతశ్శుద్ధిని కలుగచేసి నిశ్చలంగా చేస్తుంది. తర్వాతకాలంలో దీనికి విరుద్ధంగా హఠయోగం ప్రచారంలోకి వచ్చింది. ఇది ఎక్కువగా శారీరక, ఆసనాలకు సంబంధమైనది. అభ్యాసం చాలా క్లిష్టంగా ఉంటుంది.

ఈ మధ్యకాలంలో శారీరక, మానసిక అభ్యాసాలద్వారా 'కుండలినీ' శక్తులను మేల్కొలపడం వంటివి చేస్తున్నారు. శారీరక స్థాయిలో ఆరోగ్య పరిరక్షణ పలురకాల 'ఆసనాలు' అభ్యసిస్తుండగా, మనస్సును నియంత్రించడానికి ప్రాణాయామ, ధ్యానం వంటివి ఆచరిస్తున్నారు.

యోగకు ప్రజాదరణ ఉండడంతో జీవితాన్ని అర్థవంతంగా గడపదలుచుకున్నవారు ప్రపంచవ్యాప్తంగా దీనికి ఆకర్షితులవుతున్నారు. బాగా విజయవంతమైన ఈ భారతీయ విధానంపట్ల నమ్మకం చెక్కుచెదరకుండా ఉండాలంటే యోగాభ్యాసంపట్ల ఆసక్తిచూపుతున్న వారికి సరైన శిక్షణ, మార్గదర్శనం అవసరమవుతాయి. ఇది నెరవేరాలంటే సుశిక్షితులైన, పేరుప్రఖ్యాతులున్న యోగా గురువులతో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది జరగాలంటే దీనికి చాలా ప్రయత్నాలు చేయాలి. వాటిలో ఒకటి–యోగాభ్యాసం 'ఎందుకు?', 'ఎలా?' అనే అంశాల ఆధారంగా మంచి సమర్థులైన నిపుణులను ఎంపికచేసి వారి ప్రతిభాపాటవాలను సమీక్షించి, వారికి ఆమేరకు ప్రామాణిక యోగ్యతా పత్రం (సర్టిఫికేట్) జారీ చేయాల్సిఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఆందరికీ ఆమోద యోగ్యంగా ఉండేవిధంగా ఈసమీక్ష ప్రక్రియను సిద్ధం చేయడం జరిగింది. యోగ విషయంలో వారికున్న పరిజ్ఞానం, నైపుణ్యం, పరిపక్వత ఆధారంగా వారిని బోధకులుగా (ఇన్‌స్ట్రక్టర్లు), ఉపాధ్యాయులుగా (టీచర్), ఆచార్య (మాస్టర్)గా వర్గీకరించవచ్చు. బోధకుడినుండి ఆచార్యుడి వరకు సమీక్షలో వారి ప్రదర్శనకంటే, వారి అనుభవానికే ప్రాధాన్యమివ్వాలి.

దీని తర్వాత చేయవలసినది–యోగ శిక్షణా కేంద్రాలను గుర్తించి, వాటి స్థాయినిబట్టి డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులు నడపడానికి అవసరమయ్యే గుర్తింపు ఇవ్వడం. యోగ అనేది జీవనవిధానాన్ని ప్రభావితం చేసే అభ్యాసం అయినందువల్ల మార్కెట్‌లోని ప్రజాదరణను గమనించి త్వరగా సొమ్ము చేసుకోవడంకోసం విలువలు, ప్రమాణాలు పాటించకుండా వెల్లువెత్తే వాణిజ్య శిక్షణా సంస్థలకు కళ్ళెం వేయడం చాలా ముఖ్యం. శిక్షణా కేంద్రాల గుర్తింపు ప్రక్రియద్వారా మంచి సంస్థలను, నకిలీ సంస్థలను వేరుచేయడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

యోగ శిక్షణా కేంద్రాల్లో నాలుగు స్థాయిల్లో అర్హతా పత్రాలు జారీచేసేవిధంగా సర్టిఫికేషన్ పథకం ఉంటుంది. మొదటిది ప్రాథమిక స్థాయి. మొదటి రెండు అంటే బోధకుడు, ఉపాధ్యాయుడి స్థాయిలో శిక్షణ ఉంటుంది. రెండోస్థాయిలో ఐఎస్ఓ 2990: 2010 ప్రామాణికతకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలుంటాయి. మూడోస్థాయిలో బోధన, శిక్షణా కార్యక్రమాల రూపకల్పన ఉంటుంది. అన్నిటికంటే అత్యున్నత స్థాయి–ఆశ్రమ స్థాయి. ఆశ్రమ వాతావరణంలో కనీసం 200 గంటలు లేదా అంతకంటే ఎక్కువగా యోగా విద్యాభ్యాసం ఉంటుంది. ప్రతిస్థాయిలో విడివిడిగా దాని అవసరాల మేరకు పాఠ్యాంశాలు, శిక్షణ ఉంటాయి.

యోగ శిక్షణను పరీక్షించి, సర్టిఫికేట్ల జారీకి ముందు థియరీ, ప్రాక్టికల్స్ పద్ధతిలో కాకుండా 'వైవా' లాగా ఇంటర్వ్యూల ద్వారా ఎంపికచేసి సర్టిఫికేట్లు జారీ చేయడం జరుగుతుంది.

**మన ముందున్న సవాళ్లు:**

ఇంతవరకు బాగానే ఉంది. ఇక్కడే అసలు సమస్య ఎదురవుతున్నది. యోగను అభ్యసించిన వారి సామర్థ్యాన్ని పరీక్షించడం సాధ్యమా? గురువు నేర్పిందెంతో, శిష్యుడు నేర్చుకున్నదెంతో ఎలా సమీక్షించాలి! మరో సవాలు. చిత్తాన్ని (మనసును) బయటివారు ఎలా పరిశీలించగలరు! ఎలా సమీక్షించగలరు? అలానే వ్యావృత్తి (ఆలోచనలను) బయటివారు పసిగట్టడం ఎలా సాధ్యం! యోగ అన్నది స్వానుభవంలో స్వీయశిక్షణలో పరిపూర్ణత సాధించాల్సిన అంశం. యోగ అనేది వ్యక్తిగతమైనది. దాన్ని వస్తుగతంగా మార్చే ప్రయత్నం చేస్తే ఎలా! అనేది మరికొందరి వాదన.

మరొకముఖ్యమైన అంశం – యోగ విద్యాభ్యాసం, శిక్షణ ఇచ్చేకేంద్రాలు. మనదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఇటువంటి శిక్షణలో ప్రతిష్ఠాత్మక కేంద్రాలు చాలానే ఉన్నాయి. ఒక్కోదానిలో ఒక్కోరకమైన దృక్పథంతో, విభిన్నరీతుల్లో శిక్షణ ఇస్తుంటాయి. అందువల్ల శిక్షణ తీసుకున్నవారిలో కూడా నైపుణ్యాలు, పరిజ్ఞానం ఒకేలా ఉండవు. వేర్వేరుగా ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ వైవిధ్యమే ఈ యోగకు మరింత వైభవాన్ని చేకూర్చింది. కానీ ఔత్సాహికుల్లో మాత్రం ఏది అసలైన 'యోగ', ఏది తప్పనిసరిగా నేర్చుకోవాలనేవి శేష ప్రశ్నలవుతున్నాయి.

అందువల్ల యోగను మరింత శాస్త్రీయంగా, మరింత వస్తుగతంగా, మరింత ఏకీకృతంగా చేసే ప్రయత్నాలు దాని విశిష్టతలను దెబ్బతీయకుండా ఉంటాయా? అనేది మరో పెద్ద అనుమానం. అయితే అలా దెబ్బతినకుండా జాగ్రత్తపడుతూ సర్టిఫికేషన్ కోర్సులు రూపొందించవచ్చని భావిస్తున్నారు.

**పరిష్కారం :**

అసలు ఈ 'యోగ'కు ఇంత ఆదరణ

రావడానికి, ఊపు రావడానికి కారణం–జూన్ 21న–'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా పాటించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించడం. యోగలో ప్రపంచవ్యాప్తంగా భారత్ ఆధిక్యత మరోసారి రుజువైంది. అయితే దీనితోపాటు యోగా పవిత్రత, విశిష్టతలను కాపాడే బాధ్యతకూడా పెరిగినట్లయింది. దానితో యోగ విద్యాభ్యాసంలో శిక్షణ, అర్హతలు, యోగ్యతా పత్రాలజారీ, శిక్షణా కేంద్రాల గుర్తింపు వంటివి ప్రామాణికంగా ఉండేవిధంగా చూడడానికి 'ఆయుష్' ఈ బాధ్యతలను భారత ప్రమాణాల మండలి (క్యు.సి.ఐ)కి అప్పగించింది.

అంతర్జాతీయ ప్రమాణాలకను గుణంగా యోగ గురువుల సామర్థ్యాన్ని పరీక్షించడం, తగిన శిక్షణా కేంద్రాలను గుర్తించడంపై ఇప్పుడు దృష్టి కేంద్రీకృతమైంది. యోగాభ్యాసానికి అవపరసమైనవి–నైపుణ్యం, పరిజ్ఞానం. సర్టిఫికేట్లవల్ల ఇవి ఏస్థాయిలో ఉన్నాయో కనీస అవగాహన ఉంటుంది.

మొత్తం యోగకు సంబంధించిన విధానాలను, పాఠ్యాంశాలను, యోగ్యతాంశాలను, నైపుణ్యాలపరీక్షలను నిర్వచించడానికి, నిర్ధారించడానికి ప్రమాణాల మండలి ఒక నిపుణుల కమిటీని, మరో సలహా కమిటీని నియమించింది. దీనిలో పేరు ప్రఖ్యాతులున్న యోగ గురువులు, శిక్షణా కేంద్రాలు, 'ఆయుష్', వాణిజ్యంవంటి మంత్రిత్వ శాఖలు, వినియోగదారుల సంఘాలు, సర్టిఫికేట్ జారీ చేసే సంస్థలవంటివి ఉన్నాయి.

ప్రమాణాల మండలి ప్రకారం–పాలకమండలి నియామకం, యోగ్యతా పత్రాల జారీ నిబంధనలు, జారీ ప్రక్రియ, జారీచేసే సంస్థల సామర్థ్యాలు వివరిస్తూ ఆ సమాచారాన్ని www.yogacertification.qci.org.in వైబ్‌సైట్‌లో పెట్టింది.

**అవకాశాలు :**

ప్రమాణాల మండలి పథకానికి ప్రభుత్వం తోడ్పాటుంది. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై దీనికి అవసరమైన ప్రోత్సాహం ఇస్తున్నది. యోగ్యతా పత్రాలపై 'ఆయుష్' మంత్రిత్వశాఖ చిహ్నం ఉంటుంది. దీనితో ఈ సర్టిఫికేట్‌కు హోదా, గుర్తింపువంటివి వస్తాయి.

ఇక ఈ సర్టిఫికేట్లు పొందినవారిని పలువిధాలుగా ప్రోత్సహించాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, సిబిఎస్ఇ, కేంద్రీయ విద్యాలయాలవంటి పలుబోర్డులు చేపట్టే యోగా టీచర్ల నియామకాల్లో ఈ సర్టిఫికేట్లు ఉండేలా చూడాలని భావిస్తున్నది. అలాగే ఈ సర్టిఫికేట్‌లు ఉన్నవారికి వీసా నిబంధనలు సడలించాలని కూడా యోచిస్తున్నది. భారత సాంస్కృతిక సంబంధాల మండలి (ఐసిసిఆర్) చేపట్టే విదేశీ యోగా టీచర్ల నియామకాల్లో కూడా దీనిని చేర్చాలని ప్రతిపాదిస్తున్నది.

అన్నిటికంటే ముఖ్యంగా, తొలి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించిన మొదటి 2వేలమంది అభ్యర్థులకు వారు చెల్లించిన ఫీజు పూర్తిగా వాపసుచేస్తున్నట్లు కూడా ఆయుష్ ప్రకటించింది. భారత ప్రమాణాల మండలి యోగా పథకాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించింది. దీనితరపున ఒక బృందం జపాన్ సందర్శించి ఈ పథకం కింద 13మందికి యోగ్యతా పత్రాలు జారీ చేసింది.

ముందుముందు యోగ తరగతులు నిర్వహించే విశ్వవిద్యాలయాలు, నియత/అనియత విద్యగా యోగాను నేర్పే పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, స్పాలు, యోగ స్టూడియోల్లో మండలి సర్టిఫికేట్ ఉన్నవారినే నియమించుకునేలా చూడాలనికూడా భావిస్తున్నారు.

■

*12వ పేజీ తరువాయి...*

## సమగ్ర పాలనకు మార్గం ఈ - గవర్నెన్స్

**3. నేషనల్ సెంటర్ ఫర్ ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్:**

ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశోధనలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ సెంటర్ ఫర్ ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేసింది.

**4. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ ఇంటర్‌నెట్ ఆన్ థింగ్స్ :**

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఆండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(డీఐటీ) ఈఆర్‌నెట్, నాస్‌కామ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ విభాగం ద్వారా పలు పరిశోధనలు, అవగాహనా సదస్సులను నిర్వహించనున్నారు. 2017 మార్చిలో 32వేల కోట్ల రూపాయలతో రెండున్నర లక్షల గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్, ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పచనున్నారు. పెరిగే సౌకర్యాలను సుపరిపాలన కోసం వినియోగించుకోవాలి, మార్కెట్ సంస్థలకు కొత్త మార్గాలు తెరిచిపెట్టాలి. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా కోటి 70 లక్షల మంది శిక్షణ పొందుతారు. వీరికి ఉపాధి కల్పించడంతో పాటు దాదాపు 8.5 కోట్ల మంది పరోక్ష ఉపాధి పొందుతారని అధికారుల అంచనా. వాతావరణ వివరాలు, రైతుల పంటలు, ధరలు, ఈ వైద్యం, బ్యాంకింగ్ సేవలు, బిల్లుల చెల్లింపు, వార్తా ప్రసారాల వేగం తదితర సౌకర్యాలు మెరుగుపర్చాలన్న లక్ష్యం కూడా డిజిటల్ ఇండియాలో ఉంది. ఈ కార్యక్రమం అనుకున్నట్లు అమలైతే ప్రజలకు ప్రభుత్వాల మధ్య పారదర్శకత పెరిగి దేశం అన్నిరంగాల్లోనూ మరింత అభివృద్ధి చెందుతుంది.

■

# 'యోగ'కు అంతర్జాతీయ ప్రాముఖ్యం




**ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిలేని ఆహ్లాదకరమైన జీవన గమనంకోసం నేటి యువతరం యోగ విద్యను అభ్యసించి ఆచరించాలి. ప్రపంచవ్యాప్తంగా జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవ నిర్వహణ వల్ల మనపై మరింత బాధ్యత పెరిగింది. సైనిక దళాల సిబ్బందికి, పారామిలిటరీ దళాల సభ్యులకు కూడా యోగాలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. శాంతియుత జీవనాన్ని అనుభవిస్తున్నవారే శాంతియుత కుటుంబాలను ఏర్పరచుకో గలుగుతారు. శాంతియుత ప్రపంచం కావాలంటే ముందుగా యోగ ద్వారా శాంతపురుషులను తయారుచేసుకోవడం అవసరం.**

**యోగా పరిచయం :**

క్రమశిక్షణతో మనస్సు, శరీరం ప్రకృతి మధ్య సమన్వయం సాధించడం ద్వారా మనిషి తన ఆరోగ్య పరిరక్షణకోసం వినియోగించే సునిశితమైన శాస్త్రీయ ఆధ్యాత్మిక ప్రక్రియను 'యోగా' అని వివరించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనానికి ఉపయోగపడే 'యోగా'కు ఒక కళగానే గాక శాస్త్రంగా కూడా గుర్తింపు లభించింది. ఆధునిక జీవనశైలి వల్ల తలెత్తుతున్న అనేక రుగ్మతలను క్రమశిక్షణాయుతమైన శాస్త్రీయ పద్ధతిలో మొత్తం శారీరక వ్యవస్థను నియంత్రించడం ద్వారా అనేక రోగాలను నివారించడమే గాక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు యోగ అన్నివిధాలుగా తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. అందువల్లనే నేడు యోగ ఖ్యాతి ప్రపంచం నలుమూలలావిస్తరించింది. కొన్ని రోగాలను పూర్తిగా అదుపులో ఉంచడానికేగాక యోగాభ్యాసం చేసే వ్యక్తికి శారీరక మానసిక వత్తిడులను తగ్గించడం వల్ల ఆరోగ్యవంతంగా ఉన్నామన్న భావన కల్పించడంలో యోగ తోడ్పడుతుందన్న విషయం స్పష్టం కావడంవల్ల యోగ సామర్థ్యం ఇప్పుడు ప్రపంచ వ్యాపితమైంది. అందువల్ల ఇప్పుడు యోగాభ్యాసం చేయడం ప్రపంచ వ్యాప్తంగా చాలామంది జీవితాల్లో భాగమైపోయింది. మన ప్రాచీన సంస్కృతి లోని ఆత్మజ్ఞాన సముపార్జన సాధనంగాను, అత్మవలోకనకు తోడ్పడే శాస్త్రం గాను, మానసిక సమతుల్యత సాధన ప్రక్రియగాను, మనిషి పని సామర్థ్యాన్నిపెంచే దివ్యఔషధం గాను గుర్తించవచ్చు . అందువల్ల ఎవరైనాసరే యోగ వల్ల అద్భుతమైన ప్రయోజనం పొందగలమన్న విశ్వాసం ప్రతి ఒక్కరిలోనూ కలుగుతుండడం వల్ల ఇప్పుడు లోకంలో మన చుట్టూ ఒక గొప్ప సంస్కృతి కనిపిస్తున్నది. దురదృష్టవశాత్తూ కొందరు యోగ అంటే కేవలం శారీరక ప్రయోజనం కోసం లేదా మానసిక ఒత్తిడులను తగ్గించుకునేందుకు ఆసనాలు వేయడం, ప్రాణాయామం చేయడం మాత్రమేనన్న భ్రమలో ఉన్నారు. అయితే సాధారణమైన మనిషి విప్లవాత్మకమైన రీతిలో అసాధారణ వ్యక్తిగా మారేందుకు వీలుగా భగవంతుడు ఇచ్చిన అపురూపమైన కానుకగా యోగను స్వీకరించ గలిగితే ఆశించిన ఫలితం సంపూర్ణంగా లభిస్తుంది.

**ఆత్మజ్ఞానం పెంచుకునేందుకు యోగా:**

ప్రపంచంలోని వివిధ దేశాల్లో వివిధ

**డాక్టర్ ఈశ్వర్ వి.బసవారెడ్డి,** డైరెక్టర్, మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ, న్యూ ఢిల్లీ
E-mail: ibasavaraddi@yahoo.co.in

కాలాల్లో మనిషి తన మనసును అదుపులో ఉంచుకుని క్రమశిక్షణ పాటించడం ద్వారా పరిసరాలపై పట్టు సాధించడానికి ప్రయత్నాలు సాగాయి. భారత దేశంలో కూడా ఇలాటి ప్రయత్నాల నేపథ్యంలోనే యోగ విద్య ఆవిర్భవించింది. ఒక వ్యక్తి తన మనస్సును అదుపులో ఉంచుకునే క్రమంలో తానేమిటో తెలుసుకోగలుగుతాడు. ఆవిధంగా మన పూర్వపు యోగులు చేసిన సాధన నేటికీ మన జీవితాలను సరిదిద్దుకునేందుకు తోడ్పడు తుందనడంలో ఏమాత్రం సందేహంలేదు. యోగి తన జీవిత పరమార్థంపై దృష్టి సారించి ఏకాగ్రత సాధించడంవల్ల పలు సందేహాలు తొలగి, అనేక ప్రాథమిక సమస్యలకు సులువైన పరిష్కారం లభిస్తుంది. దీంతో జాలి, దయ, కరుణ వంటి సద్గుణాలు అలవాటై మనిషికి తన జీవితాన్ని సుందరంగా తీర్చి దిద్దుకునే అవకాశం కలుగుతుంది.. అలా సరైనమార్గంలో మనిషి జీవిత గమనానికి యోగ శాస్త్రం లేదా కళ తోడ్పడుతుంది

### ప్రాచీన, ఆధునిక కాలాల్లో యోగా :

మనిషి పుట్టి నాగరికత సంతరించు కుంటున్న కాలం లోనే యోగ విద్య ఆరంభమైందని చెప్పవచ్చు. వివిధ ఆధ్యాత్మిక భావనలు ఆచారాలు, సంప్రదాయాలు, గురుశిష్య పరంపరానుగతంగా యోగ విద్య అనేక రూపాల్లో ప్రభవిస్తూవచ్చింది ఉదాహరణకు జ్ఞానయోగ, భక్తియోగ, కర్మయోగ, ధ్యానయోగ, పతంజలియోగ, కుండలినీయోగ, హఠయోగ, మంత్రయోగ, లయయోగ, రాజయోగ, జైనయోగ, బౌద్ధయోగ వంటి రూపాలను చెప్పుకోవచ్చు. ఈ యోగాలలో వేటికవే ప్రత్యేక నియమ నిబంధనలు, సాధన పద్ధతులు ఏర్పరచుకున్నప్పటికీ వీటన్నింటి ఉద్దేశ్యాలు, లక్ష్యాలు మాత్రం ఒక్కటే. యోగవిద్యకు నిలయమైన భారత దేశంలో ఎన్ని రకాల ఆచార వ్యవహారాలు ఉన్నప్పటికే, ప్రకృతిపై ప్రేమ, పర్యావరణ సమతౌల్యము, పర భావనలను ప్రేమించి వాటికి తగిన ఆశ్రయం కల్పించి గౌరవించడం, అన్ని జీవులను ప్రేమించి ఆదరించడం చెప్పుకోదగ్గ అంశాలు. వర్ణ విబేధాలు లేకుండా అన్ని జాతులు, మతాల వారు యోగ సాధన అనే తపస్సు ద్వారా జీవిత పరమార్థాన్ని తెలుసుకొని ధన్య జీవులవుతున్నారు. వ్యక్తిగత ఆరోగ్యంతో బాటు సమగ్రమైన సామజిక స్వాస్థ్య సాధన లక్ష్యంతో సాగే యోగసాధన యిప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలు, మతాలు, జాతుల వారికి ఆమోదయోగ్యమైన అలవాటుగా మారుతున్నది. యుగ యుగాలుగా ప్రముఖ యోగ గురువుల శిష్యరికం కింద యోగసాధన ద్వారా ఇప్పుడు ప్రపంచంలోని వివిధ దేశాల్లో, ప్రాంతాల్లో నివసించే కోట్లాది మంది జనం సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతున్నారు. ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాల్లో ప్రజల జనజీవన క్రమంలో యోగ సాధన ఒక భాగమైపోయింది . యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన (మెడిటేషన్), సమాధి/సంయమ, బంధ మరియు ముద్ర, షట్కర్మ, యుక్తాహార, యుక్త కర్మ, మంత్రం, జపం మొదలైన యోగ సాధన ప్రక్రియలు ప్రస్తుతం అమలులో ఉన్నాయి.

### ఆధునిక జీవనశైలిలో యోగాతో సాధించే ఆరోగ్య లాభాలు :

ఈ పోటీ ప్రపంచంలో ఆధునిక జీవనశైలి వల్ల తలెత్తే అనేక ఆరోగ్య సమస్యలు తీవ్రమైన జబ్బులకు కారణమవుతున్నాయి. ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, కదిలే అవసరం లేకుండా కూచున్న చోటికే అన్నీ అందుబాటులో ఉండేలా సుఖమయ జీవితాన్ని గడపడం కూడా కీళ్ళు, కండరాల నొప్పులతోబాటు మధుమేహం, అస్తమా, గుండె జబ్బులు, కాన్సర్ వంటి తీవ్రమైన రోగాలకు దారితీస్తున్నాయి.

### అన్ని సమస్యలకు యోగ మాత్రమే పరిష్కారమా?

ప్రస్తుత ప్రపంచంలో మన తప్పుడు జీవన విధానం వల్లనే అంటురోగాలు కాని అనేకమైన తీవ్రమైన జబ్బులు మనిషికి అంటుకుంటున్నాయి. ఆధ్యాత్మిక భావన, శాస్త్రము కూడా వేరువేరుగా కాదని, అవి రెండు మన జీవితాల్లో భాగమేనని అంగీకరించగలిగితే యోగ సాధన ద్వారా చాలావరకు ఈ జబ్బులు రాకుండా నివారించుకోవడమే గాక వచ్చిన జబ్బులను కూడా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. ముఖ్యంగా నిద్రలేమి వంటి మానసిక జబ్బులతో బాటు ఆధునిక జీవన క్రమంలో తరుము కొని వస్తున్న అనేక రోగాలను నివారించుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. మానసిక ఒత్తిడులను అధిగమించి జబ్బులను నివారించడం, వచ్చిన జబ్బులను తగ్గించుకునే క్రమంలో యోగ ఉపయోగాన్ని అందువల్ల వచ్చే లాభాలను నిరూపించేందుకు శాస్త్రీయ పద్దతుల్లో అనేక ప్రయోగాలు జరిగాయి. అనేక శారీరక, మానసిక, జన్యుసంబంధమైన వంశపారంపర్య జబ్బులపై జరిపిన అనేక శాస్త్రీయమైన ప్రయోగాలలో అనేక జబ్బుల నివారణకు, నియంత్రణకు సంబంధించి యోగ ఎలా వినియోగపడుతుందో పరిశీలించేందుకు అనేక ప్రయోగాలు జరిగాయి. జీవాణు వ్యవస్థ, నాడీమండలం, పునరుత్పత్తి ప్రక్రియ, కణజాల పనితీరు తదితర అంశాలపై యోగ ఎలాంటి ప్రభావం చూపుతుందో కనుగొనేందుకు పలువురు ప్రయోగాలు చేశారు. యోగాభ్యాసకులలో రక్త ప్రసరణ, నాడీమండల, జీవాణు వ్యవస్థల పైన యోగ సాధన ప్రభావం ఉన్నందువల్ల వాటి పనితీరులో సమతుల్యతను సాధించడం ద్వారా ఎప్పటికప్పుడు ఆరోగ్యపరిస్థితి మెరుగు

పడుతుందని కనుగొనగలిగారు అంతేగాక దీనివల్ల జీవకణాల అరుగుదల తగ్గిపోవడమేగాక వాటి పునరుత్పత్తిపై కూడా తగిన నియంత్రణ ఉండడంవల్ల నిత్య యవ్వనంగా ఉండడం సంభవిస్తుంది. దీనిఫలితంగా శారీరక, మానసిక పరిస్థితులు సహకరించడం వల్ల యోగసాధకులు ఉత్సాహంగా, ఆరోగ్యకరంగా ఉండంవల్ల రోగనివారణకు అవకాశాలు పెరుగుతాయి. ఇలా ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉండడం వల్ల మానసిక ఒత్తిడి కూడా తగ్గిపోయి మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రశంసలు పొందగలుగుతారు. దీనిఫలితంగా యోగసాధకులు ఒత్తిడులను తట్టుకునే సామర్థ్యం పెరిగి ఎలాంటి ఒత్తిడిని కుడా సులువుగా ఎదుర్కొని మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పని చేసి ఆరోగ్యంగా ఉండగలుగుతారు. అంతేగాక జీవకణజాల వ్యవస్థ అదుపులో ఉండడం వల్ల వృద్ధాప్య ఛాయలు లేకుండా నూతన యవ్వనంతో మరింత ముందుకు దూసుకుపోగలుగుతారు. యోగసాధన అందించే అదనపు శక్తివల్ల ఎలాంటి ఒత్తిడులకు లోను కాకుండా తమ పని సామర్థ్యాన్ని నిరూపించుకోగలుగుతారు. దీనివల్ల వారిలో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులను అదుపులో ఉంచడానికి యోగసాధన ఒక ప్రత్యామ్నాయ వైద్య ప్రక్రియగాను, ఒక మహత్తర దివ్య ఔషదంగాను పనిచేస్తుంది. అంతేగాకుండా, యోగసాధనతో ఇతర మందుల వినియోగం తగ్గడం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండెపోటు క్రమంగా తగ్గిపోయి ఇతర రోగాలు వచ్చే అవకాశాలు సైతం కనుమరుగవుతాయి..

ఇలా యోగ సాధన ద్వారా కలిగే ప్రయోజనాలను మూడు స్థాయిలుగా వర్గీకరించవచ్చు ...

శారీరక స్థాయిలో మంచి ఆరోగ్యాన్నిచ్చి అన్నివిధాలుగా బాగున్నట్టు కనిపించడం; మానసిక స్థాయిలో... ఒత్తిడిని తగ్గించి ఉత్సాహంగా పనిచేసేందుకు సహకరించడం వల్ల పనిసామర్థ్యం పెరిగి ఎక్కువ ఉత్పాదనకు తోడ్పడం, ఇక ఆధ్యాత్మిక స్థాయిలో ఆత్మవలోకన ఫలితంగా మానవత్వపు విలువలెరిగి శాంతి సహజీవనాలకు సహకరించడం తద్వారా మానవాభ్యున్నతికి తోడ్పడడం వంటివి సాధ్యమవుతాయి.

**ముగింపు :**

భారత దేశ జనాభాలో అత్యధికులుగా ఉన్న యువతరం ఆరోగ్యకరమైన జీవన శైలి పైన, వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన అంశాలపైన దృష్టి కేంద్రీకరించి ముందుకు సాగుతుండడం హర్షణీయమైన పరిణామమే. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిలేని ఆహ్లాదకరమైన జీవన గమనంకోసం నేటి యువతరం యోగ విద్యను అభ్యసించి ఆచరించాలి. యోగ విద్యను అభివృద్ధి చేసి ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల ఎన్నో చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవ నిర్వహణ వల్ల మనపై మరింత బాధ్యత పెరిగింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ "అయుష్" మంత్రిత్వ శాఖ యోగవిద్యలో నిష్ణాతులైన వారిని గుర్తించి యోగ్యతలను ధృవీకరించే బాధ్యతను క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాకు అప్పగించింది. అంతేగాక, దేశంలోని వివిధ ప్రాంతాల్లో యోగవిద్యను అందించే విధంగా సమీకృత అయుష్ ఆస్పత్రులను నెలకొల్పాలని అయుష్ మంత్రిత్వ శాఖ తలపెట్టింది . సైనిక దళాల సిబ్బందికి, పారామిలిటరీ దళాల సభ్యులకు కూడా యోగాలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. న్యూ ఢిల్లీలోని గృహ కల్యాణ కేంద్రంలో ఉద్యోగుల శిక్షణ విభాగం ద్వారా యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా, ప్రకృతి వైద్య (నేచురోపతి) విభాగాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు కేంద్రీయ పరిశోధన సంస్థలు ఏర్పాటుకానున్నాయి. ఎన్నో యుగాలుగా కాలపరీక్షకు తట్టుకుని నిలిచిన యోగ ద్వారా ఆశించిన ఫలితాలు సాధించినట్టు తగిన రుజువులు, సాక్ష్యాధారాలు లేవని కొట్టివేయడం తగని పని. యోగ బలాన్ని, సామర్థ్యాన్ని గుర్తించి యోగాకు తగిన ప్రాధాన్యం ఇచ్చి తీరవలసిందే. అందువల్ల గుణాత్మకమైన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, యోగా విద్య వ్యాప్తికి తగిన ప్రాథమిక అవసరాలను గుర్తించడమే గాక అందుకు అనుగుణంగా ప్రణాళికను తప్పక రూపొందించవలసి ఉంది. ఆధునిక పోటీ ప్రపంచంలో ఎలాంటి ఒత్తిడులకు అవకాశం లేని ఆరోగ్యవంతమైన జీవితాన్ని మన యువతరానికి అందజేయగల యోగవిద్యను మరింత అభివృద్ధిచేసి విస్తృత ప్రచారం కల్పించేందుకు, ఎప్పటికప్పుడు పాలనా పరమైన అవరోధాలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక నియంత్రణ, అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి యోగను నిరంతరం ప్రోత్సహించాల్సి ఉంటుంది. శాంతియుత జీవనాన్ని అనుభవిస్తున్న వారే శాంతియుత కుటుంబాలను ఏర్పరచుకోగలుగుతారు. శాంతియుత ప్రపంచం కావాలంటే ముందుగా యోగ ద్వారా శాంతపురుషులను తయారుచేసుకోవడం, వారితో శాంతియుత కుటుంబాలను, ఆ కుటుంబాల సహకారంతో శాంతి సమాజాన్ని నిర్మించుకోవడం, దాంతో దేశంలో శాంతిని నెలకొల్పి ప్రపంచ స్థాయిలో శాంతి స్థాపనకు కృషి చేయవలసి ఉంటుంది. ■



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1. కవరత్తి, మినికాయ్, అగత్తి, ఆంఢ్రోత్ దీవులు ఎక్కడున్నాయ్?
   ఎ) బంగాళాఖాతం బి) అరేబియా సముద్రం
   సి) పసిఫిక్ మహాసముద్రం
   డి) అట్లాంటిక్ మహాసముద్రం
2. కరువు ప్రాంతాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఏ పథకాలు బాగా ఉపయోగ పడతాయి? (అనగా ఆకలి నుండి కాపాడతాయి)
   ఎ) MGNREGS
   బి) పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం
   సి) మధ్యాహ్నభోజన పథకం & సోషల్ సెక్యూరిటీ పెన్షన్లు డి) పైవన్నీ
3. గ్లోబల్ టీచర్ ప్రైజ్ (వార్కీ ఫౌండేషన్ వారిది) ఇటీవల ఎవరికిచ్చారు? వివరాలేవి?
   ఎ) హానన్–అల్ హ్రౌబ్ (Hanan-al-Hroub)
   బి) దీన్ని టీచింగ్‌లో నోబుల్ ప్రైజ్ అంటారు.
   సి) బహుమతి ఒక మిలియన్ అమెరికన్ డాలర్లు
   డి) పైవన్నీ
4. అడవిలో మంటలు ఎన్ని రకాలు? వివరాలేవి?
   ఎ) రెండు రకాలు అవి (1) క్రౌన్ ఫైర్స్ (చెట్ల చిటారు కొమ్మల్లో మొదలయ్యేవి) (2) గ్రౌండ్ ఫైర్స్ (నేలపై మొదలయ్యేవి)
   బి) కొత్త గడ్డికోసం, మానవులు అడవికి నిప్పుపెడతారు, చెట్లు నరికే వారు కూడ, అడవిలోని చెట్లకి, గడ్డికి నిప్పుపెడతారు.
   సి) ఉత్తరాఖండ్ అడవిలో మంటలు 5 ఏళ్ళకోసారి పునరావృతం అవుతాయి, సేకరించిన డేటా ప్రకారం గత 2 సంవత్సరాలుగా వర్షాలు లేకపోవడం, గాలిలో తేమ లేక పోవటం, ఈ సంవత్సరం ఉత్తరాఖండ్ అడవుల్లో మంటలకి కారణం.
   డి) పైవన్నీ.
5. సెంట్రల్ వాటర్ కమిషన్ (CWC) భారతదేశ నదుల ప్రాంతాలను 12 మేజర్ బేసిన్‌లుగా విభజించి మానిటరింగ్ చేస్తోంది. బ్రహ్మపుత్ర / బరాక్ బేసిన్ నుండి నీరు 14057 క్యూబిక్ మీటర్లు/సంవత్సరం ప్రతిమనిషికి లభిస్తుంది. అతి తక్కువగా నీరు 307 క్యూబిక్ / సంవత్సరానికి ప్రతిమనిషికి ఏ బేసినలో లభిస్తుంది?
   ఎ) సబర్మతి బి) కృష్ణ సి) కావేరి డి) పెన్నార్
6. కార్బెట్ టైగర్ రిజర్వ్ ఎక్కడుంది?
   ఎ) ఉత్తరాఖండ్ బి) బీహార్
   సి) పశ్చిమ బెంగాల్ డి) రాజస్థాన్
7. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
   ఎ) "బియాండ్ N J 9842" ది సియాచెన్ సాగా – నితిన్ ఎ. గోఖలే
   బి) "హెడ్స్ యు విన్" – జెఫ్రీ ఆర్చర్
   సి) "విక్టోరియాస్ స్టాటిష్ లయన్" – ఎడ్రియన్ గ్రీన్‌వుడ్
   డి) పైవన్నీ
8. కాశ్మీర్‌లో "షాలిమార్ బాగ్"ను ఎవరు ఏర్పాటు చేశారు? వివరాలేవి?
   ఎ) చక్రవర్తి జహంగీర్ (క్రీస్తుశకం 1605 – 1627) ఇది క్రీస్తుశకం 1620లో పూర్తయింది.
   బి) ఇక్కడ దీవాన్–ఎ–ఖాస్ ఉంది
   సి) దీవాన్–ఎ–ఖాస్ కున్న 'నకాషీ' కళను జర్మనీ సహకారంతో పునరుద్ధరించారు.
   డి) పైవన్నీ.
9. "లెగసీ ఆఫ్ జెట్టీస్" రచయిత ఎవరు?
   ఎ) సి. రంగారాజన్ బి) సి. మహేశ్వరన్
   సి) అమితావ్ ఘోష్ డి) బి.డి.జెట్టీ
10. 'బిట్‌కాయిన్' సృష్టికర్త ఎవరు?
   ఎ) ఆడంస్మిత్
   బి) క్రెయింగ్ స్టీవెన్‌రైట్ (సతోషినకమోటో)
   సి) J.M. కీన్స్ డి)నెపోలియన్ బోనాపార్టె
11. ఉత్తరాఖండ్ హైకోర్టు ఎక్కడుంది?
   ఎ) వెల్లింగ్‌టన్ బి) నైనితాల్
   సి) పాట్నా డి) కోల్‌కతా
12. 'నమామి గంగే' వివరాలేవి?
   ఎ) 1985 నుండి ఇప్పటివరకు రూ. 4000 కోట్లు ఖర్చుపెట్టారు.
   బి) ఎక్స్‌పెండిచర్ ఫైనాన్స్ కమిటి ఇటీవల రూ. 3000 కోట్లు ఖర్చుకు అనుమతించింది.
   సి) నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగాకి మిషన్ డైరెక్టర్‌గా రజత్ భార్గవను నియమించారు.
   డి) పైవన్నీ (2018 నాటికి నదిని పూర్తిగా క్లీన్ చేస్తారు.
13. 'కల్వరి' వివరాలేవి?
   ఎ) ప్రాజెక్ట్–75 స్కార్‌పేన్ తొలి జలాంతర్గామి.
   బి) 1600 టన్నుల బరువున్న ఇది ముంబాయ్ హార్బర్‌లో ట్రయల్స్ చేస్తోంది.
   సి) మజగాన్ డాక్ లిమిటెడ్ దీన్ని నిర్మిస్తోంది.
   డి) పైవన్నీ.
14. ఎరువులు, సిమెంట్, విద్యుత్తు, క్రూడాయిల్, రిఫైనరీ ఉత్పత్తులు, బొగ్గు, స్టీల్ వంటి పరిశ్రమలతో కూడిన "కోర్ సెక్టార్" అభివృద్ధి, మార్చి 2016లో ఎంత?
   ఎ) 6.4% బి) 23%
   సి) 13.5% డి) 11.9%
15. ఇండియా – పసిఫిక్ ఐలాండ్ కో–ఆపరేషన్ ఫోరం మూడవ సమావేశం ఎక్కడ నిర్వహిస్తారు?
   ఎ) పాపువాన్యూగినియా బి) మాల్దీవులు
   సి) ఇండోనేషియా డి) శ్రీలంక
16. RCEPని విస్తరించండి? వివరాలు తెల్పండి?
   ఎ) రీజినల్ కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ (RCEP)
   బి) ప్రతిపాదిత మెగా రీజినల్ ఫ్రీ ట్రేడ్ ఎగ్రిమెంట్‌లో 16 ఆసియా–పసిఫిక్ దేశాలు, 10 ASEAN దేశాలు, చైనా, జపాన్, కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండియా సభ్యులుగా ఉంటారు.
   సి) పై దేశాలలో కొన్నింటికి, BRICS దేశాలకి చెందిన వ్యాపారస్థులకి, 'వీసా అక్కర్లేదు' అనే స్కీం మొదలుపెట్టదల్చింది. భారతదేశం.
   డి) పైవన్నీ.
17. 'స్టాన్లీ రిజర్వాయర్' ని, 1934లో నిర్మించారు? ఏ నది మీద?
   ఎ) కావేరినది, మెట్టూర్ డ్యాం వద్ద, తమిళనాడు. బి) ముళ్ళపెరియార్
   సి) కృష్ణానది డి) గోదావరి నది.
18. భారతనావికా దళం, కొత్త ఛీఫ్‌గా ఎవర్ని నియమించారు (మే31, 2016 నుండి)?
   ఎ) సునీల్ లాంబా బి) విక్రంసేథ్
   సి) పవన్‌కుమార్ అగర్వాల్
   డి) రేవా ఖేతర్‌పాల్
19. చైనాలో ఉన్న దున్ హువాంగ్ & భారతదేశంలో ఉన్న ఔరంగాబాద్‌ల మధ్య సిస్టర్ సిటీ బాంధవ్యం ఏర్పరచాలని భారత ప్రధానిని చైనా పెద్దలు కోరారు. వీటి మధ్య పోలిక ఏమిటి? వివరాలేవి?
   ఎ) ఔరంగాబాద్ దగ్గర ఎల్లోరా గుహలు ఉన్నాయి. ఈ గుహలలో గౌతమ బుద్ధుని జీవిత గాథలు తెలిపే శిల్పాలు ఉన్నాయి. అజంతాలో బుద్ధుని చిత్రాలున్నాయి. ఇదే మాదిరిగా దున్ హువాంగ్ దగ్గర చాలా గుహలలో బుద్ధుని శిల్పాలు ఉన్నాయి.
   బి) దున్‌హుహంగ్ గోబీ ఎడారిలో ఉంది.
   సి) మొగావో గుహలలో గౌతమ బుద్ధుని కళా ఖండాలున్నాయి. డి) పైవన్నీ.

20. చైనాలోని "ప్రాచీన సిల్క్ రోడ్" వివరాలేవి?
ఎ) గ్జియాన్ వద్ద మొదలైన సిల్క్‌రోడ్, గాన్‌సూ గుండా పోతుంది.
బి) దున్ హాంగ్ చివరనున్న జేడ్‌గేట్ గుండా వచ్చి రెండుగా చీలుతుంది. మళ్ళీ కాష్‌గర్ వద్ద ఆ రెండు కలుస్తాయి.
సి) ఉత్తర రూట్ గోబీ ఎడారి గుండా వస్తుంది. దక్షిణ రూట్ యార్కండ్ గుండా వస్తూ కారకోరం, లేహ్, శ్రీనగర్ వస్తుంది.
డి) పైవన్నీ
21. "గ్రెకో–బుద్ధిస్ట్ గాంధారా స్కూల్" వివరాలేవి?
ఎ) గౌతమ బుద్ధుని మానవరూపంలో ప్రదర్శింది.
బి) దీన్నే "సెరిండియన్ ఆర్ట్"గా పిలిచారు.
సి) ఇది చైనా వారి శక్తివంతమైన ఆర్టిస్టిక్ సాంప్రదాయం అయ్యింది.
డి) పైవన్నీ.
22. గ్రాండ్ ఓల్డ్ పార్టీ (GOP) అని దేన్నంటారు – USAలో?
ఎ) రిపబ్లికన పార్టీ బి) డెమోక్రటిక్ పార్టీ
సి) కాంగ్రెస్ పార్టీ డి) లేబర్ పార్టీ
23. భారత్‌లో గత సంవత్సర కాలంలో ఎంత మంది LPG సబ్సిడీ స్వచ్ఛందంగా వదులుకున్నారు?
ఎ) ఒక కోటి మంది బి) 2 కోట్ల మంది
సి) 3 కోట్ల మంది డి) 4 కోట్ల మంది
24. సంవత్సరంలో ఎంత ఆదాయం ఉన్నవారు LPG సబ్సిడీకి అర్హులు కాదు?
ఎ) రూ. 10 లక్షలు బి) రూ. 20 లక్షలు
సి) రూ. 30 లక్షలు డి) రూ. 40 లక్షలు
25. ప్రతిపాదిత RBI యాక్ట్ సవరణలో తెలిపిన మానిటరీ పాలసీ కమిటీ (MPC) వివరాలేవి?
ఎ) ఈ కమిటీలో 6 మంది సభ్యులుంటారు.
బి) RBI గవర్నర్ దీని ఛైర్మెన్ ఈయనకు సెకండ్ (లేక) కాస్టింగ్ ఓట్ ఉంటుంది. ఒక వేళ 'టై' ఏర్పడితే.
సి) కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులను నామినేట్ చేస్తుంది. ఇంకా ఒక డిప్యూటీ గవర్నర్ (RBI నుంచి), RBI నామినేట్ చేసే ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు.
డి) పైవన్నీ.
26. "ఇన్‌స్యూరెన్స్ ఓంబుడ్స్‌మాన్" ఎవర్నించి ఫిర్యాదులు స్వీకరించి, సకాలంలో పరిష్కరిస్తాడు? వివరాలేవి?
ఎ) లైఫ్ ఇన్‌స్యూరెన్స్, జనరల్ ఇన్‌స్యూరెన్స్ పాలసీదారుల నుండి (వ్యక్తిగతంగా గాని, గ్రూప్‌గాగని)
బి) 1998 నుండి అమలులోకి వచ్చిన రూల్స్ ఫర్ రిడ్రెసల్ ఆఫ్ పబ్లిక్ గ్రీవెన్సెస్ (RPG) ప్రకారం, అంబడ్స్‌మన్ రూ. 20 లక్షల వరకు గల క్లెయిమ్‌లను పరిష్కరించగలదు.
సి) ఫిర్యాదు అందిన మూడు నెలలలోపు పరిష్కరిస్తారు. డి) పైవన్నీ.
27. భారతదేశంలో ఆర్థిక సంస్థలు ఇచ్చిన ట్రబుల్ అప్పులలో US $ 121 బిలియన్లలో, కేంద్ర ప్రభుత్వరంగ బ్యాంకుల అప్పులు ఎంత? (US $ బిలియన్ డాలర్లలో?
ఎ) 100 బి) 50 సి) 30 డి) 40
28. "స్పెషల్ బ్రేక్ త్రూ ప్రైజ్ ఇన్ ఫండ్ మెంటల్ ఫిజిక్స్" ఇటీవల ఎవరికి ప్రకటించారు? వివరాలేవి?
ఎ) గ్రావిటేషనల్ వేవ్ కనుగొన్న LIGO టీంకి మరియు ఈ పరిశోధనలో పాల్గొన్న 1012 కంట్రిబ్యూటర్లకి కలిపి ఇచ్చారు.
బి) చెన్నయ్ మాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన K.G. అరుణ్ కూడ ఇందులో ఉన్నాడు.
సి) యూరిమిల్నర్ US $ 3 మిలియన్ల అవార్డ్ నెలకొల్పాడు డి) పైవన్నీ.
29. లేసర్ ఇంటర్ ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ (LIGO) వ్యవస్థాకులెవరు?
ఎ) రోనాల్డ్ W.P. డ్రెవర్ బి) కిప్ థోర్నె
సి) రైనర్ వీస్ డి) పై ముగ్గురూ.
30. సంకీర్తనాచార్యుడు త్యాగరాజు ఎప్పుడు జన్మించారు? వివరాలేవి?
ఎ) సాంప్రదాయం ప్రకారం మే 4, 1767 (250 ఏళ్ళ క్రితం)
బి) తిరువాయూర్‌లో నివశించాడు.
సి) త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలు రచించి కర్ణాటక సంగీతాన్ని సుసంపన్నం చేశారు.
డి) పైవన్నీ
31. న్యూజిలాండ్ గవర్నర్–జనరల్ ఎవరు?
ఎ) సర్ జెర్రీ మేట్ పారీ
బి) మారీషియో మాక్రీ
సి) జెఫ్ విలియమ్స్ డి) షింజో అబే
32. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన సర్ ఎడ్మండ్ హిల్లరీ ఏ దేశస్థుడు?
ఎ) న్యూజిలాండ్ బి) అమెరికా
సి) ఫ్రాన్స్ డి) స్వీడన్
33. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) ICICI ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్‌స్యూరెన్స్ బ్రిటన్ దేశ ప్రూడెన్షియల్ (PLC)తో ఏర్పాటయ్యింది.
బి) HDFC స్టాండర్డ్ లైఫ్ బ్రిటన్ దేశ స్టాండర్డ్ లైఫ్ PLC తో ఏర్పాటుయ్యింది.
సి) SBI లైఫ్ BNP పరిబాస్ కార్డిఫ్ SA తో ఏర్పాటయ్యింది.
డి) పైవన్నీ (తొలిసారిగా "ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్" కి వెళ్ళనున్నాయి.
34. ట్రేడ్ ఫెసిలిటేషన్ ఎగ్రిమెంట్ (TFA)ని WTOలో162 సభ్యదేశాలలో ఎన్ని దేశాలు 'రాటిఫై' చేశాయి?
ఎ) 108 (లేక 2/3 వంతు దేశాలు)
బి) 77 సి) 20 డి) 40
35. భారత రాష్ట్రపతి, 47వ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్, నటుడు మనోజ్ కుమార్‌కి ఇటీవల ఇచ్చారు. ఈ అవార్డ్‌లో ఏమేమిచ్చారు?
ఎ) స్వర్ణ కమలం
బి) రూ. 10 లక్షల నగదు బహుమతి
సి) ఒక శాలువ డి) పైవన్నీ.
36. లాబ్ శాంగ్ శాంగే ఏ పదవికి మళ్ళీ ఎన్నికయాయడు? వివరాలేవి?
ఎ) ప్రధానమంత్రి టిబెటన్ గవర్నమెంట్ ఇన్ ఎగ్జైల్
బి) ధర్మశాల, హిమాచల్ ప్రదేశ్‌లో వీరి ఆఫీసుంది.
సి) గతంలో 2011లో కూడ ఈయన సిక్యోంగ్ (ప్రధానమంత్రికి సమాన పదవి) కి ఎన్నికయ్యాడు. డి) పైవన్నీ.
37. మహారాష్ట్ర ప్రతి సంవత్సరం సాధారణంగా ఎంత చక్కెర ఉత్పత్తి చేస్తుంది? (మిలియన్ టన్నులలో)
ఎ) 26 బి) 8.5 సి) 1.5 డి) 22.5
38. డబుల్ ఇకత్ చీరలు/వస్త్రాలు ఎక్కడెక్కడ నేస్తారు?
ఎ) బాలి (ఇండోనేషియా)
బి) ఓకినావా దీవి (జపాన్)
సి) పోచంపల్లి (తెలంగాణ) & పటాన్ (గుజరాత్) డి) పైవన్నీ
39. వైన్ గంగ, వార్ధా నదులు కలిసి ప్రాణహిత నదిగా పిలువబడతాయి. ప్రాణహిత నది, ఎక్కడ గోదావరి నదితో కలుస్తుంది?
ఎ) కాళేశ్వరం వద్ద బి) అన్నారం
సి) ఛేరియాల్ డి) అప్పర్ మానేర్
40. ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రన్న బీమా పథకం వివరాలేవి?
ఎ) అసంఘటిత కార్మిక రంగంలోని 1.5 కోట్ల కార్మికులకు ఇది వరిస్తుంది.
బి) ఈ పథకంలో ఇన్స్యూరెన్స్ కల్గిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు ఇస్తారు. ప్రమాదంలో శాశ్వత అంగ వైకల్యం పొందినా యిస్తారు.
సి) ప్రమాదంలో పాక్షిక అంగ వైకల్యం పొందితే, రూ. 3,62,500/– ఇస్తారు. సహజ మరణానికి రూ. 30,000/– ఇస్తారు.
డి) పైవన్నీ.
41. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల 18.2 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. ఇందులో ఏ జిల్లా రైతులు అత్యధిక లబ్ధిపొందుతారు?
ఎ) మెదక్ జిల్లా బి) నిజామాబాద్ జిల్లా
సి) నల్గొండ జిల్లా డి) కరీంనగర్ జిల్లా
42. "ప్రధానమంత్రి ఉజ్వల యోజన" వివరాలేవి?
ఎ) దారిద్ర్యరేఖ దిగువన ఉన్న 5 కోట్ల మహిళలకు ఉచిత LPG కనెక్షన్ ఇస్తారు. రాబోయే 3 ఆర్థిక సంవత్సరాలలో యిందు కోసం రూ. 8,000 కోట్లు ఖర్చవుతుంది.
బి) ఉత్తర ప్రదేశ్‌లోని బలియాలో దీన్ని ప్రారంభించారు.

సి) ఈ పథకం క్రింద సెక్యూరిటి డిపాజిట్ కట్టనక్కర్లేదు. రూ. 1,600 ఎడ్మినిస్ట్రేటివ్ ఖర్చులు, ప్రెజర్ రెగ్యులేటర్ బుక్ లెట్ ఖరీదు, సేఫ్టీహోస్ ఖరీదు, ప్రభుత్వమే భరిస్తుంది. డి) పైవన్నీ.

43. భారత దేశంలో 16.64 కోట్ల యాక్టివ్ LPG వినియోగదార్లున్నారు. అందుకోసం సంవత్సరానికి ఎన్ని మిలియన్ టన్నుల LPG కావలి?

ఎ) 21 బి) 1.50 సి) 5 డి) 10

44. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్రమోడి ఎక్కడ 11 సోలార్ పవర్డ్ ఈ-బోట్స్ ప్రారంభించారు?

ఎ) అస్సిఘాట్, వారణాశి
బి) పాట్నా సి) కోల్‌కతా డి) ఢిల్లీ

45. కేంద్ర ప్రభుత్వ లేబర్‌మినిస్ట్రీ, ప్రస్తుతం ఉన్న 44 చట్టాలను, 4 కోడ్స్‌గా మార్చదల్చుకుంది. అవిఏవి?

ఎ) ఇండస్ట్రీయల్ రిలేషన్స్ కోడ్ : వేజెస్ కోడ్
బి) సోషల్ సెక్యూరిటి కోడ్
సి) సేఫ్టీ కోడ్ డి) పై నాలుగు

46. లోక్‌సభ స్పీకర్ చేత నియమించబడిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (PAC) ఛైర్మెన్ ఎవరు?

ఎ) K.V. థామస్ బి) P.J. కురియన్
సి) మల్లిఖార్జున్ ఖార్గే డి) వీరెవరు కారు

47. డిసెంబర్ 2015 ఆఖరు నాటికి, ప్రభుత్వ రంగ బ్యాంకుల నాన్ పెర్‌ఫార్మింగ్ ఎస్సెట్స్ (NPA) ఎన్ని లక్షల కోట్ల రూపాయలు?

ఎ) 3.61 బి) 12.61 సి) 5 డి) 6.3

48. ప్రభుత్వరంగ బ్యాంకులలో నిరర్థక ఆస్థులు (NPA) పెరిగిపోవటానికి గల కారణాలు?

ఎ) విల్‌ఫుల్ డిఫాల్ట్
బి) డొమెస్టిక్ & గ్లోబల్ ఎకనమిక్ స్లో డౌన్
సి) క్రెడిట్ రిస్క్ ఎప్రైజల్ చెయ్యటంలో లోన్ మానిటరింగ్‌లో బద్ధకం డి) పైవన్నీ

49. రాజ్యసభలో ఏ బిల్లునైనా చర్చించటానికి 'కోరం' ఉండాలంటారు. 'కోరం' అంటే కనీసం ఎంత మంది MP లు సభలో హాజరైఉండాలి?

ఎ) మొత్తం రాజ్యసభ 250 సభ్యులలో 10శాతం మంది ఉండాలి (అనగా 25 మంది)
బి) 125 సి) 200 డి) 175

50. "ఘోరామారా" దీవి ఎక్కడున్నది? వివరాలేవి?

ఎ) పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో.
బి) ఇది'స్లో'గా కుంగిపోతుంది. సముద్రం నీరు ఆక్రమిస్తోంది. అతిసున్నిత పర్యావరణ సమస్య ఇది.
సి) సుందర్‌బన్స్‌లో ఇది భాగం డి) పైవన్నీ

51. నేషనల్ స్టాక్ ఎక్స్‌ఛేంజ్ కొత్త ఛైర్మెన్ ఎవరు?

ఎ) అశోక్ ఛావ్లా బి) ఎస్.బి. మాథుర్
సి) ఉషా అనంత సుబ్రహ్మణ్యన్
డి) పి. కె. సింగ్

52. దేన్ని "గోల్డెన్ షేక్ హాండ్" అంటారు? వివరాలేవి?

ఎ) ప్రభుత్వరంగ సంస్థలు తమ ఉద్యోగస్థులు 'వాలెంటరీ రిటైర్మెంట్' (VRS) పథకంలో చేరి పదవీరమణ చేయాటాన్ని గోల్డెన్ షేక్ హాండ్ అంటున్నారు.
బి) సాధారణంగా సర్వీసు చేసిన ప్రతి సంవత్సరానికి 45 రోజుల జీతం గాని, రిటైర్‌మెంట్ కావటానికి ఇంకా మిగిలి ఉన్న సంవత్సరాల జీతంగాని (ఏది తక్కువైతే అది) VRS తీసుకునే ఉద్యోగికి ఇస్తారు).
సి) సాధారణంగా 15 సంవత్సరాల సర్వీసు పూర్తయ్యి, 50 సంవత్సరాల వయస్సునిండని వారు, దీనికి అర్హులు.
డి) పైవన్నీ (ఇటీవల SAIL, MTNL ఇలాంటి వార్తల్లో ఉన్నాయి).

53. ఇటీవల భారత రాష్ట్రపతి సందర్శించిన పాపువాన్యూగినియా దేశ వివరాలేవి?

ఎ) "పోర్ట్ మెరెస్‌బై" దీని రాజధాని.
బి) పసిఫిక్ మహా సముద్రంలో ఉన్న, ఈ దీవులలో ఆయిల్ & నేచరల్ గ్యాస్ విస్తారంగా లభ్యమౌతున్నది.
సి) భారతదేశం గతంలో US $ 100 మిలియన్ల లైన్ ఆఫ్ క్రెడిట్ ఇస్తానన్నది, మౌలికరంగ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం.
డి) పైవన్నీ.

54. భారత రాష్ట్రపతి ఇటీవల రాజ్యసభకు ఎవరిని నామినేట్ చేశారు?

ఎ) మేరీకాం బి) సంజయ్ ప్రధాన్
సి) సచిన్ టెండుల్కర్ డి) ఏ.కె.జైన్

55. 2012-13 ఇన్‌కంటాక్స్ అసెస్‌మెంట్ ఇయర్ (AY) ప్రకారం, భారతదేశంలో ఎంత మంది వ్యక్తులు మాత్రమే ఆదాయం పన్ను చెల్లిస్తున్నారు?

ఎ) కేవలం ఒక్క శాతం బి) 5%
సి) 20% డి) 10%

56. ఇస్రోవారి RLV. TD (రీయూజబుల్ లాంచ్ వెహికల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్) ఉపయోగం ఏమిటి?

ఎ) అంతరిక్షయాత్రలో మానవులు పాల్గొనటానికి చేసే పరిశోధనల్లో వాడుతున్నారు.
బి) ఇది చిన్న, విమానం లాంటి ప్రొటోటైప్.
సి) ఈ సంవత్సరం మే/జూన్‌లో ఇస్రో, శ్రీహరి కోట నుండి పంపి పరీక్షించదల్చింది.
డి) పైవన్నీ.

57. 'పనామా డిసేజ్' వివరాలేవి?

ఎ) ఇది అరటి చెట్లకు సోకే ఫంగస్ వ్యాధి.
బి) ఫ్యూసేరియం ఆక్సిస్పోరం f.Sp. క్యూబెన్సే (FOC) అనే ఫంగస్, మట్టి ద్వారా వ్యాపిస్తుంది.
సి) ఆకులు పసుపు పచ్చగా మారిపోతాయి, ఆకులు వంకర్లు తిరుగుతాయి, కాండం పగిలిపోతుంది.
డి) పైవన్నీ (1950లో పనామా గ్రాస్ మిషెల్ బనానాను అంతం చేసింది. ఇప్పుడు, కేరళలో ఈ వ్యాధి ప్రమాదం ఉంది.

58. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్ కాదు.

ఎ) గూర్‌గావ్ - గురుగ్రామ్
బి) మైసూర్ - మైసూరు
సి) బాంగ్‌ళూర్ - బెంగలూరు
డి) సిమ్లా - శ్యామల (ఇంకా ఆమోదించలేదు)

59. 'జోజిలాపాస్' గుండా పోయే శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారి పొడవెంత? (కి.మీ.లలో)

ఎ) 434 బి) 234 సి) 534 డి) 634

60. రాజా రవివర్మ వేసిన 262 చిత్రాలు, 131 లిథోగ్రాఫులు బెంగళూరులో ప్రదర్శించనున్నారు తొలిసారిగా. రాజారవివర్మ వివరాలేవి?

ఎ) 1905లో ఆయన మరణించారు.
బి) కేరళ రాజ వంశంలో జన్మించిన ఆయన, కొద్దికాలం బెంగళూరులో నివసించారు.
సి) 'హంసదమయంతి', 'లక్ష్మీ' 'సరస్వతి' పెయింటింగ్‌లలో ఆయన కూతురు 'మహాప్రభ' ముఖం మోడల్‌గా ఉందంటారు.
డి) పైవన్నీ

61. మణిపూర్ వాసులు 125 సంవత్సరాల క్రితం ఆఖరిసారిగా బ్రిటీష్ సైన్యంతో పోరాడరు. ఆఖరి పోరటంలో వీరమరణం పొందిన యుద్ధ వీరుల కోసం ఎక్కడ "వార్ మెమోరియల్ నిర్మించారు?

ఎ) ఖోంగ్‌జోం బి) కొహిమా
సి) ఈటానగర్ డి) షిల్లాంగ్

62. 'డాన్ క్విక్సోట్' నవలారచయిత 'సెర్వాంటిస్', 400 సంవత్సరాల క్రితం మరణించాడు. ఆయన పేర నెలకొల్పిన బహుమతి ఇటీవల ఎవరికిచ్చారు?

ఎ) ఫెర్నాండో డెల్‌పాసో
బి) టామీసుగియార్టో
సి) అహమ్మద్ జావేద్ డి) ఆర్.కె. మాథుర్

## జవాబులు (జూన్ - 2016)

| | | | |
|---|---|---|---|
| 1-బి | 17-ఎ | 33-డి | 49-ఎ |
| 2-డి | 18-ఎ | 34-బి | 50-డి |
| 3-డి | 19-డి | 35-డి | 51-ఎ |
| 4-డి | 20-డి | 36-డి | 52-డి |
| 5-ఎ | 21-డి | 37-బి | 53-డి |
| 6-ఎ | 22-ఎ | 38-డి | 54-ఎ |
| 7-డి | 23-ఎ | 39-ఎ | 55-ఎ |
| 8-డి | 24-ఎ | 40-డి | 56-డి |
| 9-బి | 25-డి | 41-ఎ | 57-డి |
| 10-బి | 26-డి | 42-డి | 58-డి |
| 11-బి | 27-ఎ | 43-ఎ | 59-ఎ |
| 12-డి | 28-డి | 44-ఎ | 60-డి |
| 13-డి | 29-డి | 45-డి | 61-ఎ |
| 14-ఎ | 30-డి | 46-ఎ | 62-ఎ |
| 15-ఎ | 31-ఎ | 47-ఎ | |
| 16-డి | 32-ఎ | 48-డి | |

■

### భారత్– అమెరికా రక్షణ ఒప్పందం:



మనదేశంతో ఒక కీలక రక్షణ ఒప్పందం కోసం మార్క్ వార్నర్, జాన్ కార్నిన్ అనే ఇద్దరు అమెరికన్ పార్లమెంట్ సభ్యులు ఒక బిల్లును అమెరికన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చట్ట రూపం ధరిస్తే, నాటో, ఇజ్రాయిల్‌ల మాదిరి మన దేశం కూడ అమెరికాతో అత్యంత సన్నిహిత రక్షణ భాగస్వామి అవుతుంది. ఇండో–యుఎస్ డిఫెన్స్ టెక్నాలజీ అండ్ పార్టనర్‌షిప్ చట్టంగా పిలిచే ఈ చట్టం వలన మన దేశానికి, ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ వంటి అంశాలలో సన్నిహిత సహకారం లభిస్తుంది.

### ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన:



ప్రధానమంత్రి నరేంద్రమోడి మే 11వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని బలియాలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం క్రింద, రానున్న మూడు సంవత్సరాల కాలంలో ఐదు కోట్లమంది దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారికి వంట గ్యాస్ కనెక్షన్లను కల్పించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని పేదరిక నిర్మూలన కార్యక్రమాలు పేదల సంక్షేమానికి పాటుపడాలే కానీ, ఎన్నికలు లక్ష్యంగా ఉండరాదని అన్నారు. పహల్ పథకం క్రింద ఉన్నత ఆదాయ వర్గాలవారు వదులుకున్న రాయితీ ప్రయోజనాన్ని కూడ ఈ పథకానికి వినియోగిస్తారు.

### నౌక దళానికి నూతన అధినేత:



వైస్ అడ్మిరల్ సునిల్ లంబా భారతీయ నౌక దళానికి నూతన అధిపతిగా మే 31వ తేదీన పదవీ ప్రమాణం చేయనున్నారు. ప్రస్తుతం ముంబైలో నౌకదళ పశ్చిమ విభాగానికి నేతృత్వం వహిస్తున్న సునిల్ లంబా, ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. ఇండియన్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ అనంతరం, 1978 లో నౌకదళంలో చేరిన లంబా తమ ఉత్తమ సేవలకు పరమ విశిష్ట సేవ మెడల్‌ను కుడ పొందారు.

### వచ్చే సంవత్సరం మరో 18 కొత్త బ్యాంకులు:



వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి, మరో 18 నూతన, చిన్న బ్యాంకులు ప్రజలకు సేవలందించడం ప్రారంభిస్తాయని భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నరు శ్రీ రఘురామ రాజన్ అన్నారు. చిన్న బ్యాంకులైతే పేదలకు చిన్న స్థాయిలో రుణాలనందించడానికీ, వారి బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికీ అనువుగా ఉంటాయని ఆయన అభిప్రాయ పడ్డారు. బ్యాంకింగ్ సదుపాయాలతో పాటు, ఎక్కువమందికి ఉపాధి కలిపించడం లక్ష్యమని కూడ ఆయన అన్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాలలో ఇంతవరకూ అస్పష్టంగా ఉన్న విధి–నిర్దేశాలను క్రోడీకరిస్తున్నట్టుగా కూడ ఆయన తెలియచేశారు.

### ఇకపై రాత్రి 8.00 గంటల తర్వాత ఏటిఎంలలో డబ్బు పెట్టరు:



నగదు వాహనాలపై పెరుగుతున్న దాడుల దృష్ట్యా ఇకపై ఏటిఎంలలో నగదు నింపడానికి రాత్రి ఎనిమిది గంటల తరువాత వాహనాలను పంపరు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల ప్రకారం, ఇకపై, పట్టణ ప్రాంతాలలో రాత్రి ఎనిమిది తరువాత, గ్రామీణ ప్రాంతాలలో సాయంత్రం ఐదు గంటల తరువాత, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలోనైతే, మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఏటిఎంలలో నగదు నింపరు. దీనికి అనుగుణంగా ఆయా సేవలందిస్తున్న సంస్థలు, తమ రోజువారీ నగదును ఉదయాన్నే బ్యాంకుల నుండి తీసుకోవాలి. అంతే కాదు, ఒకసారి ఒక వాహనానికి ఒక ట్రిప్పుకు ఐదు కోట్ల కన్నా అనుమతించరు. దేశవ్యాప్తంగా సుమారు 8000ల ప్రైవేటు వాహనాలు రూ. 15 వేల కోట్లమేర ఏటిఎంలలో నగదు నింపుతున్నాయి.

## ఆంధ్రప్రదేశ్‌లో అన్ని విభాగాలకూ ఈ-ప్రొక్యూర్మెంట్ విధానం:



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ అన్ని విభాగాలకూ ఈ-ప్రొక్యూర్మెంట్ విధానాన్ని తప్పనిసరి చేసింది. ప్రభుత్వ రంగ విభాగాలకు కూడ వర్తించే ఈ నిబంధన ప్రకారం, లావాదేవీలలో పారదర్శకతే కాక, నిర్వహణా వ్యయాలు కూడ గణనీయంగా తగ్గుతాయని రాష్ట్ర సమాచార-సాంకేతిక శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. టెండర్లను దాఖలుచేయడం, ధరావత్తు సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించడం జరుగుతుందన్నారు. ఆ విభాగం కార్యదర్శి, ప్రద్యుమ్న మాట్లాడుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, మెరుగు పరచిన మీ సేవ విధానంలో ఉపాధిహామీ పథకం చెల్లింపులు, విద్యార్థుల ఉపకారవేతనాలను ఆన్ లైన్ లోనే చెల్లిస్తున్నట్లు చెప్పారు.

## ప్రథమ సోలార్ బోట్:



భారతదేశపు మొదటి సౌర శక్తితో నడిచే పడవ కేరళలో జల రవాణాకు సిద్ధంగా ఉన్నది. ఫ్రెంచి కంపెనీ సహకారంతో దేశీయంగా ఈ పడవను రూపొందించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. రెండు ఎలక్ట్రిక్ మోటార్లతో పనిచేసే 20 మీటర్ల పొడవుండే ఈ పడవలో 75 మంది ప్రయాణించవచ్చు. 20 కిలోవాట్ సౌర విద్యుత్తుతో నడిచే ఈ పడవ పూర్తిగా కాలుష్యరహితం. వైకోం నుండి, తవనక్కడవ వరకు రెండున్నర కిలోమీటర్ల జల రవాణాకు ఈ పడవనుపయోగిస్తారు. ఈ పడవ జీవితకాలం 20 సంవత్సరాలు.

## హెచ్.ఐ.వి. బేబీలు ఇక సురక్షితం:



హెచ్.ఐ.వి. ఉన్న మహిళలు గర్భం ధరిస్తే పుట్టబోయే పిల్లలకు కూడా ఈ వ్యాధి వస్తుందేమోననే భయం ఇంతవరకూ ఉండేది. అయితే, నివ్రపిన్ వంటి మందులు /నోటి చుక్కల ద్వారా ఆ అవకాశాన్ని మూడవ వంతుకు పరిమితం చేశాము. కానీ, ఇప్పుడు అలా పుట్టబోయే బిడ్డలను నూరుశాతం సురక్షితం చేస్తూ, ముంబై లోని జె.జె. ఆసుపత్రి ఒక నూతన ఆశను కల్పించింది. ఆ ఆసుపత్రిలో 2014లో పురుడు పోసుకున్న హెచ్.ఐ.వి. ఉన్న మహిళలలో నూటికి నూరు శాతం సురక్షితమైన బిడ్డలను ఇవ్వగలిగామని ప్రకటించింది. టెనోఫోవీర్, లామివుడైన్, ఎఫవీరెంజ్ అనే మూడు మందులను కలిపి ఒకటే టాబ్లెట్‌గా ప్రతి రాత్రి ఆ తల్లులకు ఇచ్చామని దీనితో సమస్య పరిష్కారమైందని అక్కడి డాక్టర్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖల వారి ప్రణాళిక సూచనల ప్రకారం, ఈ ట్రీట్మెంట్‌ను అమలుచేశామని వారు తెలియచేసారు. మామూలుగా అయితే, తల్లి గర్భంలో ఉన్నపుడు 45 శాతం ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉన్నది. జన్మించిన తరువాత తల్లి పాల ద్వారా మరో 15 శాతం ఈ అవకాశం ఉన్నది. గతంలో నివ్రపిన్ మాత్రమే ఇచ్చేటప్పుడు కనీసం 11 శాతం బిడ్డలకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉండేది. ఇప్పుడు ఈ మూడు మందుల సమ్మేళనం ద్వారా ఈ ప్రమాదాన్ని శూన్యం చేశామని వైద్యులు ప్రకటించారు.

## మరుగుదొడ్డి లేకపోతే సామాజిక బహిష్కరణ:



ఇంట్లో మరుగుదొడ్డి కట్టించుకోకపోతే, ఆ గ్రామంలో దాదాపు సంఘ బహిష్కరణే! మధ్యప్రదేశ్‌లోని రత్లామ్ జిల్లాలోని భూతేడా గ్రామంలో ఇంట్లో మరుగుదొడ్డి కట్టించుకోనివారికి క్షవరం చేయడానికి కూడ ఎవరూ ముందుకు రారు. అలాగే వారికి ఎవరూ కూరగాయలు అమ్మరు. స్వచ్ఛభారత్ అభియాన్ క్రింద ఆ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను మొదలుపెట్టినపుడు, ఒక్కరొక్కరుగా అన్నీ గ్రామీణ వృత్తి పనివాళ్లు కూడా ఇంట్లో మరుగుదొడ్డి లేనివారికి తమ సేవలను అందించమని శపథం చేస్తూ ముందుకు వచ్చారు. ప్రస్తుతం పరిశుభ్రతా వెలుగు రేఖలు విచ్చుకుంటూ ఆ గ్రామం దేశంలో ఎందరికో ఆదర్శప్రాయమైంది.

## సంప్రదాయ వైద్య విధానాలకు చేయూత:



దేశంలోని సంప్రదాయ వైద్య విధానాలకు మరింత పుష్టిని కలిగించి, ప్రపంచ ప్రజలకు మరింత చేరువచేయాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రపంచ ఆరోగ్య సంస్థతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ మేరకు, మే 13, 2016 న జెనీవాలో ఇరువర్గాలకు ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మొదటి దశలో 2023 వరకు అమలవుతుంది. ■

దూరదృష్టి

దౌత్య నీతిలో నూతన దృక్పథం:

# దేశీయంగా సమ్మిళిత అభివృద్ధి - అంతర్జాతీయ వేదికపై కీలక భూమిక



నూతన ప్రభుత్వ హయాంలో విదేశాంగ విధానం రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమ్మిళిత రూపంలో అభివృద్ధి కేంద్ర బిందువుగా క్రియాశీలకంగా మారింది. ఢిల్లీలో కొలువు తీరిన కొత్త ప్రభుత్వం క్రమక్రంగా చిరకాల మిత్ర దేశం రష్యాను పక్కకు నెట్టి, అమెరికా సారధ్యంలోని పాశ్చాత్య దేశాలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తోందన్న ప్రచారం సాగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాస్కో పర్యటన ఈ అనుమానాలను నివృత్తి చేయడమే కాదు పరస్పర విశ్వాసాన్ని ప్రోది చేసింది.

రెండు సంవత్సరాల క్రితం 2014 మే నెలలో అధికాం పగ్గాలు చేపట్టిన వెంటనే, నూతన ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ఎన్నో వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టింది. ఎంతో విశాలదృక్పథంతో భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా), నైపుణ్య భారత్ (స్కిల్ ఇండియా), ఆధునిక నగరాలు (స్మార్ట్ సిటీస్), మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్ (క్లీన్ ఇండియా) వంటి అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలన్నీ ప్రాధమికంగా దేశీయ కార్యక్రమాలుగా కనిపిస్తాయి. కానీ, కాదు. వాస్తవంలో ఈ కార్యక్రమాలలో గణనీయ స్థాయిలో విదేశీ భాగస్వామ్యం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, ఆర్థిక సహయం, సాంకేతిక సహకారం వంటి అంశాలు ఇమిడి ఉన్నాయి. కాబట్టి, ఈ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే దౌత్య విధానం, దౌత్య సంబంధాలు పోషించే పాత్ర అత్యంత కీలకమైనవి, నిజానికి ఇదొక సవాలు. ఈ సవాలును స్వీకరించడంలో నూతన ఎన్.డి.ఎ. ప్రభుత్వం అనుసరించిన దౌత్యనీతి స్వల్ప వ్యవధిలోనే చక్కని ఫలితాలను సాధించింది. నూతన ప్రభుత్వ హయాంలో విదేశాంగ విధానం రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమ్మిళిత రూపంలో అభివృద్ధి కేంద్ర బిందువుగా క్రియాశీలకంగా మారింది. దేశీయంగా సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా అందుకు అనుగుణమైన విదేశీ దౌత్య సంబంధాలను ఏర్పర్చుకోవడం పై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించింది. దౌత్య సంబంధాలను దేశీయ ప్రాధాన్యతలతో ముడి వేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అంతే కాదు, ముఖ్యంగా ఇరుగు పొరుగు దేశాలతో పరస్పర స్నేహ సంబంధాల వారధిని నిర్మించుకునే అంశానికి కూడా మన నూతన విదేశాంగ విధానం సమాధానం గా నిలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పరస్పర ప్రయోజనకర సహకారం, చివరకు ప్రపంచ వేదిక పై భారతదేశ పద ముద్రలు ప్రస్ఫుటంగా కనిపించేలా చేయడం, ప్రపంచ వేదికపై ఒక బలీయమైన శక్తిగా భారత దేశాన్ని నిలపడం నూతన ప్రభుత్వ విదేశాంగ విధానంగా కనిపిస్తోంది. భారత దేశ దీర్ఘకాల దృక్పధాన్ని ప్రపంచ దేశాలు గుర్తించేలా చేయడం కోసం మనదేశం చేపట్టిన రాజకీయ, ఆర్థిక , దౌత్య పరమైన చర్యలకు మంచి స్పందన లభించింది. ఈ దిగువన పేర్కొన్న విజయమాల కేవలం ఒక సూచిక మాత్రమే.

**అచల్ మల్హోత్రా,** అర్మేనియాలో భారత మాజీ రాయబారి.
E-mail: achal_malhotra@hotmail.com

## సమ్మిళిత అభివృద్ధి దౌత్యం

### మౌలిక సదుపాయాలు – ఆర్థిక వ్యవహారాలు:

గత సంవత్సరం ఆగష్టు మాసంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దుబాయ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మన దేశంలో రాబోయే తరం అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన 75 బిలియన్ డాలర్ల వనరులను సమకూర్చుకునేందుకు యూ ఏ ఇ – భారత్ పెట్టుబడి నిధిని ప్రధాన మంత్రి ప్రకటించారు. మరో వంక జాతీయ మౌలిక సదుపాయాల పెట్టుబడి నిధి పరిధిలో భారత్ – ఇంగ్లాండ్ భాగస్వామ్య నిధిని ఏర్పాటు చేశారు. విదేశీ సహాయ సహకారాలు, పెట్టుబడుల ద్వారా ముఖ్యంగా భారతీయ రైల్వే, రోడ్లు అధికంగా ప్రయోజనం పొందుతాయి. జపాన్ ఈశాన్య రాష్ట్రాలలో రోడ్ల అనుసంధానానికి నిధులు సమకూర్చేందుకు ముందుకొచ్చింది. అదే విధంగా జపాన్– భారత దేశం సంయుక్తంగా హై స్పీడ్ రైళ్ళ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో ముంబై – అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం ఏడూ గంటలనుంచి రెండు గంటలకు తగ్గిపోతుంది. అలాగే జపాన్, చెన్నై – అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్టుకు 200 బిలియన్ యెన్ల మేరకు ఓడీఏ రుణం ఇచ్చింది. మరో వంక ఫ్రాన్స్ బెంగుళూర్ – కొచ్చి మెట్రో ప్రాజెక్ట్ సెకండ్ ఫేజ్ పనులకు నిధులు సమకురుస్తోంది. బెంగుళూరు – నాగపూర్ మెట్రో ప్రాజెక్టుకు జర్మనీ 500 మిలియన్ యూరోల మేర రుణం సమకూరుస్తుంది. మనదేశం, చైనా రైల్వే రంగంలో పరస్పర సహకారాన్ని మరింతగా మెరుగు పరచుకోవాలని నిర్ణయించాయి. ఈ ఒప్పంద పరిధిలా ప్రతిపాదించిన ప్రాజెక్టులలో చెన్నై – బెంగుళూరు– మైసూరు సెక్టర్లో రైళ్ళ వేగాన్ని పెంచే ప్రాజక్టు కూడా ఉంది. ఫ్రెంచ్ అలస్తోం సంస్థ బీహార్‌లోని మాధేపురాలో 3.2 బిలియన్ యూరొల పెట్టుబడితో ఎలక్ట్రిక్ లోకో మోటివ్ ప్లాంట్ నిర్మిస్తోంది. మన దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల కోసం నిధులను సమకూర్చుకునేందుకు తొలిసారిగా లండన్‌లో రూపీ డినామినేషన్ బ్యాండ్ విడుదల చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.

### మేక్ ఇన్ ఇండియా :

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రధాన లక్ష్యం దేశంలో ఉత్పత్తి రంగానికి ఊతం ఇవ్వడం. అయితే, అదే సమయంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కూడా ప్రభుత్వం విదేశాలలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టింది. ఈ ప్రచారానికి మంచి స్పందన వచ్చింది. మన దేశంతో కలిసి సంయుక్తంగా కెఎ 226 హెలికాప్టర్లను తయారు చేసేందుకు రష్యా ముందు కొచ్చింది. అంతే కాదు, మేక్ ఇన్ ఇండియా పతాక ఛాయల్లో మన దేశంలోనే ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రష్యా నిర్ణయించింది. అదే విధంగా అందుకు అనుబంధంగా న్యూక్లియర్ విద్యుత్ కేంద్రాలను నిర్మించేందుకు కూడా రష్యా ముందుకొచ్చింది. రష్యా అణు ఇంధన సంస్థ,'రోసాటం', మన దేశఅణు ఇంధన శాఖ ఇప్పటికే ఇందుకు సంబందించిన స్థల సేకరణ కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయి. ఎల్ అండ్ టీ, ఫ్రెంచ్ అరేవ (ఎ.అర్.ఈ.వీ.ఎ) జైతాపూర్ అణు ఇంధన ప్రాజెక్ట్ దేశీయ సాంకేతిక స్థాయిని పెంచేందుకు, సాంకేతిక విజ్ఞాన బదలాయింపుకు అంగీకరించాయి. ఎయిర్ బస్ – టాటా సంయుక్తంగా సి 295 హెలికాప్టర్ల తయారీని చేపడుతున్నాయి. అదే విధంగా ఎయిర్ బస్ హెలికాప్టర్ల తయారీకి మహేంద్రతో కూడా ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నది. బోయింగ్ ఎ.హెచ్. 64 అపాచీ హెలికాప్టర్‌కు ఏరో స్ట్రక్చర్ నిర్మిస్తోంది. 12 బిలియన్ల డాలర్ల పాన్ – మేక్ ఇన్ ఇండియా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశారు. మారుతి సంస్థ జపాన్‌కు ఎగుమతి చేసేందుకు మన దేశంలో కార్ల తయారీ చేపడుతోంది.

### విదేశీ పెట్టుబడులు:

మన దేశంలో అభివృద్ధి లక్ష్యంగా ఎన్నో ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ ప్రణాళికలు వాస్తవ రూపం దాల్చేందుకు, దేశీయ వనరులు సరిపోవు. అందుకోసంగా విదేశీ వనరులు సమకూర్చుకునేందుకు మన ప్రభుత్వం దౌత్య విధానాన్ని మార్గంగా ఎంచుకుంది. ఈ దౌత్య విధానం మన ఆర్థిక వ్యవస్థ పట్ల విదేశీ పెట్టుబడిదారులలో, విదేశీ ప్రభుత్వాలలో విశ్వాసం పెంచాయి. ఫలితంగా, 2015 సంవత్సరంలో అంతకు ముందు సంవత్సరం కంటే 40% ఎక్కువ విదేశీ పెట్టుబడులు సమకూరాయి. మన దేశీయ కంపెనీలు చైనా కంపెనీలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు 22 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అదే విధంగా యునైటెడ్ కింగ్డమ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ 9.2 బిలియన్ పౌండ్స్‌కు చేరింది. ఇందులో వోడా ఫోన్ ఒక్కటే 1.3 బిలియన్ పౌండ్స్ మేర ఒప్పందాలు కుదుర్చుకుంది. మన దేశంలో మౌలిక సదుపాయాల కల్పన, స్మార్ట్ సిటీల అభివృద్ధికి జపాన్ రానున్న ఐదు సంవత్సరాలలో 35 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. దక్షిణ కొరియా 10 బిలియన్ డాలర్లు వాగ్దానం చేసింది. (ఆర్థిక అభివృద్ధి సహకార నిధి కింద ఒక బిలియన్ డాలర్లు, రైల్వేలు, విద్యుత్ ఉత్పాదన, పంపిణి వంటి ప్రాథమిక రంగాలకు ఎగుమతి రుణం రూపంలో 9 బిలియన్ డాలర్లు). అదే విధంగా జర్మనీకి చెందిన ఆటోమొబైల్ ఇంజనీరింగ్ దిగ్గజం, బోస్చ్ సంస్థ మన దేశంలో 100 బిలియన్ పౌండ్స్ పెట్టుబడితో మూడు ఉత్పత్తి సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రకటించింది.

### స్మార్ట్ సిటీస్ :

మన దేశంలో స్మార్ట్ సిటీస్ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించేందుకు అనేక ప్రపంచ దేశాలు ముందుకొచ్చాయి.

విశాఖపట్నం, అహ్మదాబాద్, అలహాబాద్ నగరాలను స్మార్ట్ సిటీస్‌గా అభివృద్ధి పరిచేందుకు అమెరికా సంసిద్ధత వ్యక్త చేయగా, చండీఘడ్, నాగపూర్, పుదుచ్చేరి నగరాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా దేశంలో స్మార్ట్ సిటీస్ అభివృద్ధికి 20 బిలియన్ల యూరోలు పెట్టుబడి పెట్టేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది.

**డిజిటల్ ఇండియా – స్కిల్ ఇండియా:**

మన ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా కార్యక్రమాలకోసంగా గణనీయ స్థాయిలో సహాయం అందిచేందుకు ముందుకొచ్చిన బహుళ జాతి దిగ్గజాలలో మైక్రోసాఫ్ట్, గూగుల్ సంస్థలు ప్రధానమైనవి. అదే విధంగా అమెరికా, జర్మనీ, యునైటెడ్ కింగ్డమ్, జపాన్, సింగపూరు, మలేషియా దేశాలు కూడా మన దేశంలో డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా కార్యక్రమాల అమలులో సహాయం చేసేందుకు ముందుకొచ్చాయి.

**గంగానది ప్రక్షాళన ( క్లీన్ గంగ):**

పవిత్ర గంగా నది ప్రక్షాళన కార్యక్రమానికి జపాన్ , జర్మనీ దేశాలు ఆర్ధిక సహకారంతో పాటుగా సాంకేతిక సహకారాన్ని కూడా అందించేందుకు ముందుకొచ్చాయి.

**ఇంధన భద్రత:**

ఈ రంగంలో దౌత్య సంబంధాలు, ప్రయత్నాలు ప్రధానంగా స్వచ్ఛ ఇంధనం భాగస్వామ్యం పై దృష్టిని కేంద్రీకరిచారు. ఈ విషయంలో మన దేశం చొరవతో గత సంవత్సరం డిసెంబర్ లో పారిస్ లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో వంద దేశాలతో చేతులు కలిపి అంతర్జాతీయ సౌర శక్తి కూటమిగా ఏర్పడ్డాయి. ఇదొక మైలురాయి. ఈ అంతర్జాతీయ కూటమి కార్యాలయం కోసం మన దేశం గుర్గావ్ – ఎన్సీఆర్ ఢిల్లీలో భూమిని కేటాయించింది. కార్యాలయ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన కోసంగా 30 మిలియన్ డాలర్లు సమకూర్చేందుకు సంసిద్ధతను వ్యక్త పరిచింది. పౌర అణు ఇంధన సహకార ఒప్పందం మన దేశంలో అణు ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు మార్గాన్నిసుగమం చేసింది. అదే విధంగా విదేశాల నుంచి సహజసిద్ధ యురేనియంను దిగుమతి చేసుకునే మార్గాన్ని సులభతరం చేసింది. తద్వారా మన దేశంలో వినియోగామయ్యే ఇంధనంలో స్వచ్ఛమైన ఇంధన వాటాను పెంచుకోవాలన్న అంతిమ లక్ష్యాన్ని చేరువ చేసింది.

**విశ్వాస రాహిత్య సమస్యకు పరిష్కారం .. వారధి నిర్మాణానికి .. ప్రపంచ వేదిక పై ప్రముఖ స్థానం కోసం దౌత్య విధానం ..**

ప్రపంచంలోని అన్ని ప్రధాన భూభాగాలు – దక్షిణ ఆసియా, వాయువ్య ఆసియా, మధ్య ఆసియా పశ్చిమ ఆసియా, గల్ఫ్, ఆఫ్రికా, ఆసియా పసిఫిక్, ఇవి అన్నీ కూడా మన దౌత్య నీతి గమ్య స్థానాలు, అక్కడితో ఆగిపోలేదు మన దేశం ఆసియాన్, తూర్పు ఆసియా సమ్మిట్, నామ్, జి–20, బ్రిక్స్, వంటి ప్రాంతీయ మండళ్ళ అన్నిటిలో మన దేశం కీల పాత్రను పోషిస్తోంది. అదే సమయంలో ఐక్య రాజ్య సమితి చర్చల్లో మన వాణి వినిపిస్తోంది.

**ఇరుగు –పొరుకు కు తొలి ప్రాధాన్యత:**

ఇది దౌత్య పరంగా చాలా ప్రాధాన్యతగల ముందడుగు. నూతన ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టక ముందే ఈ అడుగు పడింది. 2014లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి సార్క్ దేశాల అధినేతలు / ప్రభుత్వాధి నేతలు అందరూ హాజరయ్యారు. ఇరుగు పొరుగు దేశాధినేతలు/ ప్రభుత్వాధి నేతలను ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించడంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇరుగు పొరుగు దేశాలతో భారత దేశం స్నేహ సంబంధాలను కోరుకుంటోంది అన్న స్పష్టమైన సంకేతాలను ఇచ్చారు. ఇలా మొదలైన పొరుగు దేశాల స్నేహ బంధ ప్రస్థానం పరస్పర పర్యటనలు, ప్రాతీయం, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాల సందర్భంగా కలిసి ఒకరి అభిప్రాయాలను మరొకరితో పంచుకోవడం ద్వారా మరింతగా సుస్థిరం చేసుకోవడం జరిగింది. జరుగుతోంది. ఇక మన దాయాది దేశం పాకిస్తాన్ విషయానికి వస్తే ప్రమాణ స్వీకార సందర్భం ఉభయ దేశాల మధ్య నిలిచి పోయిన చర్చల ప్రక్రియ పునరుద్ధరణకు ఎంతగానో తోడ్పడింది. మొత్తంగా చూస్తే, మన దేశం ఇరుగు పొరుగు దౌత్య విధానం ఆశించిన దాని కంటే ఎక్కువ సంతృప్తిని ఇచ్చిందని చెప్పవచ్చును. భూటాన్, బంగ్లాదేశ్‌తో మన సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయి. బంగ్లాదేశ్‌తో కుదిరిన సరిహద్దు ఒప్పందం 4096 కిలో మీటర్ల భూవివాదాన్ని పరిష్కరించడమే కాదు, సరిహద్దు పరిరక్షణ యాజమాన్యాన్ని, ముఖ్యంగా అక్రమ చొరబాట్లను అరికట్టడంలో, మానవ రవాణాను అదుపుచేయడంలో అదే విధంగా అక్రమ వస్తు రవాణాను కట్టడి చేయడంలో ఎంతగానో తోడ్పడుతుంది. అయితే, ఎవరికీ చెందని 169 భూభాగాల్లో, ఏ దేశానికీ చెందని, ఏ దేశ పౌరసత్వం లేని 50 వేల మందికి ఈ ఒప్పందం చట్టబద్ధమైన గుర్తింపును, పౌరసత్వాన్ని కలిపించింది. మరో పొరుగు దేశం నేపాల్‌తో మన దేశ సంబంధాలు మెరుగయ్యాయి. ఉభయ దేశాల మధ్య విశ్వాస స్థాయి పెరిగింది. తద్వారా శ్రీలంక, మాల్దీవ్స్‌తో మన సంబందాలను పునః నిర్వచించుకునే అవకాశం ఏర్పడింది. ఆఫ్ఘనిస్తాన్‌తో వ్యూహాత్మక బాగస్వామ్యం కొత్త శక్తిని పుంజుకుంది, అయితే, మన దేశం ఎంత సంయమనాన్ని చూపినా పాకిస్తాన్‌తో సంబంధాల విషయంలో చెప్పుకోదగ్గ, అభివృద్ధి ఇంతవరకూ కనిపించలేదు. అయినా తలుపులు ఇంకా పూర్తిగా మూసుకు పోలేదు. కనీసం కిటికీలు ఇంకా తెరుచుకునే ఉన్నాయి, కాబట్టి సమీప

భవిష్యత్‌లో దాయాది దేశాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడతాయని అశించ వచ్చును.

**పి –5:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్, రష్యా, ఫ్రాన్స్ పర్యటనలు పి–5 దేశాలతో మన సంబంధాలను మెరుగు పరుచుకునే సాధనాలుగా పని చేశాయి. ఈ దేశాలతో బహుముఖ సహకార నిర్మాణానికి పునాదులను ఏర్పాటు చేశాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి మాస్కో పర్యటన అనేక అనుమానాలను నివృత్తి చేసింది, 2014లో కేంద్రంలో ప్రభుత్వం మారింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కొలువు తీరిన కొత్త ప్రభుత్వం క్రమక్రంగా చిరకాల మిత్ర దేశం రష్యాను పక్కకు నెట్టి, అమెరికా సారధ్యంలోని పాశ్చాత్య దేశాలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తుందన్న ప్రచారం సాగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాస్కో పర్యటన ఈ అనుమానాలను నివృత్తి చేయడమే కాదు పరస్పర విశ్వాసాన్ని ప్రోది చేసింది. అదే విధంగా ప్రస్తుత బహుముఖ ప్రపంచంలో ఎవరి అవసరాలు వారి కుంటాయని ఉభయ దేశాలు గుర్తించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాస్కో పర్యటన ఎంతగానో ఉపకరించింది.

**యాక్ట్ ఈస్ట్ పాలసీ:**

1990లలో అప్పటి ప్రభుత్వం,'లుక్ ఈస్ట్ పాలసీ'ని తీసుకొచ్చింది. దానికి మెరుగులు దిద్ది కొత్త ప్రభుతం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' ని రూపొందించింది. ఆసియాన్ దేశాలతో ఆర్థిక సంబంధాలకు ఈ విధానం ప్రాధాన్యత ఇచ్చింది. ఆసియాన్ – భారత్ శాస్త్ర సాంకేతిక అభివృద్ధి నిధికి భారత వాటాను ఒక మిలియన్ డాలర్ల నుంచి 5 మిలియన్ డాలర్లకు పెంచడం జరిగింది.

**ద్వీప దేశాలు:**

మాల్దీవులు, శ్రీలంక, మారిషస్, సీషెల్స్ వంటి చిన్న చిన్న ద్వీప దేశాలతో దౌత్య సంబంధాలను మెరుగు పరుచుకునే ప్రయత్నాల వెనక సముద్ర భద్రత, రక్షణ నీలి/సముద్ర ఆర్థిక వ్యవస్థల కోణంలో ప్రాధాన్యత ఉంది. మరో విధంగా చూస్తే చైనా దుందుడుకు పోకడలను అరికట్టే ధ్యేయం కూడా ఇందులో కనిపిస్తుంది. ఇక పశ్చిమ ఆసియా / మధ్య ప్రాచ్య దేశాల విషయానికి వస్తే ఇంధన భద్రత దృష్ట్యా గానీ, ఆ దేశాలలో భారతీయ సంతతికి చెందిన వారి సంఖ్య గణనీయంగా పెరిగిన దృష్ట్యా గానీ లేదా ఇటీవల కాలంలో అక్కడ ఐఎస్ఐఎస్ వంటి మతోన్మాద ఉగ్రవాద సంస్థలు జడలు విప్పిన నేపథ్యంలో ఏర్పడిన భద్రతా అవసరాల దృష్ట్యా అయితే నేమి మన దేశానికి ఆ దేశాలతో సంబంధాలను మెరుగు పరచుకోవలసిన అవసరం ముందు కంటే ఇప్పుడు మరింత పెరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015 ఆగష్టులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించిన సందర్భంలో అదే విధంగా ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సౌది అరేబియా పర్యటనలో ఈ ఆశలపై ఆయా దేశాలతో చర్చించారు. అదే విధంగా ప్రధాన మంత్రి యు.ఏ.ఇ. పర్యటన ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపును ఇవ్వడమే కాకుండా, 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య' స్థాయికి తీసుకుపోయింది. సౌది అరేబియా పర్యటన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సుస్థిరం చేసింది. ముఖ్యంగా, రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా గల్ఫ్‌లో, హిందూ సముద్రంలో సముద్ర భద్రత, సైబర్ సెక్యూరిటీలకు మరింత ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అదే విధంగా ఉగ్రవాదానికి సంబంధించిన సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకునే అంగీకారం కుదిరింది. గత సంవత్సరం (2015) అక్టోబర్ నెలలో ఇండియా – ఆఫ్రికా ఫోరం కొత్త డిల్లీలో సమావేశమైంది. ఈ సమవేశంలో 42 దేశాల దేశాధి నేతలు, ప్రభుత్వ అధినేతలతో పాటుగా ఇతర ఆఫ్రికా దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. తొలిసారిగా జరిగిన ఈ సమావేశం గతాన్ని పునశ్చరణ చేసుకునేందుకు, తరతరాల సంబంధాలను పునరుత్తేజింప చేసుకునేందుకు, ఒక క్రియాశీల – ప్రగతిశీల కార్యక్రమ ప్రణాళికను రూపొందించు కునేందుకు వేదికగా నిలిచింది. ఈ ప్రణాళిక రానున్న సంవత్సరాలు , దశాబ్దాలలో భారత్ – ఆఫ్రికా దేశాల మధ్య దూరాన్ని తగ్గిస్తుందని ఆశిస్తున్నారు. '2015 ఢిల్లీ ప్రకటన' భారత్ – ఆఫ్రికా భాగస్వామ్యంలో సహకార అభివృద్ధి కీలక అంశంగా ఉంది. ఈ సందర్భంగా మన దేశం అభివృద్ధి ప్రాజెక్టుల కోసం 10 బిలియన్ డాలర్ల రుణ సదుపాయాన్ని, 600 బిలియన్ డాలర్ల గ్రాంట్‌ను దానితో పాటుగా రానున్న ఐదు సంవత్సరాలలో 5 లక్షల ఉపకార వేతనాలను ప్రకటించింది. మన దేశం చూపిన ఈ చొరవ ఆఫ్రికా దేశాలలో మన పదముద్రలను మరింత ప్రస్ఫుటం చేసింది. అదే విధంగా మన దేశం పట్ల సదభిప్రాయాన్ని బలపరుస్తుంది. అదే సమయంలో ఆఫ్రికాలో పెరుగుతున్న చైనా ప్రభావాన్ని అదుపు చేయగలుగుతుంది.

**బహుళ పక్ష వేదిక:**

ఐక్యరాజ్యసమితి, జి–20, ఆసియాన్, ఈస్, నామ్, బ్రిక్స్, ఎస్సీఓ వంటి ప్రధాన బహుళ పక్ష వేదికలతో మన దేశం పోషిస్తున్న క్రియాశీలక భూమిక, మన దేశ ప్రతిష్టను అంతర్జాతీయంగా ఇనుమడింప చేసింది. సరిహద్దులు లేని ఉగ్రవాదం, ప్రపంచ పరిపాలన వ్యవస్థల సంస్కరణలు, పర్యావరణ మార్పులు, పైరసీ, సైబర్ సెక్యూరిటీ, ప్రపంచ వాణిజ్య చర్చలు విషయంగా మన దేశం అవిశ్రాంతంగా సాగిస్తున్న ప్రచారం అంతర్జాతీయ దృక్పధాన్ని గణనీయంగా ప్రభావితం చేసింది. అంతర్జాతీయ ఎజెండా రూపకల్పనకు తలుపులు తీసింది. షాంఘై సహకార సంస్థ (ఎస్ సి ఓ )లో మన దేశం పరిశీలక సభ్యత్వ స్థాయి నుంచి పూర్తి స్థాయి సభ్యత్వ స్థాయికి ఎదిగింది. ఎపెక్‌లో మన

*తరువాయి 39వ పేజీలో...*

ఈ సంచికతో నూతనంగా ప్రారంభిస్తున్న పాఠకుల స్పందన కార్యక్రమానికి స్వాగతం.

## ఉత్తరాభిప్రాయం

యోజన అభివృద్ధి మాస పత్రికను ప్రతి నెలా చదువుతున్నాను.
ప్రతినెల ఒక అంశం పై అర్థవంతమైన వివరణలతో యోజన
వెలువడుతుంది. వ్యాసకర్తలు తమ అభిప్రాయాలు, సూచనలను
బాగా వివరిస్తున్నారు.
'మే' నెలలో వికలాంగుల (దివ్యాంగుల) గురించి వారికి సమాజంలో కల్పించాల్సిన
సౌకర్యాల గురించి చక్కగా వివరించారు.
'జూన్'లో వెలువడే అంశం "ప్రగతి పథంలో భారతదేశం" పై కూడా
చక్కగా వివరిస్తారని ఆశిస్తాం.

G. మల్లిఖార్జున్, రామాలపేట్, రాయికల్, కరీంనగర్.

1. మల్లిఖార్జున్ గారు, మీ అభిమానానికి మా కృతజ్ఞతలు. మన పత్రిక నాణ్యతను మరింత పెంచడానికి మీరు ఎప్పుడూ తగిన సూచనలు, సలహాలూ ఇస్తునే ఉంటారని ఆశిస్తున్నాము.

మే నెల యోజన దివ్యాంగులు అన్న అంశంపై వెలువడింది
ఈ సంచిక దివ్యాంగులకు ఎంతో ప్రయోజనకరం. వైకల్యంతో బాధపడే
వారికి భారత ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించిందో చాలా
చక్కగా వివరించారు. ఈ నెల పొగత్రాగరాదు వ్యాసం కూడా చాలా
బాగుంది. యోజన అందరికీ నచ్చేలా తీర్చిదిద్దుతున్న అభిమాన
యోజన సంపాదకవర్గానికి అభినందనలు. మన దేశ ప్రగతి [illegible]
కవితలు ప్రచురించండి.

—— ఎల్. ప్రఫుల్లచంద్ర, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ధర్మవరం అనంతపురం (జిల్లా)

2. ప్రఫుల్లచంద్ర గారు, మీ సూచనలకు, అభిమానానికీ మా కృతజ్ఞతలు. వీలువెంట మీ సలహాలను అమలుచేయడానికి ప్రయత్నిస్తాము.

యోజన అభివృద్ధి మాస పత్రికను గత సంవత్సరం నుండి చదువుతున్నాను.
వ్యాసకర్తలు తమ ఉత్తర అభిప్రాయాలను, సూచనలను
అర్థవంతంగా వివరిస్తున్నారు. ఈ వ్యాసాలు కాంపిటేటివ్ ఎగ్జామ్
కు ప్రిపేర్ అవుతున్న నాలాంటి ఎందరికో ఉపయోగపడుతున్నాయి.
మరియు "విజ్ఞాన విపంచి" పేరుతో ప్రొఫెసర్ పోతయ్య శర్మ అందిస్తున్న
ప్రశ్నలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.
ఇక 'మే' నెల 'యోజన'లో వికలాంగుల (దివ్యాంగుల) యొక్క పరిస్థితులను,
సమాజంలో వారికి కల్పించవలసిన సౌకర్యాల గురించి చక్కగా వివరించారు.

M. మహేష్, హాజీపూర్, జగిత్యాల్, కరీంనగర్.

3. మహేష్ గారు, పోతయ్యశర్మగారి విజ్ఞానవిపంచి ఎందరికో ప్రయోజనం కల్పించడం ముదావహం.

– సీనియర్ ఎడిటర్.

### పాఠకులకు మనవి

యోజన తెలుగు మాసపత్రిక ఈ సంచిక నుండి పాఠకుల స్పందనలను ప్రచురిస్తోంది. యోజన పాఠకులు, చందా దారులు, శ్రేయోభిలాషులు పత్రికలో వచ్చే వ్యాసాలపై తమ సందేహాలు, సూచనలు, స్పందనను లేఖల రూపంలో తెలియచేయగలరు. యోజన నాణ్యతను మరింత మెరుగు పరచడానికి మీ స్పందన ఎంతో ఉపకరిస్తుంది. మీ అభిప్రాయాలు, ఆలోచనలు, సూచనలను వెంటనే క్రింది అడ్రసుకు పోస్టు కార్డుపై రాసిపంపగలరు.

**The Senior Editor,**
**Yojana (Telugu),**
**205; Second Floor,**
**CGO Towers;**
**Kavadiguda,**
**Hyderabad - 500 080.**

*– సీనియర్ ఎడిటర్, యోజన.*

అహగాహవ సహితం

# సానుకూల జీవనానికి యోగ సూత్రాలు



**యోగ సాధనతో మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి శరీరానికి లభిస్తుంది. తనువు మనస్సు మధ్య సమైక్యత సమతూకం పాటించడం సాధ్యపడుతుంది. మానసిక ఒత్తిడి వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఈ ఒత్తిడిని తగ్గించడానికి మనకు అందుబాటులో వున్న సాధనాల్లో యోగ అత్యుత్తమమైంది. ఒత్తిడి వల్ల మైగ్రేయిన్, అల్సర్లు, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్, వంటి వ్యాధులే కాకుండా ప్రాణాంతకమైన గుండె పోటు, మధుమేహం, ఆస్టియోపోరోసిస్ తదితర జబ్బులకు దారి తీస్తుంది.**

యోగ అనే పదానికి సంస్కృత మూలం "యుజ్". దీనికి ఐక్యత, సంలీనం, కలయిక, నిర్దేశించడం, ఏకాగ్రత వంటి అనేక అర్థాలున్నాయి . మూడు వేల సంవత్సరాలుగా ఓ సాంప్రదాయంగా కొనసాగుతున్న యోగా ను ఇప్పుడు పాశ్చాత్య దేశాలు ఆరోగ్యానికి ఒక సంపూర్ణ విధానంగా భావిస్తున్నాయి. యోగాను వైద్యానికి ప్రత్యామ్నాయంగా, పరిపూరకమైనదిగా జాతీయ ఆరోగ్య సంస్థ అభివర్ణించింది. క్రమం తప్పకుండా చేసే యోగ సాధన మనకు శక్తినిస్తుంది. సహనం పెరుగుతుంది. స్వీయ నియంత్రణ వృద్ధి చెందుతుంది. జీవితం పట్ల మన దృష్టికోణం లో మార్పు వస్తుంది. స్వీయ అవగాహనతో పాటు శాంతి, సుఖ సంతోషాలతో నిండిన పరిపూర్ణ జీవితం గడపడానికి అవసరమైన శక్తినిస్తుంది. యోగ సాధనతో మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి శరీరానికి లభిస్తుంది. తనువు మనస్సు మధ్య సమైక్యత సమతూకం పాటించడం సాధ్యపడుతుంది.

పాశ్చాత్య దేశాల్లో యోగ సాధనకు సర్వ సాధారణంగా పలు శారీరక భంగిమలు, హఠయోగకు సంబంధించిన శ్వాస, ధ్యాన పద్ధతులుఅవలంభిస్తున్నారు. హఠయోగ ద్వారా పలు ఆసనాలు వేయడం వల్ల దేహ సామర్థ్యం పెరుగుతుంది. హఠయోగ ద్వారా ఎక్కువ సేపు గాలిని పీల్చడానికి, ఎటువంటి ఇబ్బంది లేకుండా శ్వాసను నిలుపుదల చేయడానికి, వీలైనంత ఎక్కువగా గాలిని బయటకు పంపించడానికి వీలవుతుంది. ఇందులో శారీరక భంగిమలు, కదలికలతో దేహంలో శక్తి ప్రవహించే మార్గాల్లో వుండే అవరోధాలు తొలగిపోయి, శారీరక శక్తిలో సమతుల్యత ఏర్పడుతుంది.

మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఇంకా అనేక విధాలుగా యోగ ఉపయోగపడుతుంది. మానసిక ఒత్తిడి వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఈ ఒత్తిడిని తగ్గించడానికి మనకు అందుబాటులో వున్న సాధనాల్లో యోగ అత్యుత్తమమైంది. ఒత్తిడి వల్ల మైగ్రేయిన్ (తలనొప్పి), అల్సర్లు, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్ (కడుపునొప్పి, విరేచనాలు) వంటి వ్యాధులే కాకుండా ప్రాణాంతకమైన గుండె పోటు, మధుమేహం, ఆస్టియోపోరోసిస్ (ఎముకలు గుల్లబారడం) తదితర జబ్బులకు దారి తీస్తుంది.

యోగతత్త్వం, పద్ధతులపై పతంజలి రచించిన తొలి గ్రంథం "యోగ సూత్రాలు"లో వివరించారు. యోగపై ప్రామాణిక గ్రంథంగా ఇది గుర్తింపు పొందింది. ప్రస్తుతం, ఆసనాల వల్లనే ప్రజలు యోగను గుర్తిస్తున్నారు. వ్యాధులను నయం చేయడానికి వున్న అనేక

**డా॥ హెచ్.ఆర్. నాగేంద్ర,** ఛాన్సలర్ ఎస్-వ్యాస డీమ్డ్ యూనివర్సిటీ
E-mail: hrnagendra1943@gmail.com

పద్ధతుల్లో ఆసనాలు కేవలం ఒక విధానం మాత్రమే. అవగాహన, జ్ఞానసాధన కోసం పతంజలి "అష్టాంగ" మార్గాన్ని (యమ, నియమ, ఆసన, ప్రాణయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి) వివరించారు. ఈ ఎనిమిది అంగాలు అర్ధవంతమైన, ప్రయోజనకరమైన జీవనం గడపడానికి అవసరమైన నైతిక సూత్రాలు, నైతిక ప్రవర్తనకు స్వీయ క్రమశిక్షణకు మార్గ సూచికగా ఉపయోగ పడతాయి. పంతంజలి అష్టాంగ మార్గాన్ని ఆధారంగా చేసుకొని వివిధ యోగా పద్ధతులు అభివృద్ధి చెందాయి. వ్యాధులను నయం చేయడానికి ఒక్కో విధానానికి ఒక్కో పద్ధతి వుంది.

ప్రస్తుతం యోగకు చాలా ప్రాచుర్యం లభించింది. అసంఖ్యాకంగా సంస్థలు యోగను బోధిస్తున్నాయి. అయితే, యోగను ప్రామాణీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో యోగ చికిత్స నందించడం పై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. యోగ చికిత్స నమూనా ఏది? సైద్ధాంతిక, ప్రయోగాత్మక పద్ధతుల్లో సరైన పరిశోధనల ద్వారా యోగా చికిత్సపై శాస్త్రీయ దృక్పథాన్ని నిరూపించవలసిన అవసరముంది.

నిజానికి, మనదేహం భౌతికంగా కనిపిస్తున్న రూపంలోనే కాదు, శరీరంలో మనకు కనిపించని విధంగా మరో నాలుగు సూక్ష్మ పొరలతో కూడిన నిర్మాణాలున్నాయి.

మొత్తంగా చూస్తే,మనలో ప్రతి ఒక్కరికీ అయిదు ''దేహాలు'' లేదా ''కోశాలు '' వున్నాయి.

1) అన్నమయ కోశం – పోషణను అందించే శరీరం – భౌతిక దేహం

2) ప్రాణమయ కోశం – శక్తిని అందించే శరీరం – బయో ప్లాస్మిక్ పొర

3) మనోమయ కోశం – మానసిక శరీరం – ఆధ్యాత్మిక పొర

4) విజ్ఞానమయ కోశం – మేధోపరమైన శరీరం – జ్ఞాన పొర

5) ఆనందమయ కోశం – ఆనందమయ శరీరం – పరమానంద పొర

మన కర్మలు (చర్యలు) సంస్కారాలు (జ్ఞాపకాలు, అనుభవాలు ) ఈ కోశాల్లో నిక్షిప్తమై వుంటాయి. అవి వ్యక్తి ఆత్మకు, అతని సార్వత్రిక వ్యక్తిత్వానికి మధ్య విభజనలు కల్పిస్తాయి. విముక్తి/మోక్షం అంటే , ఈ కోశాల పరిధి నుంచి ఆత్మను విడిపించడంఅని అర్ధం. మనం దేనితోనైనా సంలీనమవ్వాలంటే ఏకమవ్వాలనుకునే దాని గుణాలను మనం అభివృద్ధి చేసుకోవాలి. ఈ కోశాలనుంచి మనం విడుదల పొందనంతవరకు, మన వ్యక్తిగత అహాన్ని పట్టుకొని వేలాడుతూ, "నేను" అనే గుర్తింపును కొనసాగిస్తూ వున్నంత వరకు అనంతంతో మనం మమేకం కాలేము. మరో వంక, ఈ భూమిపై మన మనుగడకు ఈ అయిదు కోశాలూ అనివార్యం. ఇవి లేకుండా మనం బతకలేం. ఈ కోశాలను అధిగమించి విడిపోవడానికి, ప్రాథమికంగా విస్తృతమైన మానసిక స్వచ్ఛత ప్రక్రియ అభివృద్ధి అవసరం. మనలో ఇంకా ఏ మాత్రం మాలిన్యత లేనప్పుడు, ఎటువంటి "ఛాయలు" లేక పోతే, అప్పుడు మన జీవితం చివరిలో ఆధ్యాత్మిక రూపం కూడా విలీనమవుతుంది. మన ఆత్మ అనంతంతో ఏకమవుతుంది. దివ్యమైన వెలుగు పరమానందంతో (జ్ఞానము, శక్తి, స్వాతంత్ర్యంతో) ఏకమై పోతుంది.

అన్నమయ కోశం అంటే మన భౌతిక దేహం. ఇది మనం తినే తిండి, చుట్టూ వున్న పర్యావరణం, నివశిస్తున్న సమాజాల వల్ల ప్రభావితమవుతుంది. అందుకే, మన భౌతిక, మానసికాభివృద్ధికి మనుష్యుల మధ్య పరస్పరం సానుకూల, ప్రయోజనకరమైన ప్రతిస్పందనలు, వీటితో పాటు ఆరోగ్యకరమైన సాత్విక ఆహారం ప్రాముఖ్యతను యోగా బోధిస్తుంది. మాంసాహారం, అల్కాహాల్, డ్రగ్స్ సేవించడం వల్ల మన జీవన శక్తి(తేజం) బలహీన పడుతుంది. ప్రతికూల స్పందనలతో నిండిపోతుంది. పరిపూర్ణమైన, శాకాహార భోజనం మన దేహానికి సరైన పోషణనిస్తుంది.

ప్రాణమయ కోశం మన భౌతిక శరీరం లోపల వెలుపల కూడా ప్రాణం అనే బ్రహ్మాండమైన శక్తి తో చుట్టి వుండే కవచం. ఇది మన నుంచి వెలువడే ప్రకాశం, మెరుపును కలిగి వుంటుంది. ప్రాణం అనేది అన్న పానీయాల్లాగా జీవితానికి అవసరమైన సూక్ష్మ పోషణ. మనం ఊపిరి పీల్చిన ప్రతి సారీ ఆక్సిజన్‌తో పాటు ప్రాణాన్ని కూడా పీలుస్తుంటాం. అన్ని రకాల ఆహారాలు మనకు పోషకాలతో పాటు ప్రాణాన్ని కూడా అందిస్తుంటాయి. ప్రాణం యొక్క నాణ్యత మన బాహ్య ప్రభావాలతో పాటు మన సొంత భావోద్వేగాలు, ఆలోచనలకు లోనవుతుంటుంది. మిగిలిన కోశాలను ఇది ప్రభావితం చేస్తుంటుంది.

మనోమయ కోశం. ఇది మన మనస్సు చుట్టూ వున్న శక్తి కవచం. ప్రాణమయ కోశం కన్నా ఇది ఎక్కువ శక్తివంతమైంది. సమయంతో నిమిత్తం లేకుండా మన మనస్సు, ఆలోచనలు ఎక్కడికైనా చేరుకోగలుగుతాయి. అందువల్ల మన ఆలోచనలను నియంత్రించడం చాలా కష్టం. మనస్సుకున్న ఈ పుంజుకున్న అనియంత్రిత వేగం వల్ల క్షణాల్లో భావోద్వేగాలు ఏర్పడి మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ప్రాణమయ కోశంలో అసమతుల్యత వల్ల ఒత్తిడులు, వ్యాధులు సంభవిస్తాయి. కేవలం మనస్సును నియంత్రించడం వల్ల మాత్రమే ఇటువంటి మానసిక ఒత్తిళ్ళు, జబ్బులను మనం అదుపులో పెట్టగలం. మనస్సును మన అజమాయిషీలో పెట్టుకోవాలంటే – మంచి ఆలోచనలను పెంపొందించుకోవడమే ఉత్తమ మార్గం. దీనితో మనసును ప్రశాంతంగా వుంచుకోవడం నేర్చుకోగలుగుతాం. నిశ్శబ్దంగా, శాంతంగా వుండగలం. "యమ", "నియమ" సూత్రాలను అనుసరించి పరస్పరం అర్ధం చేసుకోవడం, ఇతరులకు ఇవ్వడం, ప్రార్థించడం, మంత్రాలను సాధన చేయడం

వల్ల మన కర్మలను శుద్ధి చేసుకోవచ్చు.

విజ్ఞానమయకోశం. ఇది మేధో పరమైన దేహం. ఇది సానుకూలంగా వుండ వచ్చు లేదా ప్రతికూలంగా కూడా వుండ వచ్చు. మన చుట్టూ మనం ఏర్పాటు చేసుకునే సమాజంతో పాటు చుట్టుపక్కల వున్న పర్యావరణం నుంచి మన ఇంద్రియాలు గ్రహించే ముద్రలపై ఇది ఆధారపడి వుంటుంది. మన అనుభవాలు, పెంపకం, జీవితకాలంలో నేర్చుకున్న విద్య, వీటి సారాంశం విజ్ఞానమయకోశం రూపంలో వుంటుంది. ఇది తరచుగా సత్యాన్ని వినిపించుకోకుండా మనకోరికలకు తగినట్లుగా అహంకారంతో వ్యవహరిస్తుంది. మన మేధోసంపత్తి ఎంతో ప్రయోజనకరమైన సాధనమే, కానీ, కొన్ని సార్లు అదే పెద్ద అవరోధంగా మారుతుంది. అందువల్ల మనం ఎప్పుడూ బుద్ధి, వివేకం (విచక్షణ) ఈ రెండిటినీ ఉపయోగిస్తూండాలి.

ఆనందమయ కోశం. ఇది పరమానందమయ శరీరం. ఇది సాధారణ పొర. దీనినుంచే మిగిలిన నాలుగు పొరలు ప్రారంభమై సంస్కారాలు,(వాసనలు) లపై వ్యాపిస్తాయి. వీటిని శుద్ధి చేయడం కష్టతరం కాదు. ఎందుకంటే, మన కోరికలను నెరవేర్చుకోవాలనే తపన, మనలో ప్రేరణ కలిగించే శక్తివంతమైన నిర్ణయాత్మక శక్తి!

పరమానందానికి అనేక స్థాయిలున్నాయి. దీన్ని అపరిమితమైన సర్వోన్నత ఆనందం చుట్టేసి వుంది. మొదటిది మన కోరికలు నెరవేరడం తదితర అంశాలు వంటి కొన్ని షరతులపై ఆధారపడి వుంటుంది. కాగా, తరువాత దానికి ఎటువంటి షరతులుండవు. బాహ్య పరిస్థితుల నుంచి ఇది స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. మనలో మనం లీనమైనప్పుడే చిరకాలంగా వుండే సంతృప్తి, మహానందం (అపరిమిత ఆనందం) ప్రసాదించబడతాయి, మిగిలిన సంతోషాలన్నీ పరిమితమైనవి, తాత్కాలికమైనవి. జ్ఞానం ద్వారా మాత్రమే మనం ఆనందమయ కోశం నుంచి స్వేచ్ఛ పొందగలం. భక్తి మనకు ఈ దిశగా లక్ష్యానికి చేరువ చేస్తుంది. అయితే, సత్యానికి సంబంధించిన జ్ఞానం పొందడం ద్వారా మాత్రమే చిట్టచివరి దశలో సఫలం కాగలం. అప్పుడు మాత్రమే మనం తుదకు మోక్షాన్ని (విముక్తిని) పొందగలం.

వ్యక్తుల భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక పరిస్థితులను సమైక్యం చేసి ఒత్తిడి సంబంధిత అనారోగ్యాన్ని నయం చేయడానికి, మనస్సు–దేహానికి చికిత్సనందించే మందుగా యోగకు గుర్తింపు లభించింది. హృద్రోగాలు, క్యాన్సర్, గుండెపోటు, తదితర దీర్ఘకాలిక జబ్బులకు మానసిక ఒత్తిడే కారణమని తెలిపేందుకు ఆధారాలున్నాయి. అందుచేత, ఒత్తిడి నిర్వహణకు, ప్రతికూల భావోద్వేగాలను తగ్గించడానికి ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరముంది. దీంతో వ్యాధిని నియంత్రించడానికి సానుకూలత ఏర్పడుతుంది. యోగను సంపూర్ణ ఒత్తిడి నిర్వహణ ప్రక్రియగా చూస్తే, యోగ ద్వారా శరీరంలో క్రమబద్ధంగా జరిగే చర్యలతో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. గత కొద్ది సంవత్సరాలుగా యోగపై శాస్త్రీయ అధ్యయనాలు ఎక్కువయ్యాయి. యోగవల్ల జరిగే చికిత్స ప్రయోజనాలను అధ్యయనం చేయడానికి పలువైద్య ప్రయోగాలను రూపొందించారు. జబ్బులను నయం చేయడానికి యోగ ప్రక్రియలు ఎంతో తోడ్పడతాయన్నది వాస్తవం. కానీ, ఇది ఎలా పనిచేస్తుంది? యోగ వల్ల చికిత్స జరుగుతుందనడానికి శాస్త్రీయ ఆధారాలేమిటి? యోగ చికిత్స నమూనా ఏది? ఈ ప్రశ్నలకు శాస్త్రీయంగా, హేతుబద్ధంగా సరైన సమాధానాలు తెలిపేంత వరకు యోగ చికిత్స అసంపూర్తిగానే మిగిలి పోతుంది.

యోగ చికిత్సలో అన్నిటికంటే ముఖ్యమైన వాస్తవం ఏమిటంటే మానవ శరీరం లోని శాస్త్రీయ విధానాన్ని యోగ పద్ధతి అంగీకరిస్తుంది. మానవ శరీరం పని చేయడానికి అవసరమైన జీవశక్తి (ప్రాణం) గురించి తెలుసుకోవడం ముఖ్యం. “అధి” లేదా జీవశక్తి (ప్రాణం)లో లోపాల వల్ల జబ్బులొస్తాయని యోగ విజ్ఞానం వల్ల తెలుస్తోంది. యోగ విజ్ఞాన శాస్త్రంలో వ్యాధులను రెండు ప్రధాన వర్గాలుగా విభజించారు. 1) పరిస్థితుల వల్ల వచ్చే జబ్బులు 2) ప్రారబ్ధ కర్మల వల్ల (అధిజ వ్యాధి) వల్ల వచ్చే జబ్బులు . ఈ రెండు విధానాల్లో కూడా జీవశక్తి (ప్రాణం) ప్రవాహానికి అవరోధం, అడ్డంకులు ఏర్పడినప్పుడు జబ్బులొస్తాయి. కానీ, వాటి చికిత్స విధానంలో తేడాలున్నాయి. యోగా చికిత్స విధానంలో జీవశక్తిని (ప్రాణాన్ని) పరిశుభ్రం చేసి, మెరుగు పరచడానికి జీవన శైలి, జీవన విధానం కీలక పాత్ర పోషిస్తాయి.

మన జీవితంలో అన్నీ విషయాలూ జీవశక్తి (ప్రాణం)తో వున్న సామరస్యం వల్ల ప్రభావితమవుతాయని యోగ విజ్ఞానం రుజువు చేస్తోంది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రాణాన్ని జీవశక్తి గా, వ్యాధులను నిరోధించ దానికి వున్న సామర్థ్యంగా, జీవ విద్యుత్తుగా, విద్యుదయస్కాంత శక్తిగా తెలియజేస్తోంది. నిజానికివన్నీ ప్రాణానికున్న వివిధ రూపాలు. ప్రాణ స్వభావం గురించి కొద్దిగా అర్థం చేసుకున్న వారెవరైనా, తమకున్న జ్ఞానం మేరకు ‘రికీ’ (Reiki) తదితర ప్రానిక్ చికిత్సా పద్ధతులను అభివృద్ధి చేశారు. కానీ, యోగాలో ప్రాణం గురించి సమగ్రంగా తెలిసి వుండడం అవసరం. ప్రాణ ప్రవాహం నిలిచిపోతే, సూక్ష్మ దేహం నుంచి భౌతిక శరీరం విడిపోతుందని యోగ శాస్త్రం నమ్ముతుంది. భౌతిక పరిభాషలో దీన్నే మరణం అంటారు.

ఆరోగ్యంగా, చిరకాలం జీవించడానికి ప్రాణ (జీవశక్తి) పరిరక్షణతో పాటు మెరుగుదల ఎంతో అవసరం. ఆరోగ్య

ప్రరిరక్షణకే యోగ ప్రాథమికంగా ప్రాధాన్యతనిస్తుంది. జీవనశైలి పట్ల నిర్లక్ష్యమే వ్యాధులకు మూలకారణమని యోగ నిపుణులు విశ్వసిస్తారు. యోగ జీవన విధానాన్ని క్రమం తప్పకుండా పాటిస్తే, పరిస్థితుల ప్రభావం వల్ల వచ్చే అనేక జబ్బుల బారిన పడకుండా పూర్తి రక్షణ పొందవచ్చు. కర్మ వల్ల కలిగే వ్యాధుల సమస్యల నుంచి కూడా యోగ ప్రక్రియల ద్వారా పరిష్కారం పొందవచ్చు. ఇలా, అందరికీ వ్యాధి రహిత ఆరోగ్యకరమైన జీవితాన్ని యోగ ప్రసాదిస్తుంది.

మనిషి తనలో నిక్షిప్తమైన ప్రాణాన్ని ఉపయోగించుకోకుండా, అనంతరం దానివల్ల కలిగిన బాధలతో సతమతమవుతుంటాడు. 'సన్యమ్' (సంయమనం) ద్వారా ప్రాణాన్ని పరిరక్షించవచ్చు. దీన్ని సరైన పద్ధతిలో ఉపయోగించి జీవితాన్ని ఆనందమయంగా చేసుకోవచ్చు. దురదృష్టవశాత్తూ, మనిషి తన అవివేకంతో, అత్యాశలకు బానిసగా మారి పశువులా జీవించడానికి అలవాటు పడుతున్నాడు. యోగ జీవన శైలిలో బాహ్య, అంతర్గత జీవితాల మధ్య సమతుల్యత వుంటుంది. జీవితం సమతుల్యంగా వుంటే, మన జీవితంలో సామర్థ్యం, నైపుణ్యం, విజయాలు వాటంత అవే అభివృద్ధి చెందుతాయి. సరైన జీవన శైలివల్లనే నిరంతర జీవశక్తి (ప్రాణ) ప్రవాహం ఏర్పడుతుంది. వ్యాధిరహిత జీవనానికి యోగ జీవనశైలి ఒక్కటే బంగారు సూత్రమని చెప్పడం అతిశయోక్తి కాదు. మన దేహంలో ప్రాణ ప్రవాహానికి ఏర్పడే అవరోధాలు, అడ్డంకులు అన్నీ ఆసనాలు, ప్రణయామ, బంధాలు, ముద్రలు, యోగ క్రియల ద్వారా తొలగిపోయి జీవితం ఆరోగ్యకరంగా మారుతుంది.

యోగ ద్వారా చికిత్సపొందడానికి యోగ జీవన విధానం చాలా అవసరం. మానసిక రుగ్మతల వల్లనే ప్రస్తుతం మానవ జాతిని వేధిస్తున్న అనేక జబ్బులు వస్తున్నాయని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలందరూ అంగీకరిస్తారు. జీవితం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్లనే మానసిక సమస్యలు ఏర్పడుతున్నాయి. జీవితం పట్ల మన నమ్మకాలు, విశ్వాసాలు, లక్ష్యాలు సరైనవి అయి వుండి, జీవితం గురించి మన దృక్పథం కచ్చితమైనదైతే, అప్పుడు మన జీవశక్తిని సరిగా వినియోగించుకోగలం. ఫలితంగా, మానసిక ఒత్తిళ్ళు, ఆందోళనల నుంచి విముక్తి పొందగలం. యోగ విజ్ఞానంతో నాణ్యమైన, పరిపూర్ణ జీవితం గడపవచ్చు. శస్త్ర చికిత్సలు, రేడియేషన్, కిమోథెరపీ వల్ల వచ్చే దుష్ప్రభావాలు కూడా తగ్గుతాయి.

యోగ విద్యకు భారత్‌లోనూ, అమెరికా వంటి దేశాల్లో ప్రాముఖ్యత లభిస్తోంది. వెన్ను నొప్పి, నరాల జబ్బులు, నిద్రలేమి, క్యాన్సర్, గుండె జబ్బులు, క్షయ తదితర వ్యాధులను నయం చేయడానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని గత కొద్ది సంవత్సరాల్లో జరిగిన పరిశోధనల్లో తేలింది. శరీర సామర్థ్యం పెరుగుదల, వ్యాధి నిరోధక శక్తి మెరుగు పడడం, సమతుల్యత, రక్తంలో చక్కెర తగ్గుదల, కొలెస్ట్రాల్ తగ్గడం, మానసిక ఆరోగ్యం మెరుగు పడడం యోగ వల్ల కలిగే ప్రయోజనాల్లో కొన్ని మాత్రమే. మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగ గణనీయమైన ప్రభావం చూపుతుంది. ■

*34వ పేజీ తరువాయి...*

## దేశీయంగా సమ్మిళిత అభివృద్ధి - అంతర్జాతీయ వేదికపై కీలక భూమిక

దేశానికీ సభ్యత్వం ఇవ్వాలన్న ప్రతిపాదనకు పెరుగుతన్న మద్దతు, ఆసియా - పసిఫిక్ దేశాలలో మన దేశం కీలక భూమికను పోషిస్తోంది అనేందుకు ఒక స్పష్టమైన నిదర్శనం. అదే విధంగా గ్లోబల్ న్యూక్లియర్ ఎక్స్పోర్ట్ రిజిం అంటే మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజిం (ఎం టీ సి ఆర్), న్యూక్లియర్ సప్లై గ్రూప్ ( ఎన్ ఎస్ జి ) వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో మన దేశానికీ సభ్యత్వం విషయంగా మద్దతు పెరుగుతోంది. ఇవన్నీ ఒకెత్తు అయితే, ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో మన దేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న అభ్యర్థనకు పెరుగుతన్న మద్దతు ఒక్కటీ ఒకెత్తు. అనేక దేశాలు తమంతట తాముగా ముందుకొచ్చి మన దేశానికి మద్దతు పలుకుతున్నాయి. అదే విధంగా కాప్ 21 తుది నివేదికలో మన ప్రతిపాదనలకు స్థానం లభించింది. రష్యాలో జరిగిన ఏడవ బ్రిక్స్ సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిపాదించిన, 'దస్ కదం' లేదా పది సూత్రాల కార్యక్రమంనికి బ్రిక్స్ అంతిమ నివేదికలో స్థానం లభించింది.

**అనుసంధానం:**

ప్రాంతీయ, ఉప ప్రాంతీయ సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా పొరుగు దేశాలతో అనుసంధానం ఏర్పరుచుకునేందుకు తీసుకున్న దౌత్య పరమైన చర్యలలో బంగ్లాదేశ్‌తో కుదుర్చుకున్న చిట్టగాంగ్, మొంగోలా పోర్టుల వినియోగ ఒప్పందం, కొల్కటా- ఢాకా - అగర్తలా బస్ సర్వీస్ ఒప్పందం, ముఖ్యమైనవి. భారత్, భూటాన్, బంగ్లాదేశ్ నేపాల్ దేశాల మధ్య మోటార్ వాహనాల ఒప్పందం విషయంలో మన దేశం ఈ దేశాల మధ్య భౌతిక, డిజిటల్ అనుసంధాన ప్రాజెక్టులకు బిలియన్ డాలర్ల లైన్ అఫ్ క్రెడిట్‌ను వాగ్దానం చేసింది. ఇలా దౌత్య నీతిని దేశీయ అభివృద్ధి ప్రణాళికలతో ముడివేసి ముందుకు సాగేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. చివరగా, గడచినా 22 మసాల కాలంలో మన దేశం అంతర్జాతీయ వ్యవహారాలలో పోషిస్తున్న క్రియాశీల పాత్ర, దౌత్య విధానాలు దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకుపోయేందుకు ఎంతగానో దోహదం చేశాయి. అదే సమయంలో ప్రపంచ వేదిక పై భారతీయ పద ముద్రలు విస్తారంగా పరచుకున్నాయి. విదేశాల్లో మన దేశ ప్రతిష్టను దేదీప్యమానం చేశాయి. ■

# న్యూస్ ఛానళ్లలో వాణిజ్య ప్రకటనల ప్రభావం




**వాణిజ్య ప్రకటనలు, వార్తా కథనాలు పరస్పర ఆధారాలు. వార్తా ఛానల్స్ మనుగడకు ఆధారభూతం అయినందున వాణిజ్య ప్రకటనల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోంది. అయితే వార్తలు, వాణిజ్య ప్రకటనల మధ్య సమతూకం పాటించడం అవసరం. వాణిజ్య ప్రకటనలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, వార్తలను పరిమితంగా ప్రసారం చేస్తే ఆ ఛానల్ ప్రజల ఆదరణకు దూరమవుతుంది.**

"వార్తలను కొన్ని ప్రైవేటు న్యూస్ ఛానల్స్ ఏదో వినోదంలాగా పరిగణిస్తున్నాయి. న్యూస్ ఛానల్స్ ప్రైమ్‌టైమ్‌లో ప్రసారం చేస్తున్న డబ్ల్యుడబ్ల్యుఎఫ్ (WWF) కుస్తీక్రీడలను తలపిస్తున్నాయి. అందుకే... ఈ విషయంలో ఆయా మీడియా సంస్థల నుండి జవాబుదారీ తనాన్ని ఆశిస్తున్నారు. ప్రేక్షకులు. సమాచారం, చైతన్యం, వినోదం అనే వరుస క్రమం తప్పనిసరి, అదే ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రసార మాధ్యమాల కీలక విధి. అయితే ముందుగా వినోదాన్ని పంచేసి.. ఆ తర్వాత సమాచారాన్ని అందివ్వరాదు. రాత్రి ప్రైమ్‌టైమ్ వంటి కీలక వేళల్లో వార్తలుండడం లేదు. కేవలం హోరు మాత్రమే ఉంటోంది. పౌరులు కేవలం మీడియాకే కాదు... యావత్ ప్రజాస్వామ్యానికీ సంరక్షకులు".

ఎ.సూర్యప్రకాశ్, ప్రసార భారతి చైర్‌పర్సన్

నేటి సాంకేతిక యుగంలో సమాచారం ప్రజల అరచేతుల్లోకి వచ్చేసింది. ప్రపంచంలో ఎక్కడెక్కడో జరిగే సంఘటనలు ప్రజలపై ప్రభావం చూపిస్తుండడంతో ఎప్పటికప్పుడు తాజా సమాచారం తెలుసుకోవాలనే తపన జనంలో పెరిగిపోతోంది. దీంతో ఒక్క రోజు కూడా వార్తా పత్రికలకు, న్యూస్ ఛానళ్లకు దూరంగా ఉండలేని పరిస్థితి వచ్చేసింది. ఇక ప్రపంచం నలుమూలలా జరిగే ప్రజల అవసరాలు తీరుస్తున్నాయి న్యూస్ ఛానల్స్. ప్రజల ఆదరణ పెరగడంతో మన దేశంలో వందలాది న్యూస్ ఛానల్స్ ఆవిర్భవించాయి. ఇంకా అనేక ఛానల్స్ రావడానికి సిద్ధంగా ఉన్నాయి. న్యూస్ ఛానళ్లు ప్రపంచవ్యాప్తంగా రిపోర్టింగ్ నెట్‌వర్క్, టెక్నికల్ నెట్‌వర్క్‌ను ఏర్పరుచుకోవడం ద్వారా... ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో ప్రసారం చేయగలుగుతున్నాయి. ఒక్కో ఛానల్ కార్యాలయంలో అనేక విభాగాలు, ఒక్కో విభాగంలో డజన్ల సంఖ్యలో జర్నలిస్టులు, సాంకేతిక నిపుణులు పని చేస్తూ ఆయా సంఘటనలకు ప్రాణం పోసి ఆకర్షణీయంగా తయారు చేసి ప్రజలకు అందిస్తున్నారు.

భారతదేశంలో 2014లో న్యూస్ ఛానళ్ల టర్నోవర్ రూ. 475 బిలియన్లు అయితే అది 2019 నాటికి 15.5 శాతం వృద్ధితో రూ. 975 బిలియన్లకు చేరుకుంటుందని ఫిక్కి అంచనా! ప్రకటనల రెవెన్యూ కూడా 14 శాతం ఉంటుందని అంచనా వేసింది. ప్రకటనల మార్కెట్ 2014లో 14 శాతం పెరుగుదలతో 155 బిలియన్లు ఉంటే... అది 2019 వరకు 299 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశంలో

**డాక్టర్ బొల్లం తిరుపతి,** సీనియర్ జర్నలిస్టు.
E-mail: bollamthirupathi@gmail.com

405 న్యూస్ ఛానల్స్ ఉంటే... 33 బిలియన్ల ప్రకటనల రెవెన్యూ ఉంటుంది. ఇదంతా కూడా న్యూస్ ఛానల్స్ ప్రేక్షకుల హక్కులను కాలరాస్తూ... ఆర్జిస్తున్న ఆదాయం. ట్రాయ్ విధించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ కోర్టుకు వెళ్ళిన న్యూస్ ఛానల్స్ సుప్రీంలో స్టే తెచ్చుకున్నాయి.

ఒక్కో న్యూస్ ఛానల్ స్థాపనకు 50 కోట్ల నుంచి 200 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇక ఛానల్ నడిపించాలంటే వందలాది మందికి జీతభత్యాలు చెల్లించాలి. వార్తల సేకరణకు, పంపిణీకి, ఉపగ్రహ ఖర్చులకు, సాంకేతిక పరికరాల కొనుగోలు, మెయింటెనెన్స్‌కు నెలవారి ఖర్చులు కూడా కోట్లల్లో ఉంటుంది. మరి ఛానల్స్‌కు కావల్సిన ఈ సొమ్ము ఎక్కడ నుండి వస్తుంది? ఛానల్స్ ఎలా మనగలుగుతున్నాయి? అంటే న్యూస్ ఛానల్స్‌కు ఏకైక ఆదాయ వనరు వాణిజ్య ప్రకటనలు.

వివిధ రకాల పారిశ్రామిక ఉత్పత్తుల నాణ్యత, ప్రత్యేకత, గుణగణాలు, ధరలు, అవి అందుబాటులో ఉండే ప్రాంతాలు ప్రజలకు తెలియాలంటే వార్తా పత్రికలు, వార్తా ఛానల్స్ అవసరం. మీడియా ద్వారానే అని వాణిజ్య ప్రకటనల రూపంలో ప్రజలకు చేరగలగుతాయి. అలాగే మీడియాకు కూడా తమ వ్యాపారం జరగాలన్నా, ప్రజల వద్దకు చేరాలన్నా వాణిజ్య ప్రకటనలు అవసరం. ఎందుకంటే అడ్వర్టయిజ్‌మెంట్ల ఆదాయం ద్వారానే ఛానల్స్ మనగగలుగుతున్నాయి. అందుకే వాణిజ్య ప్రకటనలు, వార్తా కథనాలు పరస్పర ఆధారాలు. వార్తా ఛానల్స్ మనుగడకు ఆధారభూతం అయినందున వాణిజ్య ప్రకటనలకు రోజురోజుకూ ప్రాధన్యం పెరుగుతోంది. అయితే వార్తలు, వాణిజ్య ప్రకటనల మధ్య సమతూకం పాటించడం అవసరం. ఒక్కో సమయంలో పెద్ద పెద్ద బ్రేకింగ్ ఉన్నా ప్రకటనల జోరు తగ్గడం లేదు. ఛానల్‌లో వాణిజ్య ప్రకటనలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, వార్తలను పరిమితంగా ప్రసారం చేస్తే ఆ ఛానల్ ప్రజల ఆదరణకు దూరమవుతుంది. ఎందుకంటే ప్రజలు ఛానల్‌ను చూసేది వార్తల కోసం మాత్రమే, ప్రకటనల కోసం కాదు. ఇక వార్తలకు మాత్రవే ప్రాధాన్యం ఇచ్చి వాణిజ్య ప్రకటనలను తగ్గిస్తే, ఆదాయం తగ్గి ఛానల్ మనుగడే ప్రమాదంలో పడుతుంది.

న్యూస్ ఛానల్స్ వాణిజ్య ప్రకటనలను, వార్తల మధ్యలో ప్రసారం చేస్తుంటాయి. ప్రతి అరగంట బులెటిన్‌ను మూడు భాగాలుగా విభజించి మొదటి 7 నుంచి 8 నిమిషాలు వార్తలు... ఆ తర్వాత 2-3 నిమిషాలు ప్రకటను, మళ్ళీ ఏడెనిమిది నిమిషాల వార్తలు మళ్ళీ 2-3 నిమిషాల ప్రకటనలు ప్రసారం చేస్తాయి. మూడో భాగం కూడా ఇలాగే ఉంటుంది. న్యూస్ కాకుండా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందినప్పుడు దాని కోసం ప్రత్యేకంగా ప్రకటనలను సేకరిస్తారు.

మొత్తం వాణిజ్య ప్రకటనల ఆదాయంలో ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్స్‌కు 70% లభిస్తే న్యూస్ ఛానల్స్ వాటా 30% ఉంటుంది. ఇక న్యూస్ అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారా లభించే ఆదాయాన్ని పరిశీలించి నప్పుడు సినిమా రంగం నుంచి 20%, విద్యారంగం నుంచి 18%, రియల్ ఎస్టేట్ నుంచి 12% లభిస్తోంది. మిగిలిన 50% ఆదాయం ఆటోమొబైల్స్, కాస్మోటిక్స్, ఫుడ్స్, హోమ్ అప్లయెన్సెస్ ద్వారా లభిస్తుంది. తెలుగు న్యూస్ ఛానల్స్ ప్రేక్షకుల్లో ఏ యే వయస్సుల వారు... ఏ యే విద్యార్హతలు కలిగిన వారు, ఎలాంటి ప్రకటనలు చూస్తున్నారనే అంశంపై చేసిన పరిశోధనలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ పశీలనలో మొత్తం 250 మందిని ప్రతిచయనం (శాంపిల్)గా తీసుకోవడం జరిగింది. అలాగే ఛానల్స్‌లో ప్రసారమవుతున్న ప్రకటనల పట్ల ప్రజల్లో ఎలాంటి స్పందన వ్యక్తమవుతున్నదో సర్వేలో తెలుసుకోవడం జరిగింది. తెలుగు న్యూస్ ఛానల్స్ వాణిజ్య ప్రకటనలకు ఎలాంటి ప్రాధాన్యం ఇస్తున్నాయనే అంశాన్ని ఇప్పుడు వివరంగా పరిశీలిద్దాం...

బాంబు పేలుళ్లు, భూకంపాలు, జల ప్రళయాలు సంభవించినప్పుడు ఛానల్స్ బ్రేకింగ్ న్యూస్ ప్రసారం చేస్తుంటాయి. ప్రజల్ని భయకంపితులను చేసే, ఆసక్తి కలిగించే బ్రేకింగ్ న్యూస్ సమయంలో కూడా ఛానల్స్

**1. ప్రకటనల కోసమే న్యూస్ ఛానల్స్‌లో వినోద కార్యక్రమాలు**

| విద్యా | బలంగా నమ్ముతున్నాను | నమ్ముతున్నాను | తీవ్రంగా విభేదిస్తున్నారు | విభేదిస్తున్నారు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఎస్ఎస్‌సి | 5 | 12 | 0 | 0 | 17 |
| | 29.4% | 70.6% | 0% | 0% | 100.0% |
| ఇంటర్ | 15 | 28 | 2 | 0 | 45 |
| | 33.3% | 62.2% | 4.4% | 0% | 100.0% |
| డిగ్రీ | 29 | 96 | 8 | 1 | 134 |
| | 21.6% | 71.6% | 6.0% | 7% | 100.0% |
| పిజి & | 14 | 35 | 3 | 2 | 54 |
| ఆపైన | 25.9% | 64.8% | 5.6% | 3.7% | 100.0% |
| మొత్తం | 63 | 171 | 13 | 3 | 250 |
| | 25.2% | 68.4% | 5.2% | 1.2% | 100.0% |

Source: Field survey data

వాణిజ్య ప్రకటనలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని 78.4% మంది అభిప్రాయపడ్డారు. అయితే ముఖ్యమైన బ్రేకింగ్ న్యూస్ సమయంలో వాణిజ్య ప్రకటనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని 3.2% మంది అంటే... 18.4% మంది ప్రేక్షకులు మాత్రం కొన్ని సందర్భాల్లోనే ఎక్కువగా ఇలా అడ్వర్టయిజ్‌మెంట్లకు ప్రాధాన్యం ఇస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

న్యూస్ ఛానల్స్‌లో వాణిజ్య ప్రకటన ద్వారా వచ్చే ఆదాయం కోసమే వినోద కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారని భావిస్తున్నారా అని అడిగినప్పుడు 68.4% మంది అవుననే అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని తాము బలంగా నమ్ముతున్నట్టు 25.2% మంది చెప్పగా 5.2% మంది అలా భావించడం లేదని గట్టిగా చెప్పారు. మరో 1.2% మంది ప్రేక్షకులు మాత్రం ప్రకటనల కోసమే వినోద కార్యక్రమాలు ప్రసారం చెస్తున్నట్టు భావించడం లేదని చెప్పారు.

### ప్రకటనల కోసమే న్యూస్ ఛానల్స్‌లో వినోద కార్యక్రమాలు

తెలుగులో ఏ యే న్యూస్ ఛానల్స్‌లో వాణిజ్య ప్రకటనలు అధికంగా ప్రసారమవుతున్నాయనే అధ్యయనం ఆసక్తి కరంగా ఉంది. రేటింగ్ పరంగా, జనాదరణ పరంగా మొట్టమొదటి స్థానంలో ఉన్న TV9లో కాకుండా మిగతా ఛానల్స్‌లో (E-TVతప్ప) ఎక్కువ ప్రకటనలు ప్రసారమవుతున్నట్టు అధ్యయనంలో తేలింది. రేటింగ్స్ పరంగా Tv9 నంబర్ వన్ స్థానంలో ఉండగా Tv5, N Tv రెండు, మూడు స్థానాల్లో ఉంటాయి. Tv5 అత్యధికంగా 64.8% వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేస్తోంది. ఆ తర్వాత NTv 14% రెండవ స్థానంలో ఉంటే... 8.8%తో Tv9 మూడవ స్థానంలో ఉంది. ఆ తర్వాత V6 6.8%, TNews 5.2%, Etv 4% ప్రకటనలు ప్రసారం చేస్తున్నాయి.

**టేబుల్ 2. న్యూస్ ఛానల్స్‌లో అత్యధిక వాణిజ్య ప్రకటనలు.**

| Tv9 | NTv | Tv5 | Etv | V6 | TNews | Total |
|---|---|---|---|---|---|---|
| 22 | 35 | 162 | 1 | 17 | 13 | 250 |
| 8..8% | 14.0% | 64.8% | 4% | 6.8% | 5.2% | 100.0% |

### న్యూస్ మధ్యలో వాణిజ్య ప్రకటనలకు ప్రజాదరణ

టేబుల్ 3. న్యూస్ మధ్యలో వస్తున్న వాణిజ్య ప్రకటనలు.

| విద్యా | అవును | కాదు | మొత్తం |
|---|---|---|---|
| ఎస్ఎస్‌సి | 1 | 16 | 17 |
| | 5.9% | 94.1% | 100.0% |
| ఇంటర్ | 2 | 43 | 45 |
| | 4.4% | 95.6% | 100.0% |
| డిగ్రీ | 15 | 119 | 134 |
| | 11.2% | 88.8% | 100.0% |
| పిజి & | 9 | 45 | 54 |
| ఆపైన | 16.7% | 83.3% | 100.0% |
| మొత్తం | 27 | 223 | 250 |
| | 10.8% | 89.2% | 100.0% |

Source: Field survey data

న్యూస్ మధ్యలో ప్రసారమవుతున్న వాణిజ్య ప్రకటనల పట్ల ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని సర్వేలో తేలింది. న్యూస్ మధ్యలో వస్తున్న ప్రకటనలు చూస్తున్నట్టు కేవలం 10.8% మంది చెప్పారు. ఇలాంటి ప్రకటనలు చూడ్డంలేదని 89.2% మంది నిర్మోహమాటంగా చెప్పారు. ఇక విద్యాపరంగా ఎవరెవరు వాణిజ్య ప్రకటనలు చూస్తున్నారనే అంశాన్ని పరిశీలిస్తే... ఎస్ఎస్‌సి చదివిన వారిలో 94.1% మంది ఈ ప్రకటనలు చూడడం లేదని చెప్పారు. ఇక ఇంటర్ పాసైన వారిలో 95.6%, డిగ్రీ చదివిన వారిలో 88.8% మంది, పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిన వారిలో 83.3% మంది వాణిజ్య ప్రకటనలకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. వాణిజ్య ప్రకటనలు చూస్తున్నామని చెప్పిన వారిలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిన వారు 16.7%, డిగ్రీ పూర్తి చేసిన వారు 11.2%, ఇంటర్ చదివిన వారు 4.4%, ఎస్ఎస్‌సి చదివిన వారిలో 5.9% మంది ఉన్నారు.

ఇంతకీ న్యూస్ ఛానల్స్‌లో వచ్చే వాణిజ్య ప్రకటనలలో ఏ ప్రకటనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి? ఏ వర్గాన్ని ఉద్దేశించిన ప్రకటనలు ఆ వర్గంవారిని ఆకట్టుకుంటున్నాయి. చదువుకునే యువతీ యువకులు 17.2% ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ప్రకటనలు చూస్తున్నారు. ఆ తర్వాత సౌందర్య పోషకాలకు సంబంధించిన ప్రకటనలను 16.8% మంది వీక్షిస్తున్నారు. ఇక మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే వాహనాలకు సంబంధించిన ప్రకటనలు 10.4% మందిని ఆకట్టుకుంటున్నాయి. ఫర్నీచర్ యాడ్స్‌ను 2% మంది, ఫుడ్ ఐటమ్స్‌కు సంబంధించిన ప్రకటనలు 5.6% హెల్త్‌కు సంబంధించిన ప్రకటనలు 3.2% మంది చూస్తున్నారు.

### న్యూస్ ఛానల్స్‌లో ప్రకటనలు వస్తున్న తీరు

న్యూస్ ఛానల్స్‌లో ప్రసారమవుతున్న వాణిజ్య ప్రకటనల తీరు పట్ల ప్రజల అభిప్రాయం సేకరించినపుడు... ప్రకటనలు ఎక్కువగా ఉంటున్నాయని 72.8% మంది చెప్పారు. అయితే ప్రకటనలు మరీ ఎక్కువగాలేవని అభిప్రాయపడ్డవారు 24.8% ఉంటే... 2.4% మంది ప్రసారమవుతున్న ప్రకటనలు ఏ మాత్రం ఎక్కువ కాదని అన్నారు. ఇక విద్యార్హతపరంగా చూసినపుడు

ఎస్ఎస్‌సీ చదివిన వారిలో 82.4% మంది, డిగ్రీ చదివినవారు 72.4% పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిన వారిలో 74.1% మంది ప్రకటనలు ఎక్కువగా ఉంటున్నాయని అభిప్రాయపడుతున్నారు.

### ప్రకటనలు పురుషులు, మహిళల ఆసక్తి

న్యూస్ ఛానల్స్‌లో వస్తున్న ప్రకటనలు మహిళలు, పురుషులపై భిన్నంగా ప్రభావం చూపుతున్నాయి. సాధారణంగా ఛానల్స్‌లో ఆరోగ్యం, ఆటోమొబైల్స్, విద్యా రంగానికి సంబంధించిన ప్రకటనలు ఎక్కువగా వస్తున్నాయి. ఆరోగ్యం, ఆటోమొబైల్స్ ప్రకటనలను పురుషుల్లో 21%, మహిళల్లో 44.7% చూస్తున్నట్టు అధ్యయనంలో తేలింది. ఇక విద్యారంగానికి సంబంధించిన ప్రకటనలల మహిళలు 18.7%, పురుషులు 10.6% వీక్షిస్తున్నారు. వాహనాల ప్రకటనలను పురుషులు 12.3%, మహిళలు 2.1%, బ్యూటీ ప్రకటనలను మహిళలు 17.7%, పురుషులు 12.8% చూస్తున్నారు.

### వయస్సుల వారీగా ప్రకటనల వీక్షకులు

న్యూస్ ఛానల్స్ ప్రకటనలు వీక్షించే వారిని వయస్సుల వారీగా అధ్యయనం చేస్తే 18–30 సంవత్సరాల మధ్య వయస్సు వారు సౌందర్య పోషణకు సంబంధించిన ప్రకటనలను 19.8% మంది వీక్షిస్తున్నారు. ఈ వయస్సు వారు వాహనాల ప్రకటనలను 14%, ఫుడ్ ఐటమ్స్ 12%, బ్యూటీ అండ్ ఫుడ్ ఐటమ్స్ కలిపి 20% చూస్తున్నారు. ఇక 31–40 ఏళ్ల మధ్య వయస్సులో గల వారిలో ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ప్రకటనలను 24.1%, బ్యూటీ-ఫుడ్ ఐటమ్‌ల ప్రకటనలను 18.1%, ఎడ్యుకేషన్-ఫుడ్ ఐటమ్‌ల ప్రకటనలను 13.3% మంది చూస్తున్నారు. ఇక 41–50 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు బ్యూటీ అడ్వర్టయింజ్‌మెంట్లను 15.7%, ఫర్నీచర్-హెల్త్ ప్రకటనలను 15.6% మంది వీక్షిస్తున్నారు. 50 ఏళ్ల పైబడిన వారిలో 18.8% మంది సౌందర్య పోషణకు సంబంధించిన ప్రకటనలు చూస్తుండడం ఆసక్తికరమైన అంశం, మొత్తం మీద న్యూస్ ఛానల్స్‌లో వాణిజ్య ప్రకటనలు ఎక్కువగా వసున్నాయని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### సారంశం

వాణిజ్య ప్రకటనలే తమకు ఏకైక ఆదాయవనరు అయినప్పుడు న్యూస్ ఛానల్స్ ప్రకటనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం సహజం. అయితే ఛానళ్లు తమ ఇష్టానుసారం ప్రకటనలు ప్రసారం చేసుకోవచ్చా? వాటిపై ఎలాంటి నియంత్రణ లేదా? నెలకు 200 నుంచి 500 రూపాయలు ఖర్చు చేసి కేబుల్ లేదా డిష్ కనెక్షన్ పొందిన వినియోగదారుడి అభిప్రాయాలకు విలువ లేదా అనే ప్రశ్న ఉదయిస్తుంది. బులెటిన్లను వాణిజ్య ప్రకటనలతో నింపేసి ప్రేక్షకుడిని విసుగెత్తిస్తే వారిని కట్టడి చేయాల్సిన అవసరం లేదా?

అందుకే ఈ విషయంలో టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (TRAI) రంగంలోకి దిగింది. ఏ న్యూస్ ఛానల్ అయినా ఈ ట్రాయ్ నిబంధనల ప్రకారమే వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేయాలి. మిగిలిన సమయంలో వార్తలు మాత్రమే ప్రసారం చేయాలి. ట్రాయ్ నిబంధన ప్రకారం ఒక గంట బులెటెన్‌ను ప్రామాణికంగా తీసుకొని ఆ గంటలో 10 నిమిషాలు మాత్రమే వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేయాలి. ఆ ఛానల్‌లో ప్రసారమయ్యే కార్యక్రమాల ప్రమోషన్ కోసం మరో 2 నిమిషాలు ప్రోమోలు ప్రసారం చేసుకునే వెసులుబాటు కల్పించారు. అంటే మొత్తం 60 నిమిషాల్లో 12 నిమిషాలు వాణిజ్య ప్రకటనలు, కార్యక్రమాల ప్రోమోలు ప్రసారం చేయాలి. మిగిలిన 48 నిమిషాలు పూర్తిగా వార్తలకే కేటాయించాలి.

అయితే అమలులోకి వచ్చేటప్పటికీ న్యూస్ ఛానల్స్ ఈ పరిమితిని ఎక్కడా పాటించడం లేదు. ట్రాయ్ నిబంధనల్ని అమలు చేయడం లేదు. ఊరిస్తున్న వాణిజ్య ప్రకటనల ఆదాయం ఒకవైపు, పెరిగిపోతున్న నెలవారి ఖర్చులు మరో వైపు దీంతో ఆయా ఛానల్స్ వాణిజ్య ప్రకటనలకే పెద్దపీట వేస్తున్నాయి. గంటలో కేవలం 10 నిమిషాలు మాత్రమే వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేస్తే... ఆ ఆదాయంతో మనుగడ సాగించలేమని న్యూస్ ఛానల్స్ యాజమాన్యాల ఆవేదన. ఛానల్స్ ఖర్చును పరిగణలోకి తీసుకోని, వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొని వాణిజ్య ప్రకటనల నిడివిని పెంచాలని యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ట్రాయ్ నిబంధనలు సడలించాలని కోరుతూ పలు న్యూస్ ఛానల్స్ యాజమాన్యాలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై అటు ట్రాయ్, ఇటు న్యూస్ ఛానల్స్ యాజామాన్యాలు తమ తమ వాదనలు వినిపిస్తున్నాయి. త్వరలోనే సుప్రీం కోర్టు ఈ వాణిజ్య ప్రకటనల ప్రసారం సమయంపై తీర్పును వెల్లడించనుంది. అయితే ఎంత అయినా... ప్రేక్షకుల మనోభావాలను గౌరవించి ప్రకటనలు ఇవ్వడంలో కొన్ని కట్టుబాట్లు పెట్టుకుంటే బాగుంటుంది. ■


### యోజన చందా ఆన్-లైన్ లో

ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్-లైన్‌లో చెల్లించవచ్చు. bharatkosh.gov.in వెబ్ సైట్‌లో పబ్లికేషన్స్ డివిజన్ వారి లింక్‌ను క్లిక్ చేసి సూచనలను అనుసరించి నెట్ బ్యాంకింగ్ / క్రెడిట్ కార్డ్ /డెబిట్ కార్డ్ ద్వారా చందా చెల్లించవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/- మరియు మూడు సంవత్సరాలకు రూ. 610/- వివరాలకు సంప్రదించండి:
yojana.telugu@nic.in

# భారతీయ విద్యా విధానం - నాణ్యతా ప్రమాణాలు



ప్రస్తుత విద్యావిధానం చాలావరకు శాస్త్రీయమైన పద్ధతుల్లో సాగడం లేదనే చెప్పవచ్చు. కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలను వల్లెవేయించి పరీక్షల్లో ఉత్తీర్ణులను చేయడం వరకు మాత్రమే పరిమితం అవుతోంది. సమాజంలో చోటుచేసుకుంటున్న అసమానతలే విద్యావ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నాయి. అటు విద్యార్థులు కూడా వారి సామాజిక నేపథ్యం (కులం, మతం, వర్గం, తెగ, లింగం) ఆధారంగా కూడా వివక్షకు గురవుతున్నారు. ముఖ్యంగా విద్యావిధానంలో ఈ అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భారతీయ విద్యావిధానం చాలా భిన్నమైన విధానంగా చెప్పవచ్చు. ప్రధానంగా ఈ దేశంలో విద్యావిధానం చాలా వరకు ఒక అసమగ్రమైన రీతిలో ఉంది. ఒకవైపు విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాల బాట పడుతుంటే, మరోవైపు కనీస ప్రాథమిక విద్య కూడా కరువైన వారు ఎందరో నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. కనీసం పాఠశాల ముఖం కూడా చూడని పిల్లలు ఎందరో భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. ప్రస్తుత విద్యావిధానం చాలావరకు శాస్త్రీయమైన పద్ధతుల్లో సాగడం లేదనే చెప్పవచ్చు. కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలను వల్లెవేయించి పరీక్షల్లో ఉత్తీర్ణులను చేయడం వరకు మాత్రమే పరిమితం అవుతోంది. అంతకు మించి ఎలాంటి పరిణామం ఇందులో చోటు చేసుకోవడం లేదు. కానీ విద్యార్థి సంపూర్ణ వికాసానికి తగినట్లుగా విద్యావిధానం ఉండటం లేదు అనేది వాస్తవం. ఇందుకు చాలా కారణాలున్నాయి. ఒక వైపు పలు అధ్యయనాలు, పరిశోధనలు, విశ్లేషణలు, చర్చలు, మేధావుల సలహాలు, విద్యావేత్తల సూచనలు ఇలా చాలా ప్రయత్నాలు విద్యావిధానంలో మార్పు కోసం పనిచేస్తున్నాయి. అయినప్పటికీ విద్యారంగంలో పలు పరిమితుల కారణంగా విద్యావిధానంలో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా సమాజంలోని పలు అంశాలు విద్యావిధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

సమాజంలో చోటుచేసుకుంటున్న అసమానతలే విద్యావ్యవస్థ పై కూడా ప్రభావం చూపుతున్నాయి. అటు విద్యార్థులు కూడా వారి సామాజిక నేపథ్యం (కులం, మతం, వర్గం, తెగ, లింగం) ఆధారంగా కూడా వివక్షకు గురవుతున్నారు. ముఖ్యంగా విద్యావిధానంలో ఈ అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మనదేశంలో ఒకవైపు అత్యాధునిక, సకల సౌకర్యాలతో అలరాడే ప్రైవేటు పాఠశాలలు కనిపిస్తున్నాయి. వీటిలో చదివే విద్యార్థులకు సకల సదుపాయాలు అందుతాయి. సుశిక్షితులైన అధ్యాపకులు, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థుల మనో వికాసం కలిగించే నైపుణ్య శిక్షణ ఇలా సకల సదుపాయాలను అందుబాటులో ఉంచే విద్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఇక మరోవైపు కనీస మౌలిక వసతులు లేని పాఠశాలలు, ఖాళీ తరగతి గదులు, బోధన పట్ల ఆసక్తి లేని టీచర్లు, ఇలా పరస్పర వైరుధ్యాలు మన కళ్లముందు కనిపిస్తాయి.

**దిశానవాని,** ప్రొఫెసర్, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబాయి.
E-mail: dishanawani@yahoo.com

ఇలాంటి అంతరాలు దేశ విద్యావిధానంలోని లోపాలను బయటపెడుతున్నాయి. సమగ్ర విద్యావిధాన రూపకల్పనలో ఈ వైరుధ్యాలు ప్రతిబంధకాలుగా మారాయి. అంతేకాదు ఈ అంతరాలు విద్యావిధానంలోని మార్పు యొక్క ఆవశ్యకతను గుర్తుచేస్తున్నాయి.

అలాగే మన విద్యా వ్యవస్థపై పలు విమర్శలు ఉన్నాయి. అందులో ప్రధానంగా విద్యారంగంలోని అసమానతలపై పలు విమర్శలు ఉన్నాయి. మన దేశంలోని విద్యావ్యవస్థపై పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నో అధ్యయనం చేశాయి. అంతేకాదు పలు సంస్థలు తమ సూచనలు, సలహాలు సైతం ఇచ్చాయి. విద్యవ్యవస్థలోని ప్రధాన లోపాలను ఎత్తి చూపాయి. అందులో ప్రధానమైనది. అందరికీ సమానంగా అందాల్సిన నాణ్యమైన విద్య కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితం అవడం విచారకరమని పేర్కొన్నాయి. ప్రదానంగా నాణ్యమైన విద్య అనే పదానికి నిర్వచనం ఇస్తూ సుశిక్షితులైన అధ్యాపకులచే బోధన అలాగే మనోవికాసానికి దోహదపడే వాతావరణం ఇలా పలు అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. అయితే ఇలాంటి నాణ్యమైన విద్య కేవలం సమాజంలోని ధనిక వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉంటోంది. గ్రామీణ భారతానికి నాణ్యమైన విద్య అందుబాటులో లేదు. దీనితో అటు దేశ మానవ వనరుల నిర్మాణంపైన కూడా ప్రభావం పడుతోంది. అందులో ప్రధానంగా మన దేశం నైపుణ్యం కలిగిన మానవవనరుల కొరతను ఎదుర్కొంటోంది. ఇందుకు పరిష్కారంగా అందరికీ సమాన విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రైవేటు రంగం చేతిలో విద్య ఉండటం వల్ల అటు నాణ్యమైన విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా మారింది. ఇక సార్వజనీన విద్య అనే భావన కేవలం మాటలకే పరిమితం అయ్యింది. బాలలందరికీ నిర్బంధ, నాణ్యమైన అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. కానీ ప్రైవేటు రంగం విద్యారంగంలోకి ప్రవేశించడంతో విద్య కూడా వ్యాపారంలా మారిపోయింది. సమాన విద్య సుదూర స్వప్నంగా మిగిలిపోయింది. తరతమ బేధాలు లేకుండా పిల్లలంతా చదువుకుంటేనే ఉత్తమమైన మానవ వనరుల వికాసం అవుతుంది. లేకపోతే నిరక్షరాస్యత, డ్రాపౌట్లు పెరిగి దేశ లక్ష్యాలకు తూట్లు పడే అవకాశం ఉంది. ప్రైవేటు పెట్టుబడి విద్యలో అంతరాలు సృష్టించడంతో ధనిక వర్గాలకు నాణ్యమైన విద్య, పేదవర్గాలకు నాణ్యత లేని విద్య లభించడం జరుగుతోంది. 1990లో సరళీకృత ఆర్థిక విధానాలు దేశ సమగ్ర స్వరూపాన్ని మార్చివేశాయి. ప్రైవేటు రంగం విద్యారంగంలోకి ప్రవేశించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు వెనుకంజ వేశాయి. ముఖ్యంగా మౌలిక వసతుల విషయంలోనూ, నాణ్యమైన విద్య అందించడంలోనూ ప్రైవేటు రంగం ముందు వరుసలో నిలబడింది. అంతేకాదు అటు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పిల్లలను సైతం ఆకర్షించే పనిలో పడింది. దీంతో అందరికీ సమాన విద్య స్వప్నం కుదేలయ్యింది.

### విద్యా హక్కు చట్టం, 2009

ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయడంలో విద్యాహక్కు చట్టం 2009ని ఒక మైలురాయిగా పేర్కొనవచ్చు. ముఖ్యంగా విద్యాహక్కు చట్టం ద్వారా విద్యను పొందడం ప్రాథమిక హక్కుగా మారింది. 6 నుంచి 14 వయస్సు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య తప్పనిసరి అయ్యింది. ఈ చట్టంలో మరెన్నో అధికరణలు ఈ చట్టాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడ్డాయి. ఇందులో ప్రధానమైనది నాణ్యమైన విద్యను అందించడం. ఒక విద్యార్థి నాణ్యమైన విద్యను పొందడం హక్కుగా మారింది. నాణ్యమైన విద్యలో భాగంగా తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థుల మధ్య నిష్పత్తి, అలాగే భవనాలు, మౌలిక సదుపాయాలు, పాఠశాల పనిదినాలు, ఉపాధ్యాయుల పనిగంటలు, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగాన్ని నిరోధించడం, సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియోగించడం లాంటివి పొందుపరిచారు. అలాగే విద్యార్థులను కొట్టడం లేదా భౌతికంగా  దండించడం, విద్యార్థులను పాఠశాలలో చేర్చుకునేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించడం, కాపిటేషన్ ఫీజు వసూలు చేయడం, పాఠశాలకు గుర్తింపు లేకపోవడం లాంటి చర్యలను చట్టం నిరోధించింది. ఒక రకంగా విద్యాహక్కు చట్టం బలంగానే కనిపిస్తున్నప్పటికీ, ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే, దాంతో పాటు సమాజంపై కూడా అంతే బాధ్యత ఉంది. దేశంలోని అసమానతలు తొలగించే విద్యను అందరికీ సమానంగా అందించడం కనీస బాధ్యత.

### జాతీయ కార్యాచరణ ప్రణాళిక, 2005

వీటితో పాటు పలు అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ విషయంలో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించి దాన్ని అమలుచేసేలా ఒక కార్యాచరణ ప్రణాళిక అవసరం. అందుకే జాతీయ కార్యాచరణ ప్రణాళికను 2005 ను రూపొందించారు. ఇందులో భాగంగా ముఖ్యంగా డ్రాపౌట్లకు కారణాలను విశ్లేషించడం, అలాగే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా చేయడం వంటి అవగాహనా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. అలాగే పిల్లల సంపూర్ణ వికాసానికి తీసుకోవాల్సిన చర్యల పట్ల కూడా అవగాహన కల్పిస్తున్నారు.

### ప్రస్తుత ప్రభుత్వ పథకాలు..

ప్రభుత్వాలు కేవలం తమ విభాగాలపై ఆధారపడటం వల్ల కార్యాచరణ మందగించి

పలు విమర్శల పాలవుతున్నాయి. అయితే అందరికీ విద్యను అందించడం అనేది ప్రభుత్వ బాధ్యత. అందుకే విద్యను బలోపేతం చేసేందుకు కొన్ని ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వం పథకాలు రూపొందించాలి. ప్రాథమిక విద్యపై దృష్టి సారించడం వల్ల విద్యారంగంలో అనూహ్యమైన మార్పులు వస్తాయి. అలాగే నైపుణ్యంతో కూడిన మానవవనరుల వికాసానికి నాంది పడుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ విధానాల వల్ల విద్యకు దూరంగా ఉన్న వెనుకబడిన వర్గాల వారికి నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి. తద్వారా సామాజిక ప్రగతికి బాట వేసినట్లు అవుతుంది.

ముఖ్యంగా బేటీ బచావ్ బేటీ పఢావ్ అభియాన్ పథకం కింద పూర్తి స్థాయిలో మహిళా పాఠశాలలను నడిపే వారికి ప్రోత్సహకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 100 శాతం మహిళలను కలిగి ఉన్న విద్యాసంస్థలకు ప్రభుత్వం అవార్డులను కూడా అందజేస్తోంది. దేశంలో ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థినుల శాతాన్ని పెంచడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ).. ఉడాన్ అనే కొత్త ప్రాజెక్టును ప్రారంభించింది. టాప్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా దేశవ్యాప్తంగా ప్రతిఏటా 1000 మంది అమ్మాయిలకు ఉడాన్ ద్వారా శిక్షణనిస్తారు. వీరిలో సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల్లో ఉండేలా చూస్తారు. పదకొండు, పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థినులను జేఈఈలో విజయం దిశగా నడిపించడానికి ఉడాన్ ద్వారా ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఉచితంగా కోర్సులు నిర్వహిస్తోంది.

ఇక కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మరో పథకం 'స్వయం' స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ – లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కడ చదువుతున్నా... ఇంజినీరింగ్ విద్యార్థులు మద్రాసు, కాన్పూర్ ఐఐటీ ఆచార్యుల పాఠాల్ని అందుకోవచ్చు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆరంభించిన 'స్వయం' మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు ల ద్వారా ఇది సాధ్యం అయ్యింది. కాన్పూర్, మద్రాసు ఐఐటీలు ఇంజినీరింగ్ విద్యార్థులకే కాకుండా... ఇతర రంగాల్లోని విద్యార్థుల కోసం కూడా స్వల్పకాలిక ఆన్‌లైన్ కోర్సులు ఆరంభించారు. ఆయా ఐఐటీల్లోని ఆచార్యుల ఆధ్వర్యంలోనే వీటిని నిర్వహిస్తున్నారు. మద్రాసు ఐఐటీ నుంచి ప్రస్తుతం18 కోర్సుల్ని అందిస్తున్నారు. ఉచితంగా నిర్వహించే ఈ కోర్సుల్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి... ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు నమోదు చేసుకోవచ్చు.

అలాగే నేషనల్ ఈ లైబ్రరీ స్కీం ద్వారా ఆన్‌లైన్‌లో అన్ని సెంట్రల్ యూనివర్సిటీల లైబ్రరీలను అనుసంధానం చేశారు. దీని ద్వారా విద్యార్థులకు ప్రఖ్యాత లైబ్రరీలలోని పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాదు విద్యార్థులు సులభంగా తమ స్మార్ట్‌ఫోన్, టాబ్‌లు, లాప్‌టాప్ ల ద్వారా ఈ – లైబ్రరీలలో పుస్తకాలను చదివే అవకాశం ఉంది.

విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, అంగవైకల్యం కలిగిన వారికి ఉపకార వేతనాలు అందించేందుకు జాతీయ ఉపకార వేతన విభాగం (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్)ను ఏర్పాటు చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల వివరాలు, దరఖాస్తు విధానం, అర్హత తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

ఇక అలాగే పాఠశాల విద్యలో పురోభివృద్ధి సాధించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నేషనల్ ఎసెస్‌మెంట్ సర్వేల పేరిట ఎన్‌సీఈఆర్‌టీని వివరాలను నమోదు చేయమంది. అంతేకాదు దేశంలోని పాఠశాల విద్యను ఏకీకృతం చేస్తూ ఒక పోర్టల్ ను సైతం రూపొందించేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీని ద్వారా సుమారు 20 కోట్ల మంది విద్యార్థుల వివరాలను అనుసంధానం చేయనున్నారు. తద్వారా డ్రాపౌట్ల సంగతి కేంద్రానికి చేరుతుంది.

ఒకటి నుంచి 12వ తరగతి వరకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు ప్రాధాన్యం పెంచుతూ, వాటిపై ఆసక్తిని పెంపొందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ (రా) పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అవసరమైన చర్యలపై వివిధ రాష్ట్రాల విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) అధికారుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ పథకం కింద సైన్స్, మ్యాథ్స్, టెక్నాలజీ సబ్జెక్టులపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచి, ఆయా రంగాల వైపు వారిని మళ్లించాలని స్పష్టం చేసింది.

ఇలా ప్రభుత్వం పలు విధాలుగా యువతలోనూ, చిన్నారుల్లోనూ విద్యను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇది ఒక రకంగా ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం, అలాగే విద్యాహక్కుచట్టం కఠినంగా అమలు చేయాల్సి ఉంది. ముఖ్యంగా సర్వేల ద్వారా విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించవచ్చు. జాతీయ ప్రణాళిక, విద్యాహక్కు చట్టం సరిగ్గా అమలు చేయడంతో ప్రభుత్వం ఏర్పరచుకున్న లక్ష్యాలను సాధించవచ్చు.

■

**అవకాశాల దన్ను**

# నైపుణ్యాభివృద్ధి, ప్రైవేటు రంగం




**2030 సంవత్సరం నాటికి భారతదేశం బిలియన్ మంది కార్మికులకు ఇల్లుకాగలదు. సేవారంగ ఆర్థికవ్యవస్థగా దేశం పటిష్టమవ్వాలంటే మనకు ఉన్న మానవవనరుల శిక్షణ, నైపుణ్యాభివృద్ధిని సాధించి, దీన్ని ఒక మానవ పెట్టుబడిగా మార్చడం అత్యవసరం. భారత జనాభా 2025 నాటికి ప్రపంచ కార్మిక శక్తి వాటాలో 35శాతానికి చేరుకోనుంది. పెద్దఎత్తున ఉన్న ఆర్థిక ఆస్తులు తమ సామర్థ్యాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి.**

నైపుణ్యమైన, చవకైన కార్మికుల లభ్యత అనే ప్రయోజనకర అంశాలు ప్రపంచ స్పర్ధపూర్వక వాతావరణంలో కూడా భారతదేశాన్ని జ్ఞానవంత సమాజంలో తనదైన స్థాయిలో ఉంచుతాయి. రానున్న 2030 నాటికి భారతదేశం బిలియన్ మంది కార్మికులకు ఇల్లుకాగలదు. దేశ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి విద్య, శిక్షణలాంటివి ప్రణాళికయుక్త అవసరాలుగా ఉన్నాయి. సేవారంగ ఆర్థికవ్యవస్థగా దేశం పటిష్టమవ్వాలంటే మనకు ఉన్న మానవవనరుల శిక్షణ మరియు నైపుణ్యాభివృద్ధిని సాధించి, దీన్ని ఒక మానవ పెట్టుబడిగా మరల్చడం అత్యవసరంగా ఉంది. ఇప్పటికే నైపుణ్యశిక్షణ అనేది శిక్షకుల లేమితో భారంగా మారింది. దీంతో సుశిక్షితులైన పని వారి కొరత మనకు ఉంది. అయితే మానవవనరుల అభివృద్ధి దేశ సర్వోముఖాభివృద్ధికి గీటురాయిగా ఉంది. భారత జనాభా 2025 నాటికి ప్రపంచ కార్మికశక్తి వాటాలో 35శాతానికి చేరుకోనుంది. పెద్దఎత్తున ఉన్న ఆర్థిక ఆస్తులు తమ సామర్థ్యాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి. దీన్ని మనం పరపతిగా వినియోగించుకుని మన లక్ష్యాలను మరియు సామర్థ్యాలను సాధించాలి. దేశంలోని ఉన్న భారీ మానవ సంపదను దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి కల్పించాల్సి ఉంది. గత ఏడాది జూలైలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ.1500 కోట్లతో ప్రారంభించిన స్కిల్ ఇండియా కార్యక్రమం 2020 నాటికి 40 కోట్ల మందిని నైపుణ్య పనివారిగా తీర్చిదిద్దడానికి లక్ష్యించింది. దీనిలో భాగంగానే జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్, జాతీయ నైపుణ్యాభివృద్ధి పాలసీ, ప్రధానమంత్రి కౌషల్ వికాస్ యోజన లాంటి నైపుణ్య పథకాలను ప్రారంభించారు. ఇది పెద్ద కార్యమైనప్పటికీ 2022 నాటికి 500 మిలియన్ల మందికి నైపుణ్య విద్యను అందించే లక్ష్యాన్ని పూర్తి చేయడానికి స్పష్టత ఉంది. పదకొండవ పంచ వర్ష ప్రణాళికలో నైపుణ్య విద్యపై దృష్టిసారించకపోవడంతో పెద్ద ఎత్తున నైపుణ్యంలో వెనుకపడాల్సి వచ్చింది. ఇదే సమయంలో దేశంలో అభివృద్ధి రెట్టింపు అవ్వడంతో నైపుణ్య కార్మికుల అవసరం పదింతలైంది. దీంతో అన్ని రంగాల్లో నైపుణ్య కార్మికుల కొరత ఎదురైంది. ఉద్యోగాల కరువు అనేది లేనప్పటికీ నైపుణ్య కార్మికుల కొరత అనేది మనను వెంటాడింది. నైపుణ్య కార్మికులే

**ప్రమోద్ భాసిన్,** ఛైర్మన్, జెన్‌పాక్ట్ సంస్థ.
E-mail: zorema.darkim@skillsacademy.co.in

వేగంగా వృద్ధి సాధిస్తున్న పరిశ్రమలకు అండగా ఉంటారు. దేశంలో ఏటా ఉద్యోగాల్లో చేరుతున్న 30 లక్షల మంది స్నాతకుల్లో కేవలం ఐదు లక్షల మందే ఉద్యోగార్హత ఉన్నవారు. ఐటి, బిఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మౌలికసదుపాయాలు, ఆటో, వినియోగ వస్తువులు, రిటైల్ రంగాల్లో నైపుణ్య కార్మికుల కొరత ఉంది. ఒక సర్వే ప్రకారం దేశంలో వెయ్యికి కేవలం 10 మంది మాత్రమే వృత్తి విద్యను అభ్యసించి ఉన్నారు. జాతీయ సాంపిల్ సర్వే వృత్తి విద్య గణాంకాల ప్రకారం 2011-12లో 15-59 వయస్సులో ఉన్న వారు 2.2 శాతం మంది మాత్రమే వృత్తి విద్యను అభ్యసించారు. అలాగే 8.6శాతం మంది సాధారణ వృత్తి విద్యను అభ్యసించారు. అయితే 2004-05 సంవత్సరాల్లో వృత్తి శిక్షణ పెరిగింది. అయితే దీనిపై గణాంకాలను మాత్రం 2011-12లో మాత్రమే సేకరించారు. ఈ వృద్ధికి కారణం 15-59 మధ్య వయస్సు ఉన్న వారు ప్రపంచంలోనే రెండోవ అత్యధిక సంఖ్యలో ఉండటంతో 2009లో యూపిఏ ప్రభుత్వం జాతీయ నైపుణ్య ప్రణాళికను ప్రకటించడమే. ఈ వయస్సు జనాభాయే అభివృద్ధికి కీలకం కావడంతో వీరికి నైపుణ్య విద్యను అందించే అవశ్యకత ఏర్పడింది. వీరిని సుశిక్షుతులుగా చేసి జాతివనరుగా మార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రస్తుతం వృత్తి విద్య లక్ష్యం కార్మికులను పరిశ్రమలకు అందించడమే కాకుండా వారిని నైపుణ్య కార్మికులగా మరల్చడంపై కేంద్రీకరించబడింది. వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో ప్రైవేటు రంగం భారత నైపుణ్య వాతవరణంలో ఒక ప్రముఖ భూమికను నిర్వర్తిస్తోంది. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించే రంగంగా ఉన్న ప్రైవేటు రంగం నైపుణ్య పరిణామం, నైపుణ్యం, సుస్థిర నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ప్రభావితం చేస్తోంది. ఇది సంఘటిత మరియు అసంఘటిత రంగంలోని ఎందరికో ఉపాధినందిస్తోంది. అయితే చాలా ప్రైవేటు రంగాలు నైపుణ్య శిక్షణ పై పెట్టుబడులు మాత్రం విస్మరించాయి. ప్రపంచలోని చాలా దేశాలు నైపుణ్యాభివృద్ధిపై దృష్టిసారించాయి. ఇది వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధి కాదనే యావత్ జాతి అభివృద్ధిగా సంకల్పిస్తున్నాయి. అయితే ప్రైవేటు రంగం నైపుణ్య రంగ వినియోగదారుడి పాత్రను, అలాగే నాణ్యత జ్ఞానానికి లాభేతర-సదుపాయ సంధాత (నాన్-ప్రోఫిట్ ఫెసిలిటేటర్)గా, లాభదాయ-సంస్థ (ప్రోఫిట్ ఎంటర్‌ప్రైజెస్)గా ఉంది. మొదటిగా ఒక వినియోదారుడిగా ప్రైవేటు రంగం అందుబాటులో ఉన్న మానవశక్తికి శిక్షణనివ్వడంతో పాటు వారికి ఉపాధి కల్పిస్తోంది. అలాగే లాభేతర-సదుపాయ సంధాతగా కార్పొరేట్‌రంగం సమాజంలోనికి నిధులను, పెట్టుబడులను తీసుకువస్తోంది. లాభదాయక-సంస్థగా ఈ రంగం విద్య మరియు శిక్షణను కల్పించడానికి స్కూళ్లు, యూనివర్సిటీలు లాంటి శిక్షణ సంస్థలను ఏర్పాటు చేస్తోంది.

**వివిధ మార్గాల్లో ప్రైవేటు రంగం దేశ నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోంది.**

**పరిశ్రమ అవసరాల అంచనా :**

పరిశ్రమలకు మానవ శక్తి యొక్క అవసరాలకు అనుగుణంగా ప్రైవేటు రంగం వనరులను అంచనా వేస్తోంది. సరఫరా, డిమాండ్‌లకు అనుగుణంగా నైపుణ్య మానవ శక్తి వనరులను అంచనా వేస్తోంది. ఈ రంగం ఉద్యోగులను, కాంట్రాక్టు ఉద్యోగులను, వేతన కూలీలను సృష్టించడంతో పాటు వారిని తమలో ఇమడ్చుకుంటోంది. డిమాండ్ అంచనాలకు అనుగుణంగా వారిని శిక్షితులుగా, ఉద్యోగార్హులుగా సంసిద్ధంగా ఉంచుతోంది. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యోగుల జాబితాలు, వారి వేతనాలు, స్థానం, పరిమాణం లాంటి ప్రణాళికలను ప్రైవేటు రంగం సిద్ధంగా ఉంచుతోంది. దీంతో నైపుణ్యం మరియు ఉద్యోగాల మధ్య ఉన్న తారతమ్యరేఖ తొలిగిపోతోంది.

**నాణ్యత మరియు పరిశ్రమల స్థాయి నిర్ణయం :**

ప్రైవేటు రంగం నైపుణ్యం మరియు ప్రస్తుత ఉద్యోగాల మధ్య ఉన్న ఖాళీలను పూరించడానికి యత్నిస్తోంది. దీనికై జాతీయ వృత్తి నాణ్యత ప్రమాణాలకు (నేషనల్ అక్యూపేషనల్ స్టాండర్డ్స్) అనుగుణంగా నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు చేపడుతోంది.

**శిక్షణా సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యం:**

అన్ని ప్రైవేటు కంపెనీలకు సంస్థాగతంగా శిక్షణా, అభివృద్ధి, రూపకల్పన అనేవి సాధ్యకాదు. దీంతో అయా సంస్థలు ఇతర శిక్షణా సంస్థల భాగస్వామ్యంతో శిక్షణను తీసుకొని తమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య పనివారిని సిద్ధం చేసుకుంటున్నాయి.

**పరిశ్రమలకు అనుగుణంగా ఉద్యోగ శిక్షణ మరియు పారిశ్రామిక శిక్షణ :**

పారిశ్రామిక శిక్షణ మరియు పరిశ్రమతో పరిచయం, అనుభవంలాంటి విషయాల పట్ల అవగాహన పెరుగుతోంది. దీంతో ప్రైవేటు రంగం ఆన్ -జాబ్- ట్రైనింగ్ పేరిట శిక్షణార్థులను చేర్చుకోవడానికి తన ద్వారాలు తెరుస్తోంది.

**నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సిఎస్ఆర్ నిధుల కేటాయింపు:**

ప్రైవేటు రంగం వద్ద వృత్తి విద్య మరియు శిక్షణకు కావాల్సిన నిధులు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు రంగం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) క్రింద కేటాయించే నిధుల్లో రెండు శాతం నిధులను తప్పనిసరిగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలి. ■

# అన్ని శాస్త్రాలతో బంధం - గణాంకశాస్త్రం




**గణాంకశాస్త్రం పరిమాణాత్మక (Quantitative) సమాచారంతోను, పద్దతులతోను వ్యవహరిస్తుంది. ఈ శాస్త్రం శాస్త్రీయపద్దతిలో తగిన దత్తాంశాన్ని (Data) సేకరించి దాన్ని గణాంక పట్టీలరూపంలో (Tabulation Tables) విశ్లేషించి కొన్ని వ్యాఖ్యానాలు చేస్తుంది. ఈ శాస్త్ర అధ్యయనం వలన గణాంకశాస్త్ర రేఖా చిత్రాలను ప్రమాణీకరణ పద్ధతి, చర్యాత్మక పరిశోధన (Action Research) చేపట్టగలుగుతారు.**

దేశప్రగతిని మదింపు చేయడానికి, శాస్త్ర సాంకేతికరంగాలలో పరిశోధనలు చేయడానికి, దేశ అవసరాలకు తగిన రీతిలో జాతీయ నాణ్యతా ప్రమాణాలను రూపొందించి స్థిరీకరించడానికి, వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడానికి ఏర్పడినది ''నేషనల్ స్టాటిస్టికల్ కమీషన్''. దేశప్రగతిలో గణాంకశాస్త్రం ముఖ్యపాత్ర పోషిస్తోందని, ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఆర్డర్‌కు తగినట్లు నాలెడ్జ్ ఎకానమీ తయారు అయ్యేందుకు ప్రధానపాత్ర పోషించేది గణాంకశాస్త్రం (Statistics) అని "Statistics Day"ను జూన్ 29 జరుపుకోవాలని 2007వ సంవత్సరంలో ఆనాటి భారత ప్రధాని ప్రకటించారు. "Statistics" విశ్వవిద్యాల యాలలో ఒక ప్రధాన అంశంగా, విభాగంగా ఏర్పడడానికి అనితరకృషి చేసిన వ్యక్తి "ప్రశాంత చంద్ర మహలనోబిస్" జయంతిని "Statistics Day"గా గుర్తించి ఆ మహనీయునికి జ్ఞాననివాళి అర్పించారు.

"Statistics " అనే ఆంగ్లపదానికి తెలుగులో ''గణాంకశాస్త్రం'' అనిపేరు "లాటిన్‌పదమైన" ""Status" అనే పదము నుండి "Statistics"అనే ''ఆంగ్లపదం'' పుట్టింది. లాటిన్‌లో "Status" అంటే ''రాజ్యము'' అని అర్థం పూర్వం రాజ్యాధికారులు సైనిక, ఆర్థిక ప్రయోజనాలకోసం జనాభాకు, ఆస్థికి సంబందించిన సమాచారాన్ని సేకరించేవారు. ఆ విధంగా సేకరించిన సమాచారాన్ని "స్టాటిస్టిక్స్" అనేవారు. ఇలా "స్టాటిస్టిక్స్" రాజుల శాస్త్రంగాను రాజ్యాంగ శాస్త్రంగాను ఆవిర్భవించింది.

### సాంఖ్యకశాస్త్రం - చారిత్రక నేపధ్యం :

అరిస్టాటిల్ కాలంనుండి గణాంకశాస్త్ర విభాగం ఉందంటారు. ఆనాటి పరిపాలకులు ఆసక్తి కలిగించే సమాచార సముచ్ఛయాన్ని ఈ విభాగంగా పేర్కొనేవారు. క్రీ.పూ. 3వ శతాబ్దంలో కౌటిల్యుడు రచించిన "అర్థశాస్త్ర" లో ఇటువంటి వివరాలు ఉన్నాయని వివరిస్తారు. అక్బర్‌కాలంలో ఈ శాస్త్రపరమైన వ్యవస్థలు మెరుగుపడ్డాయి. 1862లో ఆనాటి భారత ప్రభుత్వం వాణిజ్యం, విద్య, జనాభా, వ్యవసాయం, ఆర్థికరంగాలలో మెరుగైన సమాచారం రాబట్టే విధానాలకోసం ఒక కమిటీని ఏర్పాటుచేసింది.

### గణాంకశాస్త్రం - అధ్యయనశాస్త్రంగా "మహలనోబిస్ కృషి" :

"స్టాటిస్టిక్స్" శాస్త్రంగా ఎదగడానికి మహోన్నతమైన కృషిచేసిన "ప్రశాంతచంద్ర మహలనోబిస్'' 1893 జూన్ 29న కోల్‌కతాలో జన్మించారు. 1912లో ఫిజిక్స్ ఆనర్స్‌తో, 1913లో కేంబ్రిడ్జిలో ట్రిపోస్ పరీక్ష పూర్తి చేశాడు. భారతదేశం తిరిగి వచ్చిన

**సుసర్ల మాధవి**, ఫ్రీలాన్సర్.
E-mail: madhavi221547@gmail.com

తర్వాత మొదటి ప్రపంచ యుద్ధం (1914-18) కారణంగా మళ్ళీ విదేశం వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకునిగా చేరాడు.

''మహలనోబిస్'' గణాంకశాస్త్ర అధ్యయనం ఇంటివద్దే చేసేవాడు. 1920లో "నాగపూర్ సైన్స్ కాంగ్రెస్"లో డాక్టర్ ఎన్. అన్నాడేల్‌ను కలిసి వారి పరిశీలన కోసం 300 మంది ఆంగ్లో-ఇండియన్ ముఖాలకు సంబంధించిన సమాచారం సేకరించారు. ఈ సమాచారం నుండి నిజమైన ఇండో, యూరోపియన్ జాతుల మిశ్రమం ఏమిటో వివరించగలమని భావించారు. గణాంక విశ్లేషణ కొరకు శరీరశాస్త్ర సమాచారాన్ని మహలనోబిస్‌కు అన్నాడేల్ ఇచ్చారు. మహలనోబిస్ తన "The Statistical analysis of Anglo - Indian Stature" అనే పరిశోధనా పత్రాన్ని 1922లో ప్రచురించారు. ఈ పరిశోధనా పత్రాన్ని "Director General of Observatory" గిల్బర్ వాకర్ అభిప్రాయం కోసం పంపారు. వారు మహలనోబిస్‌కు వేరొక అంశం సూచించారు. అది వాతావరణ సంబంధమైనది.

**అధ్యయనం, పరిశోధన:**

మహలనోబిస్, సముద్రమట్టానికి నాలుగు కిలోమీటర్ల పైభాగాన ఉండే వాతావరణ పరిస్థితి ఆధారంగానే మిగిలిన అంశాలు లోబడి ఉంటాయని చెప్పారు. ఇదే విషయం కొన్ని సంవత్సరాలతర్వాత ఎఫ్.బార్ అనే జర్మనీ శాస్త్రవేత్త భౌతికశాస్త్ర పరిశోధన ద్వారా ధృవీకరించారు.

1922, 1926లో ఉత్తరబెంగాల్, ఒరిస్సాల్లో వరదలు రావడంతో వరదల నియంత్రణ విషయమై మహలనోబిస్‌ను పరిశీలించమన్నారు. మహలనోబిస్ 60 సంవత్సరాలుగా ఆప్రాంతంలో పడిన వర్షపాతం, సంభవించిన వరదల గురించి పెద్దఎత్తున సమాచారం సేకరించారు. ఈ అధ్యయనంలో తెలిసిన ఫలితాలు, దామోదర్ వ్యాలీప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్టులకు ఎంతో ఉపకరించాయి.

1924లో వ్యవసాయ పరిశోధన ఫలితాలలో (Probable Error) సంభావ్యతాదోషం గురించి ఒక పరిశోధనాపత్రం వ్రాశాడు. ఈ పరిశోధనా వివరాలు పరిశీలించిన ఇంగ్లాండ్ శాస్త్రవేత్త రోనాల్డ్ ఆయ్‌ల్మర్ ఫిషర్ ఇంగ్లాండ్‌కు మహలనోబిస్‌ను ఆహ్వానించాడు. 1929లో ఫిషర్ సూచన మేరకు "Indian Council of Agricultural Research Institution" ఏర్పడింది. ఈ సంస్థలో మహలనోబిస్‌తో పాటు సుఖేందుశేఖర్ బోస్, సుధీర్ కుమార్ బెనర్జీ అనే యువ శాస్త్రవేత్తలు ఉన్నారు. 1931 డిసెంబర్ 17న "Indian Statistical Institute" (ISI)ను మహలనోబిస్ ప్రారంభించారు. 1933 జూన్‌లో "సంఖ్య" అనే జర్నల్‌ను కూడ ప్రారంభించారు. ఈ Journal ఎన్నో పరిశోధనలకు తోడ్పడి ఎంతో పేరుగాంచింది.

1937లో బెంగాల్ ప్రాంతంలో జనుము (Jute) పంటకు సంబంధించి జరిగిన సర్వేలో మహలనోబిస్ సాంకేతిక పరమైన తోడ్పాటునిచ్చారు. ఇది "Large Scale Sample Survey" ఈ సమయంలోనే Philosophy Professor బ్రజేంద్రనాద్‌సీల్ కలకత్తా విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం కమిటి చైర్మన్‌గా పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని గణాంకశాస్త్ర పద్ధతుల ద్వారా విశ్లేషించమని మహలనోబిస్‌ను కోరాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సీల్ మహాశయుడు భారతదేశానికి "స్టాటిస్టిక్స్" అవసరం ఉందని, విద్యాలయాల్లో అది ఒక విభాగం కావాలని మహలనోబిస్‌ను ప్రోత్సహించారు.

Randomగా తీసుకున్న అంశాలు నమూనాలు ఎలాలెక్కకట్టవచ్చునో, ఫలితాలు సక్రమంగా వస్తాయా ఇలాంటి సందేహాలతో ఆనాడు Sample Survey పేరు పొందలేదు. 1938లో భారతదేశంలో Statistical Conference ఏర్పరచి దానికి ఫిషర్‌ను ఆహ్వానించారు. ఫిషర్ "Sample Survey" విధానాన్ని సమర్థించాడు. మన ప్రభుత్వానికి Sample Survey అవసరాన్ని Letter ద్వారా తెలిపారు. దీనికి శిక్షణా కార్యక్రమాలు అవసరమన్నారు. అదే సంవత్సరం కలకత్తాలోని Indian Science Congress Conference జరిగింది. మహలనోబిస్ Science Congress లో ఒక విభాగంగా "Statistics"ను ప్రారంభించమనికోరారు. అక్కడి సైన్స్ శాస్త్రవేత్తలు "జ్యోతిష్యానికి" కూడా ఒక విభాగం ప్రారంభించాలని వేళాకోళం చేశారట. మహలనోబిస్ ఎంతో బాధపడ్డారట.

మహలనోబిస్ జవహర్‌లాల్ నెహ్రూను ఒకసందర్భంలో కలవడం జరిగింది. మహలనోబిస్ ''ప్రణాళికలు దేశానికి ఎలా ఉపయోగపడతాయో, ప్రణాళికలకు గణాంక శాస్త్రం ఏ విధంగా ఉపయుక్తమవుతుందో స్పష్టంగా నెహ్రూకు తెలియచేశారు.'' 1940లో National Planning Committee వార్షిక సమావేశంలో నెహ్రూ "స్టాటిస్టిక్స్" గురించి ప్రస్తావించారు. కమిటీ నివేదికకు అనుబంధంగా స్టాటిస్టిక్స్ గురించి మహలనోబిస్‌తో రాయించారు.

"కృషిచేస్తే సాధించలేనిది ఏదీలేనట్టు" మహలనోబిస్ పడినకష్టానికి, చేసిన కృషికి 1942లో "Science Congress" గణిత, గణాంక శాస్త్రాలకు ఒకే విభాగం ఏర్పరచింది. 1945 తర్వాత ''గణితశాస్త్రానికి, "గణాంకశాస్త్రానికి" ప్రత్యేకంగా విభాగాలు ఏర్పరచినది. విశ్వవిద్యాలయాలలో "స్టాటిస్టిక్స్" విభాగం ప్రారంభమైనది.

స్వాతంత్ర్యానంతరం మంత్రి మండలి (Cabinet)కు స్టాటిస్టిక్స్ గౌరవ సలహాదారుగా మహలనోబిస్‌ను నియమించారు.

"Indian Statistical Institute" స్థాపనకు, ప్రణాళికారచనకు మహలనోబిస్ చేసిన కృషి అపారం. ఆయన 1972 జూన్ 28న మరణించారు. ■

మీకు తెలుసా?

## అంతర్జాతీయ యోగ దినోత్సవం

ప్రపంచవ్యాప్తంగా యోగసాధనకున్న ఆదరణను చూసి, ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరమూ, జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగ దినోత్వంగా జరపాలని ప్రకటించింది.. మనదేశం చేసిన ఈప్రతిపాదనకు 175 దేశాలు మద్దతు పలికాయి. ఐక్యరాజ్య సమితి 69వ సాధారణ సమావేశం సంధర్భంగా మన ప్రధాని మొదట ఈ ప్రతిపాదనచేసారు. అత్యంత పురాతనమైన మానసిక, ఆధ్యాత్మిక క్రమశిక్షణా సాధనమైన ఈ యోగ అనే పదం యుజ్ అనే సంస్కృత పదం నుండి వచ్చింది. యుజ్ అంటే ఆత్మ–పరమాత్మల అనుసంధానం. ప్రజా బాహుళ్యంలోకి దీనిని మరింత విరివిగా తీసుకెళ్ళడానికి అనేక దేశాలలో, ఈ అంశంపై అనేక పరిచయ సదస్సులు, సాధనా తరగతులను నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం కొత్తఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ యోగ ఉత్సవంలో 84 దేశాలనుండి 35,985 మంది పాల్గొని గిన్నెస్ బుక్‌లో చోటు సంపాదించారు.

ఈ ఉత్సవ అధికార చిహ్నంలో ముకుళించిన హస్తాలు, ఆత్మ–పరమాత్మల సంయోగానికి గుర్తు. కిందనున్న ముదురు గోధుమరంగు ఆకులు భూమికి, ఆకుపచ్చని ఆకులు ప్రకృతికీ, నీలిరంగు నీటికీ చిహ్నాలు. వెలుతురు అగ్నికి, సూర్యుడు శక్తికీ, ప్రేరణకు చిహ్నం. యోగలో ప్రధానమైన శాంతి, సఖ్యత, మానవతలను ఈ చిహ్నం ప్రతిబింబిస్తుంది.

ఐ ఐ ఐ ఐ

## భారతీయ విశ్వ విద్యాలయాలలో యోగాధ్యయనం.



యోగలో స్నాతకోత్తర (Post Graduation) స్థాయి విద్యను మన దేశంలో 25 విశ్వ విద్యాలయాలు, 18 కళాశాలలు అందచేస్తున్నట్లు ఉన్నత విద్యపై 2014-15లో చేసిన ఒక సర్వే తెలియచేస్తున్నది. వీటిలో విశ్వ విద్యాలయాల అనుదాన సంఘం గుర్తింపు ఉన్నవి కేవలం రెండే! ఒకటి అహ్మదాబాదులోని లొకులిష్ యోగ విశ్వవిద్యాలయం, రెండవది బెంగుళూరులోని స్వామి వివేకానంద యోగ అనుసంధాన్ సంస్థాన్ (డీమ్డ్ యూనివర్సిటీ).

విశ్వ విద్యాలయాలలో యోగ విద్య పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. యోగ గురువుల విద్యార్థుల పరిశీలన, నిర్ణయం దీని ప్రధాన విధి. ఈ సంఘం చేసిన సిఫారసులలో, ఆరు నుండి పన్నెండు నెలల కాలవ్యవధి కల యోగ సర్టిఫికేట్ కోర్సులు, మూడు నుండి ఆరు సంవత్సరాల కాలవ్యవధితో డిగ్రీ కోర్సులు, ఒకటి లేద రెండు సంవత్సరాల స్నాతకోత్తర డిప్లొమా కోర్సు, యోగ థెరపీ డిప్లొమా, మరియు, పి.హెచ్ డి కోర్సు వంటి వివిధ రకాల కోర్సుల ప్రారంభానికి తగిన సూచనలనూ, సలహాలనూ ఈ సంఘం చేస్తుంది.

ఐ ఐ ఐ ఐ ■

Publishing date 1st June 2016, Posted on 2-3 June 2016
Yojana (Telugu) June 2016 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17


# విజ్ఞాన ప్రదాయిని యోజన మాస పత్రికకు చందాదారునిగా చేరండి




**వివరాలకు**
**ఎడిటర్,**
**యోజన** (తెలుగు)
**205, 2వ అంతస్తు,**
**సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80**
**040-27546312, 27546313 & 14**
E-mail: yojana_telugu@yahoo.co.in
yojana.telugu@nic.in

## చందా వివరాలు

సంవత్సరానికి రూ. 230/-
రెండు సంవత్సరాలకు రూ. 430/
మూడు సంవత్సరాలకు రూ. 610/-


Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India. and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314